మాగజైన్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 136 పేజీలు: 10+4 వెల: 6.50


ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

కర్ణాటకలో మళ్లీ రిసార్ట్ రాజకీయాలు

5






## స్లోవేకియాతో భారత్ వాణిజ్య బంధం

**డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాలలో ద్వైపాక్షిక ఒప్పందాలు**

**భారత్‌కు రావాలని స్లోవేకియా పిఎం రాబర్ట్ ఫికోకు ప్రధాని మోడీ ఆహ్వానం**



బ్రటిస్లావాలో స్లోవేకియా పిఎం ఫికోతో ప్రధాని మోడీ

**బ్రాటిస్లావా, జూన్ 15:** స్లోవేకియాలో తొలిసారిగా పర్యటించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ, స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో సోమవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. డిజిటల్ టెక్నాలజీలు, రక్షణ, సైబర్ సెక్యూరిటీ, శాస్త్రీయ పరిశోధన, మొబిలిటీ, వర్ధమాన టెక్నాలజీల రంగాలలో అనేక ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా భారత్ స్లోవేకియా సంబంధాలను 'కాంప్రెహెన్సివ్ పార్ట్‌నర్‌షిప్' స్థాయికి తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు మోడీ ప్రకటించారు. ఈ భాగస్వామ్యం ఉమ్మడి విలువలు, ప్రాధాన్యతలు, భవిష్యత్ లక్ష్యాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి ఉన్నతీకరించారు. ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. ద్వైపాక్షిక చర్చల అనంతరం బ్రాటిస్లావాలో విడుదల చేసిన సంయుక్త పత్రికా ప్రకటనలో ప్రధాని మోడీ, తనకు లభించిన ఆత్మీయ స్వాగతానికి ఫికోకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనను భారతదేశానికి సన్నిహిత మిత్రుడిగా అభివర్ణించారు."ఆయన >>2

## అమెరికా-ఇరాన్ శాంతి బాట

**ట్రంప్ వెల్లడి, ఇరాన్ ధ్రువీకరణ**

**ఆ డీల్ తమకు తెలీదన్న ఇజ్రాయెల్**

**19న ఒప్పందంపై సంతకాలు!**




**వాషింగ్టన్/టెహ్రాన్, జూన్15:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరపడింది. దౌత్యపరమైన చర్చలు సఫలీకృతమైందని, గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ముగింపు పడిందని అమెరికా అధినేత స్పష్టం చేశారు. అమెరికా – ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినట్లు ప్రపంచ దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుభవార్త చెప్పారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం >>2

# కిషన్‌వల్లే మెట్రో చిక్కులు

**రుణం ఇవ్వలేదు.. ఎన్వోసి కూడా ఇవ్వరా?**

**కెసిఆర్ డైరెక్షన్‌లోనే కిషన్ కదలికలు**

**తెలంగాణపై కేంద్రానికి ఇంత వివక్ష దేనికి?**

**ఐఆర్‌ఎఫ్‌సి లోన్ రూ. 13,600 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయండి**

**సచివాలయంలో మీడియాతో సిఎం రేవంత్**



సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్15:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి అంటూ ప్రతి సవాల్ విసిరారు. సోమవారం సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానంచెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడంలేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు. మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని >>2

## అధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలి

**చేసిన మంచిని చెప్పాలి: సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్15:** రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం >>2




5

## ఎల్‌నినో ప్రభావం మరింత అధికమే

**కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్**

**దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరం**

**నిరంతర సంస్కరణలు అవసరమని స్పష్టీకరణ**




## నేటి నుంచి 'టెట్'

**22 దాకా సాగనున్న పరీక్షలు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 15:** తెలంగాణ రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) – 2026 పరీక్షలను నేటి (మంగళవారం) నుంచి నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఈనెల22 వరకు కొనసాగనున్నాయి.పరీక్షలను 5 రోజులపాటు 10 సెషన్‌లలో నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు >>2

## విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

**29 లక్షల మందికి లబ్ధి**

**లోక్‌భవన్ స్కూలులో పథకం ప్రారంభించిన మంత్రి పొన్నం**

**యేటా 800 కోట్ల ఖర్చు**



సోమవారం లోక్‌భవన్ పాఠశాలలో విద్యార్థికి బ్రేక్‌ఫాస్ట్ తినిపిస్తున్న మంత్రి పొన్నం

మోగిన బడిగంట 3

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 15:** రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌తోపాటు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అల్పాహారం(బ్రేక్‌పాస్ట్) పథకాన్ని ప్రారంభిస్తున్నామని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం అమలు చేయనున్నట్టు తెలిపారు. పిల్లలందరూ మానసికంగా, శారీరంగా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని మంత్రి స్పష్టం చేశారు. బ్రేక్‌పాస్ట్ పథకాన్ని మంత్రి సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మిల్క్ పథకాన్ని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యశస్వినీ రెడ్డి, కలెక్టర్ ప్రియాంక ఆలా, డీఈవో యాదయ్య, మన్నా ట్రస్ట్ సీఈవో లీనా జోసెఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివే 29 లక్షల >>2

# ఇది ప్రమాదకర సందర్భం

**'సర్'ను ఆషామాషీగా తీసుకోవద్దు..**

**గాంధీభవన్‌లో వార్‌రూమ్ ఏర్పాటు చేయండి: సిఎం రేవంత్**

**నిర్లక్ష్యం వహిస్తే ఓట్లు గల్లంతు: డి.సిఎం భట్టి**

**జూమ్ మీటింగ్‌లో మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్**





**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్15:** కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న సర్ ప్రక్రియపై తెలంగాణ కాంగ్రెస్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈనెల 25 నుంచి సర్ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసేందుకు సోమవారం సాయంత్రం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జూమ్ మీటింగ్ సమావేశం జరిగింది. జూమ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ విషయంలో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలి, ఎస్ఐఆర్‌లో భాగంగా రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓట్లలో మెజారిటీశాతం ఓట్లను ఏదో ఒక కారణంతో పక్కన పెట్టారు. అనుమానాస్పదం పేరుతో వాటిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. అదే జరిగితే రాజకీయంగా అత్యంత ప్రమాదకరపరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. 2028 ఎన్నికలకు 2026 అక్టోబరులోనే ఓటర్ల జాబితా ఫైనల్ అవుతుంది, ఓట్లు తొలిగిపోతే తరువాత చేసేదేం ఉండదని చెప్పారు. 119 నియోజకవర్గాలలో ప్రతీ గ్రామంలో, ప్రతీ బూత్‌లో బిఎల్‌ఓలతో ముఖ్యనాయకులను అనుసంధానం చేసుకోవాలి వలసలు వెళ్లిన ఓటర్లు బిఎల్‌ఓ లు వెళ్ళినపుడు నివాసంలో ఉండకపోవచ్చు, అలాంటి ఓట్లను తొలగించకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. ఈ నెల 20 లోగా జిల్లాల ఇంచార్జి మంత్రులు సంబంధిత పార్లమెంటు, అసెంబ్లీ ఇంచార్జ్ లతో సమీక్ష నిర్వహించుకోవాలి, సంబంధిత ఇంచార్జ్ మంత్రులు జిల్లా స్థాయిలో మానీటరింగ్ సిస్టం ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్య వస్తే సంబంధిత అసెంబ్లీ ఇంచార్జ్ ను అప్రమత్తం చేయాలి 17 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఎక్కడైనా సమస్య వస్తే అది సంబంధిత పార్లమెంట్ ఇంచార్జ్ దే బాధ్యత. అసెంబ్లీ పరిధిలో అసెంబ్లీ ఇంచార్జ్ లు బాధ్యత వహించాలి అపి చెప్పారు.. ఎస్ఐఆర్‌ను ఆషామాషీగా తీసుకోవద్దు.. సీరియస్‌గా తీసుకోవాల్సిందే..ఇది అత్యంత ప్రమాదకరమైన సందర్భం.. అప్రమత్తంగా ఉండండి అని చెప్పారు. పార్లమెంట్ ఇంచార్జ్‌లు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మానీటరింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి అసెంబ్లీ ఇంచార్జులు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మానీటరింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి అని చెప్పారు. గాంధీభవన్లో వార్‌రూమ్ ఏర్పాటుచేసి బూత్‌లెవెల్ మానీటరింగ్ చేయాలి ఏ రోజుకు ఆ రోజు రిపోర్ట్ తెప్పించుకోవాలి ఎవరు నిరక్ష్యం వహించినా >>2



# విచిత్ర వాతావరణం

**కొన్ని చోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల వర్షాలు**

**పగలు సాధారణం మించి ఉష్ణోగ్రతలు**

**సాయంత్రం అర్ధగంట లోనే జోరు వానలు**

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించినప్పటికి వాతావరణంలో మాత్రం విచిత్ర పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికి, మరికొన్ని జిల్లాల్లో కనిస తొలకరి జల్లులు కూడా పడటం లేదు. ఓ వైపు వర్షాలు పడి వాగులు వంకలు పొంగి పొర్లుతుంటే, మరోవైపు ఎండలు దంచికొడుతున్నాయి. ఒకవైపు మధ్యాహ్నం ఉక్కపోతతో కూడిన ఎండలు, మరోవైపు సాయంత్రం లేదా రాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన అకస్మాత్తుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలకు పైబడి ఉంటుండగా, అరగంటలోనే భారీ వర్షాలు పడుతున్నాయి. ప్రస్తుతం పగటి పూట సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రత, అధిక తేమ కారణంగా ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అయితే సాయంత్రం వేళల్లో ఆకస్మికంగా వాతావరణం మారిగంటకు 30 నుండి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు, రాష్ట్రంలోని >>2



## ఇన్ని కుప్పి గంతులా?

**మెట్రో ఫేజ్-2 సాధించ లేకపోవడం రేవంత్ అసమర్థ పాలనకు దర్పణం: కెటిఆర్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్15:** ప్రెసిడెంట్ మెట్రో ఫేజ్2 ప్రాజెక్టును కేంద్రం నుంచి సాధించలేక, తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే >>2



నీట్ పేపర్ లీక్‌పై సోమవారం వారణాసిలో ఆందోళనచేస్తున్న అప్‌నా దళ్ ఎమ్మెల్యే పల్లవి పటేల్, తదితరులు

# విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

>> మంది విద్యార్థిని విద్యార్థులకు అల్పాహారం, పాలు పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. దీని ద్వారా విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి విద్యార్థుల సంఖ్య పెంచడానికి రాష్ట్ర వ్యాప్తంగా బడి బాట కార్యక్రమం ద్వారా డ్రాప్ ఔట్ విద్యార్థులను బడిలోకి తీసుకురావడం ఇతర పాఠశాలల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. సోమవారం నుంచే ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభిస్తున్నామని, వారు స్కూల్‌లోనే తినేలా బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం లేవగానే రెడీ అయి స్కూల్‌కి రావాలే ఇక్కడే బ్రేక్ ఫాస్ట్ లంచ్ చేయాలన్నారు. తల్లిదండ్రులు కష్టపడుతున్న దాని కంటే రెట్టింపు కష్టపడి చదువుకొని మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ హాస్పిటల్‌లు వద్దు, ప్రభుత్వ ఉద్యోగం కావాలని విధంగా వ్యవహరిస్తున్నారని, అందుకే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అల్పాహారం పథకం ప్రీప్రైమరీ (పిపి) నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వర్తిస్తుందన్నారు. అల్పాహారం పథకం ద్వారా విద్యార్థుల్లో ఆకలిని నివారించడం, పోషకాహార లోపాన్ని తగ్గించడం, ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడటం,పాఠశాల హాజరును పెంచడం, డ్రాప్‌అవుట్‌లను తగ్గించడం, విద్యార్థుల ఏకాగ్రత, విద్యా ప్రతిభను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. రోజు అల్పాహారంతోపాటు పాలు/రాగి మాల్ట్ ఇస్తున్నామని, సోమవారం దోసె చట్నీ / చపాతీ, కూర, పాలు, మంగళవారం మిల్లెట్ ఇడ్లీ (2) సాంబార్,రాగి జావ, బుధవారం పూరీ (2) ఆలూ కుర్మా, పాలు, గురువారం మిల్లెట్ ఇడ్లీ (2) సాంబార్ రాగి జావ, శుక్రవారం మిల్లెట్ ఉప్మా / పొంగల్, చట్నీ, పాలు, శనివారం బొండా (2) చట్నీ, రాగిజావ,సోమ, బుధ,శుక్రవారాలు-పాలు, మంగళ, గురు, శనివారాలు- రాగి జావ అల్పాహారం కోసం ప్రభుత్వం వార్షిక వ్యయం రూ. 540 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. పాల సరఫరా కోసం వార్షిక వ్యయం రూ. 180 కోట్లు మొత్తం వార్షిక వ్యయం రూ.720కోట్లు ఈ పథకానికి ప్రభుత్వం ఖర్చు చేయనుందన్నారు.

# నేటి నుంచి 'టెట్'

>> చేశారు. నిమిషం ఆలస్యమైన అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనికి అనుమ తించరు. పరీక్షలను సీబీటీ విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 9న జారీ చేసిన విషయం తెలిసిందే. పరీ క్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనుం డగా.. ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,53,752 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు వచ్చాయి. 5 దరఖాస్తులు ట్రాన్స్‌జెండర్ల నుంచి వచ్చాయి. 1,53, 752 దరఖాస్తుల్లో పేపర్-1కి 50,113 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 1,03,639 దరఖాస్తులు వచ్చాయి. రెండు పేపర్లకు 17,334 దరఖాస్తులు వచ్చాయి. నేటి నుంచి 22 వరకు 10 సెషన్‌లలో పరీక్షలను నిర్వహించనున్నారు. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లాల్లో 61 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు టెట్ కన్వీనర్ జి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# క్షేత్రస్థాయికి వెళ్లాలి

>> సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి.99 రోజుల యాక్షన్ ప్లాన్లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేకపోయాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు.

ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్‌సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఎఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు.

# ప్రమాదకర సందర్భం

>> నష్టం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పరిశీలన (సర్) ప్రక్రియను పార్టీ యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే పెద్ద ఎత్తున ఓట్లను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న లోపాలు, తప్పులతో కూడిన అనామలస్ జాబితాలోని ఓటర్ల విషయంలో బిఎల్‌ఎలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం సూచించారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటూ జాబితా నుంచి తొలగించబడకుండా చూడాల్సిన బాధ్యత మనదేనన్నారు. ఓటు అనేది కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమే కాదని, అది దేశ పౌరసత్వంతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశమని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. జూమ్ మీటింగ్ లో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ సర్ విషయంలో దేశంలో జరిగిన పరిణామాలు మనం గమనించాలి.. బీజేపీ, ఎన్నికల కమిషన్ ఓట్ చోరీనే పనిగా పెట్టుకుందన్నారు..పశ్చిమ బెంగాల్‌లో ఎలా జరిగిందో మనం చూశాం. ఇక్కడ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త చాలా అప్రమతంగా ఉండాలి.ఓట్ మాప్, ఓట్ ఆన్ మాప్, డౌట్ ఓట్స్ అన్ని సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. పాత ఓటర్ లిస్ట్ కు ఇప్పటి ఓటర్ లిస్ట్ కు చిన్న చిన్న పొరపాట్లు ఉన్న ఓట్ తొలగిస్తారు..ఓట్‌ను నిలబెట్టడానికి అవసరమైన అన్ని పత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సర్ చాలా కీపకమైన విషయమని నాయకులు అసెంబ్లీ ఇంచార్జ్ లు బిఎల్‌ఏ స్థాయి వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. పశ్చిమ బెంగాల్ లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ కేవలం ఓట్ల తొలగింపు తోనే ఓటమి పాలైందని అన్నారు.ఇప్పుడు వోట్ మ్యాపింగ్ జరుగుతుంది. బీజేపీ ఈ విషయంలో ఎన్నికల కమిషన్ తో కలిసి కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించే ప్రమాదం ఉందని అన్నారు. ఓటర్ అన్ మ్యాపింగ్ తో పాటు డౌట్ ఓట్ల ను కూడా నిశితంగా గమనించాలని సూచించారు. రాబోయే ఎన్నికలకు ఇప్పటి ఓటర్ లిస్ట్ కీలకమని అత్యంత జాగ్రత్తగా ప్రతి ఓట్ ను నిశితంగా గమనించాలి అన్నారు.

ఈ విషయంలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడు ఓటర్ లిస్ట్ ఫైనల్ అయ్యే వరకు పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలని సూచించారు.

## వారం - వర్జ్యం

16-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
విదియ రా.12.55, ఆరుద్ర సా.4.15
వర్జ్యం : రా.2.58-తె.4.24
దు.ఉ.8.11-ఉ.9.03,
2) రా.11.56-రా.12.48
శుభసమయం: ఉ.7.00-8.00
రాహుకాలం - మ.3.00-4.30

## వారాఫలం

**మేషం :** సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృషభం:**విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. అరుదైన అవకాశం వెతుక్కుంటూ రాగలదు.వ్యాపారం అభివృద్ధి.

**మిథునం:** భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సకుటుంబ సమే తంగా వివాహాది శుభకార్యాలకు హాజరవుతారు.

**కర్కాటకం:**సంతాన విద్యా విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**సింహం:**మీకు అండగా ఉన్న వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచాల్సి వస్తుంది. ఉద్యోగావకాశాలు లాభిస్తాయి.

**కన్య :**అధికార ధృవీకరణ పత్రాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల విషయంలో జాగ్రత్తలు భద్రత అవసరము. వాహన సౌఖ్యం.

**తుల :**కుటుంబ వ్యవహారాలలో ఇతరుల జోక్యం అధికంగా కాకుండా జాగ్రత్తలు వహించండి. వివాహయత్నాలు సాగిస్తారు.

**వృశ్చికం:**స్వంత వాళ్ళుగా భావించిన వ్యక్తులు రహస్యాలు మీ దగ్గర దాచడం మీ కోపానికి, అసంతృప్తికి కారణం అవుతుంది.

**ధనుస్సు:** సాంస్కృతిక రంగాలలోని వారికి అవార్డులు లభిస్తాయి. పురోభివృద్ధి విశేషంగా కృషి చేస్తారు. బంధువుల కలయిక.

**మకరం:** ముఖ్యమైన విషయాలలో తొందర పడకుండా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ఉత్తమము.

**కుంభం:** ఎదురుచూడని అవకాశాలు కలిసి వస్తాయి. వాటిని నేర్పుగా ఉపయోగించి లాభ పడండి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**మీనం :** బంధువర్గంలో కేంద్రబిందువు అవుతారు. నేల విడి సాము చేయరు. వస్త్రాలు కొనుగోలు చేస్తారు. శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కిషన్‌వల్లే మెట్రో చిక్కులు

>>ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌ఓసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్‌ఓసి అయినా ఇప్పించరా? అని ప్రశ్నించారు. నిధులు ఇప్పించి ఎన్‌ఓసి ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. కిషన్‌రెడ్డి ఎందుకు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్,మాదాపూర్ కలిపితే ఎంతుంటదో వైజాగ్ అంత ఉంటుందని, దానికి కూడా మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ చర్యలతో మెట్రో మొదటి దశ మూడేళ్లు ఆలస్యమైంది అని వివరించారు. రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టు రూ.22 వేల కోట్లకు చేరింది, ప్రాజెక్టు ఆలస్యం కావడంతో పాటు కోవిడ్ ప్రభావంతో ఈ ఎల్ అండ్ టీ నష్టాల్లో కూరుకుపోయింది పదేళ్ల మెట్రో విస్తరణపై గత ప్రభుత్వం ప్రయత్నించలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఫేజ్ 2 అనుమతి కోసం ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తిచేశాం, అయితే ఫేజ్ 1 నిర్మించిన ఎల్ అండ్ టీ తోనే ఫేజ్ 2 నిర్మించాల్సి ఉంటుందని కేంద్రం నిబంధన పెట్టింది అయితే ఈ ప్రతిపాదనకు ఎల్ అండ్ టీ అంగీకరించలేదని పేర్కొన్నారు.గత నష్టాలతోనే సతమతమవుతున్న తమకు ఫేజ్ 2 నిర్మించడం కష్టమని తేల్చి చెప్పింది,రూ. 30 వేల కోట్ల ఆస్తి సృష్టించినా ఏటా 400 కోట్లు నష్టం వస్తుందని చెప్పిందని పేర్కొన్నారు. అందుకే ఫేజ్ 2 నిర్మాణంలో భాగస్వామ్యం కామని స్పష్టంగా చెప్పింది. భవిష్యత్ నిర్వహణకు కూడా ఒప్పుకోమని తిరస్కరించింది దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి అడిగామని చెప్పారు. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ఒక్కటే ఏకైక పరిష్కారం అని కేంద్రం చెప్పింది.దీంతో రూ.30 వేల కోట్ల ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తిని రూ.15 వేల కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించారు. అయితే రూ. 13,600 కోట్లు 8.25 శాతం వడ్డీకి బ్యాంకుల్లో ఎల్ అండ్ టీ మెట్రోపై రుణం తెచ్చుకుంది ఆ లోన్ రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం, ఈ మేరకు నిధుల కోసం ఐఆర్‌ఎఫ్‌సి ద్వారా తక్కువ వడ్డీకి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకోవడానికి ప్రయత్నించిందని చెప్పారు. అయితే కేసీఆర్‌కు పిఎస్‌సి, ఆర్‌ఈసి ద్వారా పదేళ్లలో రూ.3 లక్షల 15 వేల కోట్లు ఎలాంటి గ్యారెంటీ లేకుండా, మూడో కంటికి తెలియకుండా కేంద్రం అప్పు ఇచ్చింది, 9 నుంచి 11.5 శాతం వడ్డీతో అప్పులు ఇచ్చారని చెప్పారు. మేం ఐఆర్‌ఎఫ్‌సి లోన్‌కుఒప్పించాం. రూ.13,600 కోట్లు 4%వడ్డీకి జపాన్ సంస్థతో అప్పు తీసుకొచ్చాం. ఇది ఐఆర్‌ఎఫ్‌సి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉందన్నారు. అందుకోసం ఫీజు రూపేణా సంస్థకు రూ.84 కోట్లతో పాటు ఈక్విటీగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1400 కోట్లను కూడా చెల్లించామని, లోన్ వచ్చినట్లే అని అనుకున్నాం కానీ కిషన్ రెడ్డి అడ్డుకున్నారు అని చెప్పారు.మే 20న కేంద్రమంత్రి ఖట్టర్‌ను, 21న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కిషన్‌రెడ్డి కలిసి అనుమతులు ఇవ్వొద్దని చెప్పారు, అందుకే మేం కిషన్ రెడ్డి వెనక పడుతున్నాం అని చెప్పారు. జూన్ 15న నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇప్పటి వరకు కాలేదు. ఆ బాధ్యత కిషన్ రెడ్డిదే..మీకు(కేంద్రానికి) కష్టమనుకుంటే మెట్రో ఫేజ్2కు మీ(కేంద్రం) 50 శాతం భాగస్వామ్యం అవసరం లేదు మీరు ఎన్‌ఓసి ఇవ్వండి.. మేమే పూర్తిగా భరించి మెట్రోవిస్తరణ చేసుకుంటాం అనిచెప్పారు. కిషన్ రెడ్డి సికింద్రాబాద్ ఎంపీగా ఉన్నారు..నలుగురుమీ ఎంపీలు ఉన్న ప్రాంతంలోనే మెట్రో విస్తరణ జరగాల్సి ఉంది. ఎందుకు కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోరు? అని ప్రశ్నించారు. వరంగల్ ఎయిర్ పోర్టు స్పీడ్ అయ్యాక వెళ్లి రామ్మోహన్ నాయుడిని కిషన్‌రెడ్డి కలిశాడు.. ఆ పనులు స్లో అయ్యాయి అని ఆరోపించారు. జపాన్ సంస్థ ఇప్పటికే నిధులను ఐఆర్‌ఎఫ్‌సికి విడుదల చేసింది.. కానీ ఐఆర్‌ఎఫ్‌సి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయడంలేదు.ఆ డబ్బులకు వడ్డీ ఎవరు కట్టాలి. కిషన్ రెడ్డి చెప్పాలి అని ప్రశ్నించారు. ఐఆర్‌ఎఫ్‌సి రుణం కోసం రిజర్వు బ్యాంకును ఒప్పించిన లెటర్ కూడా తీసుకెళ్లి ఇచ్చాం.. అయినా లోన్ ట్రాన్స్ఫర్ కాకుండా అడ్డుకున్నారు దీనిపై కిషన్ రెడ్డి బాధ్యత తీసుకుంటారా లేదా? అని ప్రశ్నించారు.లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కెసిఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని, కెసిఆర్,కెటిఆర్‌తో కలిసి ఆయన మెట్రో ఫేజ్2ను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

# విచిత్ర వాతావరణం

>> పలు జిల్లాలలో చెదురుమదురు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గంటల వ్యవధిలోనే రోడ్లు జలమయమయ్యే స్థాయిలో కుండపోత వర్షం కురుస్తుంది. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని ఆదిలాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40.3 డిగ్రీలు, భద్రాచలంలో 34.6 డిగ్రీలు, హకీంపేట్‌లో 36.4 డిగ్రీలు, దుండిగల్‌లో 34.2 డిగ్రీలు, హన్మకొండలో 39 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీలు, ఖమ్మంలో 34.8 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 32.7 డిగ్రీలు, మెదక్‌లో 36.2 డిగ్రీలు, నల్లగొండలో 38 డిగ్రీలు, నిజామాబాద్‌లో 39.5 డిగ్రీలు, రామగుండంలో 40.2 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదే సమయంలో రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు నుండి వర్షాలు పడ్డాయి. గడచిన 24 గంటల్లో మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్‌లో 53.4 మిల్లీ మీటర్లు, మంచిర్యాల జిల్లా మందలమర్రిలో 38.2 మిల్లీ మీటర్లు, జిల్లా కేంద్రం మహబూబ్‌నగర్‌లో 29.8 మిల్లీ మీటర్లు, ఇదే జిల్లా జడ్చర్లలో 25.4 మిల్లీ మీటర్లు, భూధ్‌పూర్‌లో 23 మిల్లీ మీటర్లు, వికారాబాద్ జిల్లా దోమలో 16.6 మిల్లీ మీటర్లు, బూమ్రాస్‌పేట్‌లో 16.2 మిల్లీ మీటర్లు, నిర్మల్ జిల్లా సారంగపూర్‌లో 28.2 మిల్లీ మీటర్లు, భూపాలపల్లి జిల్లా భూపల్‌పల్లెలో 13.6 మిల్లీ మీటర్లు, సిద్దిపేట్ జిల్లా జగ్దేవ్‌పూర్‌లో 13.2 మిల్లీ మీటర్లు, నిజామాబాద్ జిల్లా నందిపేట్‌లో 13 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. కాగా వాతావరణ శాఖ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మరియు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని మిగిలిన ప్రాంతాలకు, అలాగే తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, బీహార్‌లలోని మరికొన్ని ప్రాంతాలకు మరింత ముందుకు విస్తరించాయని తెలిపింది. రుతుపవనాలు ఉత్తర పరిమితి హర్నై, షోలాపూర్, హైదరాబాద్, భద్రాచలం, కోరాపుట్, ఫూల్బాని, రాంచీ, జముయి, ముజఫర్‌పూర్ గుండా వెళుతోందని పేర్కొంది. రాబోయే 4-5 రోజులలో నైరుతి రుతుపవనాలు మధ్య అరేబియా సముద్రం, మహారాష్ట్రలలోని మరికొన్ని ప్రాంతాలకు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ మరియు బీహార్‌లలోని మిగిలిన ప్రాంతాలకు, అలాగే ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాలకు మరింత ముందుకు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలియచేసింది. ఇక సాయంత్రం వరకు తెలంగాణలో ఎండలు తీవ్రత అధికంగా ఉంటుందని, సాయంత్రం తర్వాత వాతావరణం మారుతుందని తెలిపింది. రాష్ట్రంలోని ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ, నారాయణ్‌పేట్, రంగారెడ్డి, సూర్యాపేట్, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో తేలికపాటి ఉరుములతో కూడిన వర్షంతో పాటు, గరిష్ట ఉపరిత గాలి వేగం గంటకు 40 కిలోమీటర్ల వరకూ ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.



సోమవారం బ్రటిస్లావాలో ప్రధాని మోడీ, స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ఇరు దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులు

# భారత్ వాణిజ్య బంధం

>> అనుభవజ్ఞుడైన నాయకుడు, భారతదేశానికి నిజమైన మిత్రుడు. భారత్-స్లొవేకియా సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చడంలో ఆయన స్నేహం, అచంచలమైన నిబద్ధత కీలక పాత్ర పోషించాయి. ఈ రోజు ఆయనను కలుసుకునే అవకాశం లభించడం, మన సంబంధాలలో ఈ చారిత్రాత్మక ఘట్టానికి సాక్షిగా నిలవడం నాకు చాలా ఆనందంగా ఉంది," అని ప్రధాని మోడీ అన్నారు. ఈ పర్యటన ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, ద్వైపాక్షిక సంబంధాల ఉన్నతీకరణను ప్రధాని మోడీ ప్రకటించారు. "ఒక భారత ప్రధాని స్లొవేకియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ చారిత్రాత్మక సందర్భంలో, మన సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఇది మన ఉమ్మడి విశ్వాసానికి, ఉమ్మడి ప్రాధాన్యతలకు, ఉమ్మడి భవిష్యత్తుకు ప్రతీక" అని ఆయన అన్నారు. అంతరిక్ష రంగంలో ఇరు దేశాల మధ్య సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న మోడీ, భారత్ అంతరిక్ష రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని స్లొవేకియా కంపెనీలను ఆహ్వానించారు. పౌర అణుశక్తి రంగం కూడా ఇరు దేశాలకు ప్రాధాన్య అంశమని చెప్పారు. రక్షణ సహకారం ఇరు దేశాల మధ్య ఉన్న పరస్పర విశ్వాసానికి, వ్యూహాత్మక అవగాహనకు నిదర్శనమని ప్రధాని మోడీ అన్నారు. ఈ రంగంలో కుదిరిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ ద్వారా ఉమ్మడి అభివృద్ధి, సంయుక్త ఉత్పత్తి, రక్షణ పరిశ్రమల మధ్య భాగస్వామ్యానికి కొత్త ఊపు లభిస్తుందని తెలిపారు. భారత ప్రతినిధి బృందంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితరులు ఉన్నారు. బ్రాటిస్లావాలో భారత ప్రధాని నరేంద్ర మోడీకి అరుదైన స్వాగతం లభించింది.

# ఇన్ని కుప్పి గంతులా?

>> ముఖ్యమంత్రి ఇన్ని కుప్పిగంతులు తొక్కుతున్నారని, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తన అసమర్థతను దాచుకోవడానికి అనేక అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. యూపీ, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలను మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేకపోయారో ముందుగా ప్రజలకు జవాబు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం మెట్రో రెండవ దశకి అనుమతి దక్కకపోవడం అన్నారు. 71 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినప్పటికీ, మీ ఖిబడేభాయ్‌ఖిని మెప్పించి ప్రాజెక్టును ఒప్పించలేకపోవడం మీ చేతకానితనానికి, దద్దమ్మ పాలనకు నిలువెత్తు నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు.

# శాంతి బాట

>> కుదిరిందని, హార్ముజ్ జలసంధి ఇకపై తెరిచే ఉంటుందని ట్రంప్ వెల్లడించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంతకుముందు ఈ ఒప్పందం చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని ట్రంప్ తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హార్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ నెల 19న రెండు దేశాలు దీనిపై సంతకాలు చేసే అవకాశాలున్నాయి. అయితే, ఇరు దేశాల మధ్య కచ్చితంగా ఏ అంశాలు, షరతులపై ఒప్పందం కుదిరింది అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. పలు అంతర్జాతీయ మీడియా సంస్థల అంచనా ప్రకారం ఆయా అంశాల అజెండా ఆధారంగా అమెరికా, ఇరాన్ ఒక ఒప్పందానికి వచ్చాయని సమాచారం. అవి. దాడులు సహా ఇతర యుద్ధ చర్యల్ని వెంటనే ఆపేయాలి. వాణిజ్య రవాణాకు అనుగుణంగా హార్ముజ్ జలసంధిని వెంటనే పూర్తిస్థాయిలో తెరవాలి. ఇరాన్ పోర్టుల మీద అమెరికా విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలి. చర్చల సందర్భంగా ఎలాంటి కొత్త ఆంక్షలు విధించరాదు. ఇరాన్ చమురుపై తాత్కాలిక మినహాయింపులు ఇవ్వాలి. స్తంభింపజేసిన, స్వాధీనం చేసుకున్న ఇరాన్ ఆస్తుల్ని విడుదల చేయాలి. 60 రోజులపాటు చర్చల కాలపరిమితి కొనసాగించాలి. అణ్వాయుధాల్ని ఇరాన్ కలిగి ఉండకూడదు. మిగిలిన యురేనియాన్ని శుద్ధి చేయకూడదు. ఇరాన్ అణుకేంద్రాల్ని నిషేధించాలి. ఇరాన్ వద్ద మిగిలిన యురేనియంపై చర్చలు జరగాలి. ప్రాంతీయంగా ఉద్రిక్తతలు తగ్గేందుకు చర్యలు తీసుకోవాలి. ఆర్థిక పరమైన, పునిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. తుది ఒప్పందంపై చర్చలకు అవకాశం ఇవ్వాలి. ఇందులో 300 బిలియన్ డాలర్ల పునరావాస ప్యాకేజీతోపాటు, దీర్ఘకాలిక పెట్టుబడులు, ఆర్థిక సహకారం వంటివి ఇరాన్ అడిగినట్లు కూడా తెలుస్తోంది. తాజా ఒప్పందంలో కూడా ప్రధానంగా నిలుస్తున్న అంశం ఇరాన్ అణుకార్యక్రమం. తమ పౌర రక్షణ కోసమే అణ్వాయుధాలు తయారు చేస్తున్నట్లు ఇరాన్ చెబుతుండగా, దీనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికా అంగీకరించడం లేదు. ఈ విషయంలోనే చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఈ అంశంలో రెండు దేశాలు 60 రోజుల ప్రత్యేక చర్చలు, అంగీకారానికి వచ్చాయి. అంటే ఈ 60 రోజుల్లో ఇరాన్‌లోని అణు కేంద్రాల్ని సందర్శిస్తారు. తనిఖీలు, యురేనియం శుద్ధీకరణ ప్రక్రియ, నిల్వలు వంటివి పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటారు.

**హార్ముజ్ ఇక సుంకం రహితం: ట్రంప్**

ఇరాన్‌తో తమ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం హార్ముజ్ జలసంధిని "శాశ్వతంగా సుంకం రహితంగా" మారుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం అన్నారు. ఈ ఒప్పందం ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన ఇంధన కారిడార్లలో ఒకదానిని సురక్షితం చేయడంతో పాటు, టెహ్రాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయకుండా నిరోధిస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం విస్తృత ప్రాంతీయ సంఘర్షణ ప్రమాదాన్ని తగ్గిస్తూ, అంతిమంగా ఈ వ్యూహాత్మక జలమార్గం తెరిచి ఉండేలా చూస్తుందని అన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల చర్యలు దౌత్య ప్రక్రియకు సహాయపడ్డాయని ట్రంప్ వారిని ప్రశంసించారు. అదే సమయంలో, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును "చాలా కష్టమైన వ్యక్తి"గా అభివర్ణిస్తూ విమర్శించారు.

**నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడానికి అంగీకారం: ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి**

ఇరాన్‌పై అమెరికా విధించిన నావికా దిగ్బంధనాన్ని సోమవారం రాత్రి నుంచి ఎత్తివేస్తున్నట్లు, లెబనాన్‌తో సహా అన్ని రంగాలలో యుద్ధానికి, సైనిక కార్యకలాపాలకు తక్షణ, శాశ్వత ముగింపు పలుకుతున్నట్లు ఇరాన్ న్యాయ, అంతర్జాతీయ వ్యవహారాల ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ గరీబాబాది ప్రకటించారు. ఇరాన్ పాక్షిక అధికారిక తస్నిమ్ వార్తా సంస్థ ప్రకారం, జూన్ 19న స్విట్జర్లాండ్‌లో శాంతి అవగాహన ఒప్పందం తుది ముసాయిదాపై ఇరాన్, అమెరికా సంతకాలు చేయనున్నాయని గరీబాబాది తెలిపారు. స్విట్జర్లాండ్‌లో సంతకాల కార్యక్రమం అనంతరం హార్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందని తస్నిమ్ పేర్కొంది.

**'అమెరికా డీల్‌తో మాకు సంబంధం లేదు'**

ఇజ్రాయెల్ మంత్రి బెన్ గ్విర్ అమెరికా ఉద్దేశాలను తప్పుబడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుదుర్చుకున్న ఒప్పందం తమను ఏమాత్రం కట్టిపడేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ దేశం అమెరికాకు లోబడి లేదని, తాము పూర్తి స్వతంత్ర, సార్వభౌమాధికారం కలిగిన దేశమని ప్రకటించారు.

**అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోడీ**

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ స్వాగతించారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను తాను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.

## నీట్ రీఎగ్జామ్ అడ్మిట్‌కార్డు విడుదల

### 21న 2.00 గంటల నుంచి 5.15 వరకు పరీక్ష

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-(యుజి) 2026 రీ ఎగ్జామ్‌కి సంబంధించి విద్యార్థుల అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) విడుదల చేసింది. విద్యార్థులందరూ ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టిఏ డిజి ప్రకటించారు. మే 3న జరిగిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా రద్దు చేయగా.. ఈ నెల 21న తిరిగి పరీక్షను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఎన్‌టిఏ తమ వెబ్‌సైట్‌లో విద్యార్థులకు అందుబాటులోకి తీసు కొచ్చింది. నీట్ రీ ఎగ్జామ్‌ను ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 వరకు కొనసాగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే విడుదలైన విషయం తెలిసిందే. రీ ఎగ్జామ్‌కి హాజరయ్యే అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి తమ లాగిన్ క్రెడెన్షియల్స్ ఉపయోగించి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ డీజీ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షకు 23 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 85 శాతానికిపైగా హాజరైన సంగతి తెలిసిందే.

## జాతీయస్థాయి కరాటే ఫైటర్స్‌కు పిసిసి చీఫ్ అభినందనలు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహ దారుఢ్యంగా ఉండటంతోపాటు ఆత్మవిశ్వాసం పెరుగుతోందని ఇది పిల్లలకు స్వీయరక్షణ ఇస్తోందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఉత్తరాఖండ్‌లో ప్రతిభచూపిన విద్యార్థినీ విద్యార్థులను, కోచ్‌లను పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 4 నుండి 7 వరకు డెహ్రాడూన్ ఉత్తరా ఖండ్ లోని కియో ఆధ్వర్యంలో నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ 2026 న నిర్వహించారు. దానికి తెలంగాణ రాష్ట్రం నుండి సెలక్షన్ ఆయి సబ్ జూనియర్, క్యారెట్, జూనియర్ విద్యార్థిని విద్యార్థులు వివిధ కేటగిరీల్లో పాల్గొని 2 గోల్డ్ 4 సిల్వర్ 5 బ్రాంచ్ మెడల్స్ సాధించారు. స్టేట్ నుండి మొదటిసారిగా 11 మెడల్స్ సాధించినట్లు స్టేట్ జనరల్ సెక్రెటరీ మల్యాల రామస్వామి తెలిపారు.

## సర్కారు భూమి కాజేసేందుకు జరిగిన కుట్రలో బ్రహ్మానాయుడుకు మూడురోజుల పోలీసు కస్టడి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** నగర శివార్లలోని గండిపేట్ మండలంలో గల పదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలు, తప్పుడు జిఓలు సృష్టించిన కేసులో అరెస్టయిన వైకాపా మాజీ ఎంఎల్ఎ బొల్లా బ్రహ్మా నాయుడుకు రంగారెడ్డి జిల్లా కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీ ఇస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గత నెల 23వ తేదీన వెలుగు చూసిన ఈ కేసులో మొదట ముగ్గురు నేరగాళ్లు అరెస్టవగా ఆ తరువాత మరో ఇద్దరు పట్టుబడడం తెలిసిందే. ఈ కేసులో అసలు నిందితుడు బొల్లా బ్రహ్మా నాయుడు అజ్ఞాతంలో వెళ్లి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దీనిని డిస్మిస్ చేయడం విదితమే. దీని తరువాత ఆయనను ఈ నెల 5న తమిళనాడు కాంచీపురంలో తలదాచుకున్న చోట అరెస్టు చేశారు. మరుసటిరోజు ఆయనను చంచల్‌గూడ జైలుకు రిమాం దుకు తరలించారు. కాగా ఈ కేసులో ఆయనను మరింతగా విచారించేందుకు వారం రోజుల కస్టడీ ఇవ్వాలని సైబరాబాద్ పోలీసులు కోరగా దీనికి డి ఫెన్స్ న్యాయవాది వ్యతి రేకించారు. ఇరువర్గాల వాదనలు విన్న తరువాత కోర్టు బ్రహ్మానాయుడుకు మూడు రోజుల కస్టడీ ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఆయనను పోలీసులు విచారించనున్నారు.

## కెటికె ఐదో గనిలో బ్లాస్టింగ్

### సింగరేణి కార్మికునికి తీవ్రగాయాలు

### విధులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదం

**భూపాలపల్లి, జూన్ 15, ప్రభాతవార్త:** భూపాలపల్లి ఏరియాలోని కేటికే 5వ గనిలో సోమవారం ఉదయం జరిగిన గని ప్రమాదంలో సింగరేణి కార్మికుడు శ్రీరాముల ప్రదీప్ తీవ్రంగా గాయపడ్డారు. ఎడమ చేతికి తీవ్రగాయం కావటంతో ఆయనను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం హైదారాబాద్‌లోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. భూపాలపల్లి ఏరియాలోని కేటికే 5వ గనిలోని 13వ లెవల్‌లో సోమవారం ఉదయం షార్ట్ ఫైరర్ శ్రీరాముల ప్రదీప్ బ్లాస్టింగ్ పనులు చేపడుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బ్లాస్టింగ్ చేస్తున్న క్రమంలో అతని చేతిలోనే పేలుడు పదార్థం పేలినట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. మైనింగ్ శాఖకు చెందిన అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే తప్ప ప్రమాదంకు గల కారణాలు వెల్లడయ్యే అవకాశం లేదు.



సోమవారం భూపాలపల్లి ఏరియాలోని కేటికే 5వ గనిలో గాయపడిన కార్మికుడు

చేతిలో పేలుడు పదార్థం పేలడంతో చేయి పూర్తిగా గాయమైంది. గాయపడిన ప్రదీప్‌ను అధికారులు మంజూర్‌నగర్‌లోని సింగరేణి ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం అతనిని హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మెరుగైన చికిత్స కోసం భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కాగా సంఘటనా స్థలంను సోమవారం ఉదయం ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, గని మేనేజర్ మాచర్ల రమేష్ పరిశీలించారు. కాగా సంఘటన జరిగిన వెంటనే స్పందించిన మైనింగ్ శాఖ ఇన్స్ పెక్టర్ హరిప్రసాద్‌ను విచారణకు ఆదేశించింది. ఇదిలా ఉండగా చేతిలో పేలుడు పదార్థం పేలిన సంఘటనలో కార్మికుడు ప్రదీప్ బతికి బయటపడ్డాడు. వాస్తవానికి చేతిలో కాకుండా మరో ప్రదేశంలో పేలితే ప్రాణాపాయం జరిగి ఉండేదని కార్మికులు అంటున్నారు.

# మోగిన బడిగంట

### వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన స్కూళ్లు



సోమవారం రాజ్‌భవన్ పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా చిన్నారులతో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. 52 రోజుల వేసవి సెలవుల అనంతరం తిరిగి సోమవారం బడిగంట మోగింది. వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం(బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతుండగా.. ఈ ఏడాది నుంచి ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్)తోపాటు పాలు కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో సోమవారం ప్రారంభమైన పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్‌ను విద్యార్థులకు అందించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహారం పథకాన్ని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజ్‌భవన్ పాఠశాలలో ప్రారంభించారు. దీంతోపాటు రాష్ట్రంలోని 1269 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోనూ బ్రేక్‌ఫాస్ట్‌ను సోమవారం నుంచే ప్రారంభించారు. హైదరాబాద్‌లో మన్నా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అమలు చేయనున్న ఈ పథకం మొదటి దశలో 45 పాఠశాలలలో మొత్తం 12,437 విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో డ్రాపౌట్ శాతం తగ్గించే దిశగా మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇందులో భాగంగా ఉదయం విద్యార్థులకు అందించే అల్పాహారం మెనూ లోని మిల్లెట్ ఇడ్లీ సాంబార్, మిక్స్‌డ్ వెజ్ కుర్మాతో పూరీ, చట్నీతో బోండా, ఉక్మా చట్నీ అలాగే దోస అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. తెలంగాణ పాఠశాలలు రీ ఓపెన్ అయిన నేపథ్యంలో విద్యార్థులకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా శాఖ పాఠశాల బస్సుల తనిఖీలను ముమ్మరం చేసింది. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన 245 విద్యాసంస్థల వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు మినిమమ్ ఫిట్‌నెస్ లేని 60 స్కూల్ బస్సులను రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడంతో పాటు సామర్థ్యానికి మించి విద్యార్థులను తీసుకెళుతుండటం, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలు లక్ష్యంగా ఆర్‌టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మరికొన్ని రోజులపాటు స్పెషల్ రెయిడ్స్ కొనసాగుతాయని రవాణా శాఖ అధికారులు ప్రకటించారు. తనిఖీలో భాగంఘా ప్రధానంగా వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ ఉన్నాయా లేదా చూస్తున్నామని, సామర్థ్యానికి మించి బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లడం, డ్రైవర్లకు వాలిడ్ లైసెన్స్‌తో పాటు తగినంత అనుభవం ఉందా? లేదా? బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లతోపాటు ఫైర్ ఎక్స్టింగ్విషర్ ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలపై అధికారులు ఫోకస్ పెట్టారు. దీంతోపాటు విద్యార్థులు బస్సులు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు బస్సులో అటెండర్‌ను నియమించారా అని అడిగి తెలుసుకుంటున్నారు.

## వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2026 వేడుకలు షురూ

### తెలంగాణ నుంచి ముగ్గురు ఎంపిక



కనకపూడి అఖిల (ప్రథమ) , జాధవ్ ప్రగతి (ద్వితీయ) , బి. సంధ్యారెడ్డి (తృతీయ)

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూన్ 15, ప్రభాత వార్త:** యువతలో ప్రజాస్వామ్య విలువలు పెం పొందించడమే లక్ష్యంగా కేంద్ర యువజన వ్యవ హారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, 'మై భారత్' ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2026 వేడుకలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. కేంద్రమంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ మార్గదర్శకత్వంలో జూన్ 15 నుండి 17 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. జూన్ 16న పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ సమావేశాలను అధికారికంగా ప్రారంభించనున్నారు.

ఈ జాతీయ స్థాయి పోటీ లకు తెలంగాణ తరఫున ముగ్గురు యువతులు ఎంపికై సత్తా చాటారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఖమ్మం జిల్లాకు చెందిన కనకపూడి అఖిల (ప్రథమ), జగిత్యాల జిల్లాకు చెందిన జాధవ్ ప్రగతి (ద్వితీయ), హనుమకొండ జిల్లాకు చెందిన బి. సంధ్యారెడ్డి (తృతీయ) జాతీయ వేదికకు అర్హత సాధించారు. మూడు రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో పార్లమెంటరీ చర్చలు, నూతన పార్లమెంట్ భవన సందర్శనతో పాటు జూన్ 17న అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో యువతను భాగస్వాములను

## కృష్ణా జల వివాదల ట్రిబ్యునల్ వచ్చే యేడాది జూలై 31 వరకు పొడిగింపు

హైదరాబాద్, జూన్ 15,ప్రభాతవార్త: కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్ నిర్ణయాల నివేదిక సమర్పణ గడువును 31జూలై 2027కు పొడగిస్తూ కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అగర్వాల్ ఎక్స్‌ట్రా ఆర్డినరీ గెజిట్‌ను ప్రచురించారు. 1ఆగస్టు 2026న నివేదిక సమర్పించాల్సి ఉండగా ట్రిబ్యునల్ మరింత గడువు కావాలని కోరింది. దీనితో గడువు పొడిగించారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కృష్ణనదిపై పరివాహాక ప్రాంతాల రాష్ట్రాలకు పంపిణీ అవార్డు ప్రకటించినప్పటికి తెలంగాణ రాష్ట్రంఏర్పాటు కాకపోవడంతో నీటి పంపిణీ కొత్తరాష్ట్రం కోసం కూడా ప్రత్యేకంగా చేపట్టాల్సి ఉంది.రావిబియాస్ వివాదాల ట్రిబ్యునల్ గడువు కూడా 1ఆగస్టు 2027కు పొడిగించింది. నివేదిక సమర్పణ కోసం గడువు పొడించాలని ఇంటర్‌స్టేట్ నదది జలాల వివాదాల చట్టం అనుసరించి గెజిట్ జారీ చేశారు.

## ప్రముఖ టివి నటి సంచిత ఆత్మహత్య

**ముంబై, జూన్ 15:** బుల్లితెర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. కుంకుమ భాగ్య సీరియల్‌తో గుర్తింపు తెచ్చుకున్న నటి సంచిత ఉగాలే(22) సూసైడ్ చేసుకున్నారు. ముంబై లోని నలసోపరాలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. తల్లిదండ్రులు, సోదరి బయటకు వెళ్లి వచ్చేసరికి ఆమె విగతజీవిగా కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని స్పష్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం, జూన్ 14వ తేదీ సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల మధ్య



సంచిత తన గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని చూసేసరికి, ఆమె చీరతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.కుంకుమ్ భాగ్య, దిల్వాలీ దుల్హా లే జాయేంగే, వాగ్లే కీ దునియా వంటి ప్రజాదరణ పొందిన సీరియళ్లతో పాటు ఛావా అనే చిత్రంలోనూ సంచిత నటించారు. ఆమె ఆకస్మిక మరణవార్తతో టివి పరిశ్రమ దిగ్భ్రాంతికి లోనైంది. అయితే, ఆమె గత కొంతకాలంగా కుంగుబాటుతో బాధపడుతున్నారని తెలుస్తోంది. ఆత్మహత్యకు కొన్ని గంటల ముందు కూడా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఉల్లాసంగా ఉన్న ఫోటోలను పోస్ట్ చేయడం గమనార్హం.

ప్రస్తుతం పోలీసులు యాక్సిడెంటల్ డెత్ రిపోర్ట్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులను, సహోద్యోగులను విచారిస్తున్నారు.

## భారీ వర్షాలకు హైపర్ యాక్షన్ ప్లాన్

### జిపిఆర్ఎస్ ఆధారిత ఎమర్జెన్సీ టీమ్‌లు

### ఆర్టిఫిషియల్లీ ఇంటెలిజెన్స్‌తో విద్యుత్ సమస్యల గుర్తింపు

### ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** భారీ వర్షాలు, ఈదురు గాలులను ఎదుర్కొనేందుకు హైపర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. వాతావరణ శాఖ అందిస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 18 సర్కిళ్లలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ సరఫరాకు జరిగే అంతరాయాన్ని అధిగమించడానికి హైపర్ అనే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), సాంకేతికత ద్వారా సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈదురుగాలుల వల్ల విద్యుత్ శాఖ ఎక్కువ ప్రభావితం అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు తక్కువ సమయంలోనే విద్యుత్ పునరుద్ధరణ సేవలు అందించడానికి ఈ హైపర్ ప్లాన్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ ప్రణాళిక ప్రకారం హెడ్ క్వార్టర్‌లో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండటం, అవసరమైన సిబ్బంది, సామాగ్రిని ముందస్తుగా సమీకరించుకోవడం, విద్యుత్ అంతరాయాలపై ఖచ్చితమైన సమాచార సేకరణ, క్షేత్రస్థాయిలో పటిష్ట వ్యూహం, నిర్దిష్ట కార్యాచరణను వేగంగా అమలు, విద్యుత్ సరఫరాను నిర్దేశిత సమయంలో పునరుద్ధరించడం ఉన్నాయన్నారు. అలాగే భారీ వర్షాల వల్ల ఏర్పడే సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రతి సర్కిల్‌లోనూ ఎమర్జెన్సీ రీస్టోర్ టీంలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

ఈ వాహనాల్లో మరమ్మతులకు అవసరమైన అన్ని రకాల మెటీరియల్స్ ఉంటాయని, వీటికి జిపిఎస్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా బాధితుల లోకేషన్‌ను వేగంగా గుర్తించి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవడంలో ఎన్పీడీసీఎల్ ముందంజలో ఉందంటూ, ఎస్‌సి ఎడిఎ, జిఐఎస్, ఓఎమ్మెఎస్ వంటి డేటా వ్యవస్థలను కృత్రిమ మేధ తో అనుసంధానం చేశా మని వెల్లడించారు. దీనివల్లఫీడర్లలో వచ్చే సమస్యలను 7 నుండి 21 రోజుల ముందే అం చనా వేయవచ్చన్నారు. విద్యుత్ డిమాం డ్‌ను ముందే ఊహించి సరఫరాను నియంత్రించడంతో పాటు, లైన్ల పర్యవేక్షణ, నష్టాల గుర్తింపు కోసం డ్రోన్ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## వరవరరావు పిటిషన్‌పై ఎన్ఐఎకు నోటీసులు

**ముంబై, జూన్ 15:** భీమా కోరెగావ్ కేసులో మెడికల్ బెయిల్‌పై ఉన్న విప్లవ రచయిత వరవరరావు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ముంబైలో జీవించడం ఆర్థికంగా భారంగా మారిందని, హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతివ్వాలని పిటిషన్ వేశారు.

ముంబై దాటి వెళ్లకూడదన్న షరతులతో ఆయన అక్కడే ఉంటున్నారు. గతంలో హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతి కోరుతూ వేసిన పిటిషన్‌ను ఎన్ఐఎ కోర్టు మార్చిలో కొట్టివేసింది. దీంతో ఆయన హైకోర్టుకు వెళ్లారు. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో సమాధానం చెప్పాలని ఎన్ఐఎకు బాంబే హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

## గాంధీభవన్‌లో రచ్చ రచ్చ.. ఉద్రిక్తత

### జహీరాబాద్ కాంగ్రెస్ నేతల ఆందోళన

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** గాంధీభవన్ సోమవారం జహీరాబాద్ కాం గ్రెస్ నేతల ఆందోళనకు దిగి నినాదాలతో రచ్చ సృష్టించారు. జహీరాబాద్ ఇన్‌చార్జి మాజీమంత్రి చందశ్రేఖర్‌కు వ్యతిరేకంగా నినాదాలతో గాంధీభవన్ మారుమ్రోగింది. కాంగ్రెస్ జెండా పట్టుకొని పదేళ్ళు ఇబ్బందులు ఎదుర్కొన్న వాళ్లను కాదని కొత్తగా వచ్చిచేరిన వారికి పదవులు కట్టబెడుతూ చంద్రశేఖర్ పార్టీకి నష్టం కలిగిస్తున్నారనీ ఆందోళన పెద్ద ఎత్తున చేపట్టారు. చంద్రశేఖర్‌ను పదవి నుంచి తొలగించి కాంగ్రెస్ పార్టీని రక్షిచాలని నినాదాలతో గాంధీభవన్ హోరెత్తిడమేకాదు ఉద్రిక్తత పరిస్థితినెలకొంది. జహీరాబాద్ అసెంబ్లీ నియో జకవర్గం ఇన్‌చార్జి మాజీ మంత్రి చంద్రశేఖర్ గత ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. 2023లో బిఆర్ఎస్ అభ్యర్థి మాణిక్ రావు గెలుపొందగా ఇతను ఓడిపోయారు. కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికలలో ఆయన వర్గంకు ప్రాధాన్యత ఇస్తూ గత పదేళ్లుగా పార్టీని నమ్ముకొని పనిచేసిన వారిని ఆయన నిర్లక్ష్యం చేస్తున్నారని గాంధీభవన్‌కు చేరుకొని చంద్రశేఖర్ బాధితులు మొం ౦పెటు ౖకొన్నారు. గాంధీభవన్‌లో ఇటీవల బాహాబాహికి దిగుతూ రచ్చచేయడం సర్వ సాధారణంగా మారుతోంది. ఇటీవల టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ తోనే కార్పొరేటర్లు గొడవకు దిగారు. హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభా కర్, ముఖ్యనేతల ఎదుట ఫిరోజ్‌ఖాన్ ఉస్మాన్‌హజ్రీ కొట్టుకొని నెట్టుకొని చివ రకు వి.హనుమంతరావును కూడా పడేశారు. ఆ ఘటన ఇంకా కళ్ల ముందు కనపడతూ ఉండగా జహీరాబాద్ కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు.

## రెండేళ్లుగా సాగుతున్న ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణ

### 400 మందికిపైగా విచారణ.. మరో 100 మంది వరకు

### బాధితుల విచారణకు సిట్ సన్నద్ధం

### రెండో ఛార్జిషీట్ దాఖలుకు మరింత ఆలస్యం?

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపి, పోలీసు శాఖను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై పోలీసుల విచారణ రెండేళ్లకు పైగా సాగుతోంది. ఇప్పటి వరకు 400 మందికి పైగా బాధితులు, అనుమానితులను విచారించిన సిట్ అధికారులు మరో వ ంద మందిని విచారించేందుకు సన్నద్దమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండవ ఛార్జిషీట్ దాఖలుకు మరింత సమయం పట్టే వీలుందని తెలిసింది. ఈ లెక్కన ఫోన్ ట్యాపింగ్‌పై నిందితుల విచారణ, కోర్టులో వారికి శిక్షల ఖరారు కూడా మరింత ఆలస్యమయ్యే వీలుంది. రాష్ట్రంలో 2023 నవంబరులో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక ఫోన్ ట్యాపింగ్ ఉదంతం తీవ్ర సంచలనం రేపడం తెలిసిందే. 2024 మార్చిలో వెలుగు చూసిన ఈ కేసులో ముగ్గురు పోలీసు అధికారులు మరో మాజీ పోలీసు అధికారి అరెస్టవడం తెలిసిందే. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్‌రావు యేడాది తరువాత సుప్రీం కోర్టు నుంచి మధ్యంతర బెయిల్ పొంది అమెరికా నుంచి భారత్‌కు వచ్చారు. ఆయనను ఎలాగైనా అరెస్టు చేయాలని పోలీసు శాఖ భావించగా అది సాధ్యపడక పోవడంతో వారం రోజుల పాటు పోలీసు కస్టడీలో వుంచగలిగింది. ఇదే కేసులో మీడియా అధినేత శ్రవణ్‌రావు కూడా బెయిల్ పొంది విచారణకు హాజరయ్యారు. కాగా ఈ కేసులో మొదట అరెస్టయిన డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావు, అదనపు ఎస్‌పిలు తిరుపతన్న, భుజంగరావు, మాజీ డిసిపి రాధాకిషన్ రావులను విచారించిన పోలీసులు ఫోన్ ట్యాపింగ్‌లో అక్రమాలపై మొదటి ఛార్జిషీట్ ఏడాదిన్నర క్రితమే నాంపల్లి కోర్టులో దాఖలు చేశారు. దీనికి సంబంధిం చిన విచారణ జరుగుతోంది. రెండవ ఛార్జిషీట్‌లో ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుతో పాటు ఇతర నిందితుల పాత్రపై కీలక విషయాలను జోడిస్తామని సిట్ అధికారులు చెప్పారు. అయితే ఇదే సమయంలో రెండో ఛార్జిషీట్‌లో పెద్దసంఖ్యలో బాధితుల పేర్లను వుంచగలిగితే నింది తులకు కఠిన శిక్ష పడుతుందని సిట్ అధికారులు భావిస్తూ ఆ దిశగా చర్యలు చేబట్టారు. ఇందులో భాగంగా గడచిన రెండు నెలలుగా వరుసగా రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టులు, ఇతర రంగాలకు చెందిన వారిని సిట్ అధికారులు వరుసగా విచారిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన ఇంట్లో విచారించిన సిట్ అధికారులు నాటి ఘటనలపై ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. దీంతోపాటు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను కూడా విచారించారు. సిట్ జాబితాలో మరో ఇద్దరు మంత్రులతోపాటు పదిమంది వరకు ఎంపిలు, ఎంఎల్ఎలు, 26 మంది జర్నలిస్టులు, మరో 50 మంది వరకు ఇతర రంగాలకు చెందిన వారు ఉన్నట్లుగా తెలిసింది. వీరి విచారణ నెలన్నర నుంచి రెండు నెలల వరకు సాగే వీలుంది. దీని తరువాతే ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండో ఛార్జిషీట్ దాఖలయ్యే వీలుంది.

Vi

## మాతో చెప్పండి

మేము మీకు సాధ్యమైనంత మెరుగైన సేవలను అందించాలని ప్రయత్నిస్తుంటాము. కారణం ఏదైనా సరే, మేము అందించే సేవలతో మీరు సంతృప్తిగా లేకుంటే లేదా ఏవైనా సందేహాలు ఉంటే, దయచేసి మమ్మల్ని సంప్రదించండి. సాధ్యమైనంత త్వరగా మేము పరిష్కరిస్తాము.

**Vi కేర్**

మీరు సంవత్సరంలోని అన్ని రోజులు, అన్ని సమయాలలోనూ అనగా 24 గంటలూ మమ్మల్ని Vi కేర్ పై సంప్రదించవచ్చు. ఏవైనా ఫిర్యాదులు లేదా సర్వీసు అభ్యర్థనలు ఉంటే, దయచేసి మా కస్టమర్ కేర్ నంబర్ 198 (టోల్-ఫ్రీ)కి ఫోన్ చెయ్యండి. మా ఉత్పత్తులు మరియు సర్వీసుల వివరాల కోసం, దయచేసి డయల్ చేయండి *199# మరియు మీ అకౌంట్ వివరాల కోసం, సాధారణ సమాచారం నంబర్ 199 (టోల్-ఫ్రీ)కి ఫోన్ చెయ్యండి మీ Vi మొబైల్ ఫోన్‌తో. వ్యక్తిగత సహకారం కోసం మీరు మా కాల్‌సెంటర్ ఎగ్జిక్యూటివ్‌తో కూడా మాట్లాడవచ్చు. ఖాతాకు సంబంధించిన సమాచారం, ప్లాన్స్, బిల్లు చెల్లింపులు, మరింత సమాచారం కోసం గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆప్ స్టోర్ నుంచి Vi ఆప్‌ని డౌన్‌లోడ్ చేసుకోండి. Vi ఖాతా, అత్యుత్తమ ఆఫర్స్, ఇంకా మరిన్ని అప్‌డేట్స్ కోసం 9654297000 పైన వాట్సప్ ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు.

**VAS డియాక్టివేటింగ్ ప్రక్రియ**

మీరు సబ్‌స్క్రైబ్ చేసుకున్న వ్యాల్యూ యాడెడ్ సర్వీసులను IVR లేదా SMS ద్వారా సులభంగా డియాక్టివేట్ చేయవచ్చును.

- మీరు మా టోల్-ఫ్రీ నంబర్ 155223కి ఫోన్ చేయవచ్చు. భాషను ఎంచుకున్న తర్వాత, డియాక్టివేట్ ఎంపికతో సబ్‌స్క్రైబ్ చేసుకున్న అన్ని వ్యాల్యూ యాడెడ్ సర్వీసుల జాబితాను తెలియజేయడం జరుగుతుంది.
- ప్రత్యామ్నాయంగా, మీరు 155223కి STOP అని SMS చెయ్యవచ్చును. బదులుగా సబ్‌స్క్రైబ్ చేసుకున్న అన్ని వ్యాల్యూ యాడెడ్ సర్వీసుల జాబితా SMS ద్వారా పంపించబడుతుంది. మీరు డియాక్టివేట్ చేసుకోవలసిన సర్వీసుని ఎంచుకొని SMS చేయవలెను. మీ SMS అందిన సమయం నుండి 4 గంటలలోపు సర్వీసును డియాక్టివేట్ చేయబడుతుంది.

**సిమ్ వాడుకలో లేని యెడల వినియోగదారునికి సమాచారం**

- వాడుకలో ఉంచని ప్రీపెయిడ్ వినియోగదారులు అంటే, వరుసగా 90 రోజుల వ్యవధి వరకు ఇన్‌కమింగ్/ఔట్‌గోయింగ్ వాయిస్ లేదా వీడియో కాల్ ఔట్‌గోయింగ్ SMS, డేటా వినియోగం లేకుండా మరియు ₹20 లేదా అంతకుమించి బ్యాలెన్స్ ఉంటే, Vi ₹20 డెబిట్ చేసి మరియు ఆటోమేటిక్ నంబర్ రిటెన్షన్ స్కీమ్ (ఏఎన్ఆర్ఎస్) కింద వినియోగం లేని వ్యవధిని 1 నెల వరకు పొడిగిస్తుంది.
- బ్యాలెన్స్ ₹20 కంటే తగ్గేంత వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది, దాని తర్వాత నంబర్ శాశ్వతంగా డిస్కనెక్ట్ చేయబడుతుంది.
- ₹20 చెల్లించి వినియోగదారులు డిస్కనెక్షన్ అయిన 15 రోజులలోపు నంబర్‌ని తిరిగి యాక్టివేట్ చేసుకోవచ్చు.
- పోస్ట్‌పెయిడ్ వినియోగదారులు నామమాత్రపు ఛార్జీలు ₹150/3 నెలలకు మాత్రమే చెల్లించి వారి నంబర్‌ని సురక్షితం చేసుకోవచ్చు.

**అప్పీలేట్ అధికారికి ఫిర్యాదు**

Vi కేర్ అందించిన పరిష్కారంతో మీకు సంతృప్తి కలగకుంటే, మా అప్పీలేట్ అధికారి శిరీష్ తుంగారే, కస్టమర్ సర్వీస్ హెడ్‌కి మీరు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు నంబర్‌ని తెలియజేస్తూ మా కస్టమర్ సర్వీస్ ఏజెంట్స్ ద్వారా 198 (టోల్-ఫ్రీ)/ 9948002240 పై కాల్ చేసి లేదా; appellate.ap@vodafoneidea.comకి ఈమెయిల్ చేసి లేదా శిరీష్ తుంగారే, వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ ఆదిత్యా బిర్లా గ్రూప్ మరియు వొడాఫోన్ భాగస్వామ్యం, (CIN - L32100GJ1996PLC030976), Vi, 2వ అంతస్తు, వరుణ్ టవర్స్ II, బేగంపేట్, హైదరాబాద్ - 500016 కి పోస్ట్ చేయడం ద్వారా. మీ ఫిర్యాదు పరిష్కరింపబడిన తర్వాత 30 రోజులలోపు అప్పీలేట్ ఫిర్యాదు నమోదు చేయవచ్చు. మీరు ఫిర్యాదు చేసిన ప్రతిసారి డాకెట్ నంబర్ మరియు ఫిర్యాదు పరిష్కరించడానికి పట్టే సమయం, SMS ద్వారా పొందుతారు. మరింత సమాచారం, ఇంకా నియమ మరియు నిబంధనల కోసం www.myvi.inకి లాగ్ ఆన్ అవ్వండి.

**రిజిస్టర్డ్ కార్యాలయం**

వొడాఫోన్ ఐడియా లిమిటెడ్ సుమన్ టవర్, ప్లాట్ నం. 18, సెక్టర్ 11, గాంధీనగర్- 382011, గుజరాత్

ఫో: +91 796671 4000

Vi వెబ్‌సైట్: www.myvi.in

9848012345

వార్త

మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మనకున్నప్పుడు, అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

-ఫిలప్ మాసింగర్

# శాంతి ముహూర్తం?

పశ్చిమాసియాలో శాశ్వత శాంతిపవనాలు వీచే సమయం దగ్గరైంది. నేడో రేపో అనుకుంటున్న శాంతి ఒప్పందానికి ఈ నెల 19న సంతకాలు చేసుకునే ముహూర్తం కుదిరింది. ఈ విషయంలో శ్వేతసౌధాధిపతి ట్రంప్ చేయని ప్రయత్నం లేదు. ఆడని అబద్ధం లేదు. వేయని పాచిక లేదు. ఎవరెంత చీకాకు పెట్టినా ఎవరెంతగా బిగుసుకుపోయినా 'ముళ్ల మీద బట్ట'ను హుంకరింపులతోనైనా నెమ్మదిగా లాక్కోగలుగుతున్నారు. ఒప్పంద మార్గంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తనకు కొరకరాని కొయ్యగామారాడని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. ఎన్ని ఒప్పందాలు జరిగినా, ఎన్ని ఒడంబడికల మీదసంతకాలు చేసుకున్నా ఎక్కడో నెతన్యాహు మాట తప్పుతాడని భయం కాబోలు ఈ ఒప్పంద అమలుకు తానే భరోసా ప్రకటించుకున్నారు. లేకుంటే ఇరాన్ కూడా బిగుసుకుపోయి ఉండేది. ముందుకు రకడాలు, వెనక్కి తగ్గడాలు వంటివి ట్రంప్ పరిభాషలో వెనుక ముందు చూడకుండా అప్రయత్నంగా దొర్లే పదాలే. చివరాఖరికి బెదరించి దారిలోకి తెచ్చుకోవడమూ ఆయన నైజమే. ఒకవేళ ఒప్పంద అమలులో తేడా జరిగితే బాధిత దేశాలకు తానే గార్డియన్‌గా ఉంటానని చెప్పుకున్నారు. నిన్న మొన్నటి వరకు ఇరాన్‌ను వైమానిక దాడులతో బుగ్గిపాలు చేస్తామన్న ట్రంప్ అదే మాట మీద ఉండి దౌత్యవ్యవహారం నడిపించారని నేరుగా చెప్పలేం. మధ్యలో జరిగిన ఒకటి రెండు సంఘటనలు అమెరికాను ఆత్మరక్షణలో పడివేసినట్లున్నాయి. ఒమెన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న 'సెట్‌బెల్' అనే వాణిజ్య ట్యాంకర్‌పై అమెరికా చేసిన దాడిఅమెరికా, భారత్‌ల మధ్య చిచ్చుపెట్టింది.చెప్పాలంటే అంతర్జాతీయ చమురు సహజవాయువుల రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. అక్కడ వాణిజ్య నౌకలపై ఇరాన్ డ్రోన్‌లు బీభత్సం సృష్టించాయి. మారిటైమ్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం ఈ జలసంధి ప్రాంతంలో అంతర్జాతీయ నౌకలపై 46 దాడులు జరిగితే 14 మంది అంతర్జాతీయ నావికులు చనిపోయారు. ఇరాన్, అమెరికాల మధ్య ఒప్పందం అనే వార్తలతో ఇరానీయులు నిరసనలు వెలిబుచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ దేశ ప్రయోజనాలకు భంగం కలుగకుండా ఒప్పందం కుదరడమే తమకు ఆవశ్యకమని వారి డిమాండ్. అక్కడ అతివాదులు ఈ ఒప్పందం విషయంలో అనుమానాలు వ్యక్తం చేశారు. ఒప్పంద సంగతులు తెలియకుండా 'డీల్' కుదిరిపోయిందన్న వార్తలకు ఇరాన్ ఏమాత్రం సుముఖంగా లేదు. ఇదే సందర్భంలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు దూకుడుపై కూడా ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ట్రంప్ ఖండించారు. ఏమయితేనేం మధ్య ప్రాచ్యంలో శాంతి ఒప్పందం దాదాపు ఖరారైంది. ఈ విషయాన్ని పాకిస్థాన్ అధ్యక్షుడు షెహబాజ్ ధృవీకరించారు. శాంతి యత్నాలకు విఘాతం కలిగించవద్దని ట్రంప్ పదేపదే ఇతర దేశాలకు విజ్ఞప్తిచేస్తున్నారు. ఇకపై ఎలాంటి దాడులు చేసుకున్నా సహించబోనని ట్రంప్ తీవ్రస్థాయిలో హుంకరించారు. దాడులు,ప్రతిదాడులు కారణంగా'శాంతి' ఒప్పందం సంక్లిష్టంలో పడుతుందని ఆయన నమ్మకం. ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడం ఎంతో ముఖ్యం. ప్రస్తుతం శాంతిసంధి పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, టర్కీల కీలక మధ్యవర్తిత్వంతో కుదిరింది. సంతకాలు పెట్టుకునే వేడుక స్విట్జర్లాండ్‌లో జరుపుకోవాలని ఉభయ పక్షాలు అంగీకరించాయి. దౌత్యపరమైన చర్యలనంతరం యుద్ధంలో వ్యూహ, ప్రతివ్యూహాలు, దాడులు ప్రతిదాడులు చేసుకుంటున్న దేశాలు తమ శత్రుత్వాలను పక్కన బెట్టి లెబనాన్ సహా అన్ని ప్రాంతాలలో సైనిక చర్యలను శాశ్వతంగా నిలిపివేయడానికి అంగీకరించినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌లో ఒప్పంద పరిణామాల గురించి ట్రంప్ కూడా తన ట్రూత్‌సోషల్ ఖాతాలో ధృవీకరించారు. తక్షణమే హర్మూజ్ జలసంధిపై ఉన్న అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగిస్తున్నట్లు ఆయన ప్రపంచ దేశాల దృష్టికి తీసుకొచ్చారు. ఇరాన్ కూడా ఈ వివరాలను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ద్వారా షెడ్యూల్ ప్రకటించింది. తాజా ఒప్పందం ప్రకారం ప్రాథమికంగా కాల్పుల విరమణ 60 రోజులు అమలులో ఉంటుంది. అయితే ట్రంప్ ఎప్పటివలెనే ఒప్పంద వివరాలేకాకుండా తాను అనుకుంటున్న మరిన్ని అంశాలను కూడా వెల్లడించారు. ఒప్పందంపై సంతకాల తతంగం పూర్తయితే ఇరాన్‌లోని యురేనియంను తాము తెచ్చుకోగలమని ట్రంప్ ప్రకటించారు. ఈ అంశంపై తాము ససేమిరా అని ఇరాన్ ఆది నుంచి ఖచ్చితంగా వ్యవహరిస్తుండగా, అమెరికా ప్రకటనను ఇరానీయులు తప్పుపడుతున్నారు. అమెరికాతో 'డీల్' వద్దంటూ దేశంలోని పలు పట్టణాలు, నగరాల్లో వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇరాన్ వద్ద శుద్ధిచేసిన యురేనియం 440 కిలోల వరకుఉందని ఒక అంచనా. దీనికోసమే అమెరికా దుందుడుకుగా వ్యవహరిస్తోంది. కాగా ఇతరత్రా పరిస్థితుల రీత్యా అమెరికా లొంగింది కానీ లేకుంటే విజయమో,వీరస్వర్గమో తేల్చుకునే ఉండేది. ట్రంప్ నిర్ణయాలు, ఒప్పందాలు ఇజ్రాయెల్‌ను ప్రభావితం చేయజాలవని నెతన్యాహు ఇప్పటికీ బహిరంగంగానే చెబుతున్నారు. ఈ శాంతి ఒప్పందం సంతకాల వరకు వెళ్లోందన్న సమాచారంతో అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్‌లు ముందుకు నడుస్తున్నాయి. కాగా ఈ ఒప్పందంలో ఇజ్రాయెల్ పాత్ర విషయమై అనుమానాలున్నందున వాణిజ్యవర్గాలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి.

చేయకూడని పనులు చేసినందు వల్ల మనిషి ఏ విధంగా చెడుతాడో, చేయవలసిన పనులు చేయకపోయినా అలాగే చెడుతాడు.



జి.ముర్రే

చదవడం వల్ల ప్రయోజనం ఏమిటంటే నలుమూలల నుంచి వచ్చే విజ్ఞానాన్ని అంగీకరించడం దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవడం.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### పోస్టల్ డిపాజిట్లపై నిబంధనలు రద్దు చేయాలి

బ్యాంకుల్లో డిపాజిట్ వున్న వ్యక్తి చనిపోతే సదరు వ్యక్తి మరణ ధృవీకరణపత్రం తీసుకొని ఆ వ్యక్తి తెల్పిన జీవిత భాగస్వామికో,వారి పిల్లలకో వెంటనే డబ్బు చెల్లిస్తారు. కానీ పోస్టల్‌శాఖలో మాత్రండబ్బు నామినీకి చెల్లించకుండా, నామినీకి తెలిసిన మరో ఇద్దరు బయటి వ్యక్తులు వారి ఆధార్, పాన్‌కార్డులు పోస్టాఫీసులో ఇచ్చి సాక్షిసంతకాలు పెట్టాలనే రూలు పెట్టారు.బయట వ్యక్తులు తమ పనులువదిలి ఆఫీసు చుట్టూ తిరగలేరు. అంతేగాక పది, ఇరవైవేల చిన్నమొత్తాలకి కూడా వేరేవూళ్ళో వుండే నామినీలు నాలుగైదు సార్లు పోస్టాఫీసుల చుట్టూ తిరగటం కష్టం.ఈలావాదేవీల్లో అక్రమాలు ఉండవు. ఉంటే నామినీపై, వారసులపై చర్యలు తీసుకోవచ్చు. బయటి వారికి సంబంధం లేదు.ఆ కొద్దిమొత్తం కోసం తిరగలేక, ఆ వివరాలు తెలియక క్లెయిమ్ చేయని సామాన్యుల సొమ్ము ఇప్పటికే బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద భారీగా లక్ష కోట్ల రూపాయలకి పైగా వుందట. కనుక ఇకనైనా లక్ష రూపాయల్లోపువున్న చిన్నఖాతాలకి బయటివారి ఆధార్, పాన్ కార్డుల సమర్పణ వంటి నిబంధనలను రద్దు చేయాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### మధ్యవర్తులతో జాగ్రత్త

నేటి కాలంలో మనుషులు స్వార్థంతో పని చేస్తున్నారు. మనకు ఏదైనా ప్రభుత్వ ఆఫీసులలో పని కావాలంటే మధ్యవర్తులు కీలకపాత్ర పోస్తున్నారు.కానీ ప్రజలకు అవగాహన లేకపోవడంతో మధ్యవర్తులకు చాలా డబ్బులను దారపోస్తున్నారు. మిత్రమా మధ్యవర్తులతో పని లేదు. నీ పని నేరుగా నువ్వే చేసుకో మధ్యవర్తులను నమ్మకు. మోసపోకు. నమ్మితే నట్టేట ముంచుతారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### చేప పిల్లలను సప్లై చేయాలి

ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయి అనే వార్తల నేపథ్యంలో హిందూ మహాసముద్రంలోని ఒక విచిత్ర పరిస్థితి మనల్ని కాపాడుతున్నది. సాధారణంగా ఎల్ నీనో ప్రభావంతో రుతుపవనాలు వెనక్కు వెళ్ళిపోతాయి.కానీ ఇండియన్ నీనోతో ఆ రుతుపవనాలు వెనక్కి వెళ్లకుండా ముందుకు తోస్తూ కనీసంగా సాధారణ వర్షపాతం నమోదు అయ్యేట్టు చేస్తాయి. తద్వారా పంటలుకి నీటి కష్టం రాకుండా ఉంటుంది.కనుక రైతులకు చిన్న నీటి కుంటలు తీసుకునేట్టు అవగాహనా కల్పించి వారికి చేప పిల్లలు సప్లై చేయాలి.

-భారత అవినాష్, జనగామ

### మూఢనమ్మకాల నిర్మూలన అవసరం

అన్నమయ్య జిల్లాలోగుప్తనిధులు,ప్రేతాత్మల పేరుతో మాయల మరాఠీలు ప్రజలను మోసం చేస్తున్నారు. మొగవాళ్ళు ఆడ వేషాలు వేసుకొని మోసం చేస్తున్నారు. ఇలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలి.ఆత్మలే కల్పితం. ఇంకా ప్రేతాత్మాలేమిటి? మోసపోవద్దు.ప్రభుత్వానికి మూఢనమ్మకాల నుండి ప్రజలను చైతన్యం చెయ్యవలసిన బాధ్యత ఎంతో ఉంది.ఆ పని ప్రభుత్వం చేయటం లేదు. అందువలనే ఇలాంటి మోసగాళ్ళు పెరిగిపోతున్నారు. దొంగలుకాషాయ బట్టలు వేసుకొని బాబాల మాదిరి, సన్యాసుల మాదిరి గ్రామాలలోనూ, ముఖ్యంగాపట్టణాలలోనూ మోసం చేస్తున్నారు. మూఢ నమ్మకాలతో కూరుకుపోయిన ప్రజలు వారిని నమ్మి మోసపోతున్నారు. కనుక ఇలాంటి మోసాలనుండి ప్రజలను చైతన్యవంతులుగా చెయ్యాలంటే మూఢ నమ్మకాల నిర్మూలన మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మద్యం - జీవన వినాశనం

మద్యపానం నేడు అనేక కుటుంబాల ఆనందాన్ని దూరం చేస్తున్న ఒక ప్రమాదకరమైన దురలవాటు. క్షణిక సుఖం కోసంమద్యాన్ని ఆశ్రయించే వారు తెలియకుండానే తమ ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితిని, కుటుంబ బంధాలను కోల్పోతున్నారు. మద్యం వల్ల శారీరక, మానసిక సమస్యలు పెరిగి జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురికావడంతో పాటు పిల్లల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుంది. తాత్కాలిక మత్తు ఇచ్చే మద్యం శాశ్వత నష్టాలను మిగులుస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకొని మద్యానికి దూరంగా ఉండడం ద్వారా వ్యక్తి, కుటుంబం, సమాజం అభివృద్ధి పథంలో పయనించగలవు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### వార్తా పత్రికలు చదివించాలి

ఏ విద్యార్థికి అయినా మొదట చిన్న వార్తా పత్రికలు, కథల పుస్తకాలు చదవడం అలవాటు వారి సామాజిక జ్ఞానానికి మంచి ఆయుధం. చిన్న తరగతిలో మొదలైతే ,ఉన్నత చదువులకు గంటల తరబడి గ్రంథాలయంలో చదవే ఆసక్తి సులువుగా అలవడుతుంది. వృధా చేసే సమయంలో కొంతైనా తల్లితండ్రులు ఇంటికి తెచ్చే వార్త పత్రికలను చదివించాలి. ఆంగ్ల భాష జ్ఞానం కాస్త అర్థమైతే టీవీలో ఆంగ్లవార్తలను చూడడం ఇటురెండువైపుల భాష జ్ఞానం వృద్ధిపొందుతుంది.

-బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# జనగణనలో కులాలను చేరుస్తున్నారా?

**భారత దేశం ప్రజాస్వామ్య దేశం. మనకు ఇష్టం వున్నాలేకపోయినా పార్లమెంటరీ వ్యవస్థ ద్వారానే మార్పు తీసుకురావాలి. ఈ స్థితిలో సమాజంలోని అన్ని కులాలకువారికి మేలు జరగాలంటే కులాల వారీగా జనాభా గణన చేయడం ఒక్కటే పరిష్కారం. కేంద్రప్రభుత్వం తన ప్రకటనకు కట్టుబడి కులాల వారీగా జనగణను చేయడం అనివార్యం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఒబిసి, ఇడబ్ల్యూసి లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే అంశాలు తెలియాలంటే కులాల వివరాలు ప్రకటించడం అవసరం. ఒబిసి కులాల వివరాల సేకరణలో కేంద్రప్రభుత్వం మడమ తిప్పే ప్రయత్నం చేస్తే ఒబిసి కులాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందనడటంలో ఎటువంటి సందేహం లేదు.**



అన్నవరపు బ్రహ్మయ్య

జనగణలో భాగంగా కులాల వారీగా జనగణన చేయడానికి కేంద్రప్రభుత్వం అంగీకరించినప్పటికీ ఆచరణలో అమలుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భారతీయ జనగణన 2027ను రెండువిడతలగా(2 ఫేజ్లుగా)చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.మొదటి విడతలో గృహాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తే రెండో విడతలోజనాభా వివరాలను సేకరిస్తారు. మొదటి విడత 2026, ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు అంటే ఆరు నెలలు కొనసాగుతుంది. మొదటి విడతలో ఇళ్లకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. ఈ వివరాల సేకరణలో భాగంగా ఇంటి నెంబరు, ఇంటి నిర్మాణానికి, ఫ్లోర్ ఏర్పాటుకు వినియోగించిన మెటీరియల్, ఇంటిలో ఎంతమంది నివసిస్తున్నారు. ఇంటిలో ఎన్నిగదులు వున్నాయి, ఇంటి యజమాని పేరు, ఇంటి నిర్మాణం జరిగి ఎంత కాలమైంది. తాగునీటి సదుపాయం వుందా? ఎన్ని బాత్రూమ్లు వున్నాయి వంటి మొత్తం 34 ప్రశ్నలు వున్నాయి. ఈ ప్రశ్నలలో 13వ ప్రశ్న ఏమిటంటే.. ఇంటి యజమాని ఎస్సీ, ఎస్టి వర్గాలకు లేదా ఇతర వర్గాలకు చెందినవారా? అని వుంది. గృహ వివరాల సేకరణకు సంబంధించిన అప్లికేషన్ ఫారాలలో ఎస్సీ, ఎస్టిలకు సంబంధించి ప్రత్యేకంగా ప్రస్తావించారే కానీ ఒబిసిలకు సంబంధించిన ప్రస్తావనలేదు. కేంద్రప్రభుత్వం ఈసారి జనాభా లెక్కల సేకరణలో ఒబిసి కులాలకు సంబంధించిన వివరాలు ప్రత్యేకంగా సేకరిస్తామని ప్రకటించింది. కానీ వివరాల సేకరణలో ఒబిసి అనే ప్రస్తావన లేకుండా ఇతర వర్గాలతో కలిపి నిర్వహిస్తున్నారు. ఈ కారణంగానే జనాభా గణనలో ప్రత్యేకంగా ఒబిసి కులాల వివరాలు సేకరిస్తారా.. లేదా? అనే అనుమానం కలుగుతోంది. రెండో విడత (సెకండ్ ఫేజ్) జనగణనలో మనుషులకు సంబంధించిన వివరాలను 2026 అక్టోబరు నెల నుంచి 2027 మార్చి 1వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా విడుదల చేసిన ప్రకటన ప్రకారం 2025, ఏప్రిల్ 30వ తేదీన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశ నిర్ణయం ప్రకారం కులాల వారీగా కూడా జనగణన జరుగుతుందని పేర్కొన్నారు. కానీ మొదటి విడతలో జరుగుతున్న గృహాల వివరాల సేకరణ అప్లికేషన్ ఫారమ్లో ఎస్.సి., ఎస్.టి.ల ప్రత్యేక ప్రస్తావన మాత్రమే వుంది. ఈ స్థితిలో రెండో విడత జనాభా వివరాల సేకరణలో కూడా ఎస్సీ, ఎస్టిలను మాత్రమే గుర్తించి మిగిలిన కులాలను అన్ని అదర్స్‌గా పేర్కొంటారేమోనని ఒబిసి వర్గాలలో ఆందోళన వ్యక్తం అవుతోంది. 90ఏళ్ల క్రితం అంటే బ్రిటీషు ప్రభుత్వ కాలంలో 1931లో జరిగిన జనాభా గణన సమయంలో కులాల వారీగా జనభా గణనచేశారు. మరల ఈనాటి వరకు జరపలేదు. మండల కమీషన్ ఈనివేదిక ప్రకారమే ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలని నివేదిక సమర్పించి. ఈ 90 ఏళ్ల కాలంలో సామాజికంగానే కాకుండా జనాభా పరంగా ఎన్నో మార్పులు జరిగాయి. అంతేకాకుండా బిసి జాబితాలో వున్న కులాల సంఖ్య కూడా 83నుంచి 131కి చేరింది. కాని బీసీ కులాల రిజర్వేషన్లలో ఎటువంటి పెరుగుదల లేదు. రిజర్వే



షన్లు 50 శాతానికి మించకూడదని చెప్పిన కోర్టు, తన తీర్పును తానే అధిగమిస్తూ కొత్తగా ఇడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్) పేరిట అగ్రకులాల వారికి 10 శాతం రిజర్వేషన్ కలిపించింది. జనాభాలో మొత్తంగా 16 శాతం కూడా లేని ఒసిలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించగా 52 శాతం వున్న ఒబిసిల రిజర్వేషన్లపై 27శాతానికి పరిమితులు విధించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 'మేమెంతో మా కంత' అనే నినాదంతో బిసి గణన జరిగి వారి జనాభా శాతానికి అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని ఒబిసిలు దేశవాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. కులాల జనగణన వల్ల దేశ సమైక్యతకు భంగం వాటిల్లుతుందని కొంతమంది సన్నాయి నొక్కులు నొక్కుతూ కులాలవారీగా గణనకు అభ్యంతరం తెలిపారు. గతంలో కులాల వారీగా జనగణన అధికారికంగా జరగకపోయినా వాస్తవంలో రాజకీయాలన్నీ కులాల ఆధారంగానే రాజకీయాలు నిర్వహిస్తున్నాయి. ఇందుకు కమ్యూనిస్టు పార్టీలు మినహాయింపు కాదు. ఎన్నికల సమయంలో నియోజకవర్గాలలో ఏ కులానికి చెందిన ఓట్లు ఎన్నివున్నాయనే లెక్కల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. బీసీలలో కొంచెం సంఖ్యాపరంగా, ఆర్థికంగా స్థిరపడిన తూర్పు కాపు, కొప్పుల వెలమ, గౌడ, యాదవ, పద్మశాలీ, ముదిరాజ్, అగ్నికుల క్షత్రియ వంటి కులాల వారికి రెండు, మూడు సీట్లు కేటాయించి మిగిలిన అన్ని సీట్లలో అగ్రకులాల వారే చట్టసభలకు పోటీ చేస్తున్నారు. చేతివృత్తి సేవా కులైన నాయీబ్రాహ్మణ, రజక, విశ్వబ్రాహ్మణ, మేదర, కుమ్మరి, పూసల వంటి కులాలకు చెందిన వారిని ఏ మాత్రం పట్టించకోవడం లేదు. సంచార జాతులైన బుడబుక్కల, గంగిరెద్దుల, కాటిపాపల, మొండి, బండ వంటి కులాల పరిస్థితి మరీ దయనీయంగా వుంది. కొంతమంది చెబుతున్నట్టుగా ఆర్థిక పరిస్థితితోనే సమానత్వం సాధ్యం అవుతందనే మాట నిజమైతే బీసీ కులాలకు చెందిన వారు అనేక మంది ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ పరంగా ఉన్నత స్థితిలో వున్నప్పటికీ రాజకీయపార్టీలు వారికి ఎందుకు చట్టసభలలో ప్రాతినిధ్యం కల్పించడం లేదు? మొత్తం జనాభాలో 52 శాతం బీసీలు వున్నారంటూ రాజకీయ పార్టీల నేతలు పదేపదే వ్యాఖ్యానిస్తుంటారు. పార్లమెంటులోమొత్తం 542 స్థానాలు వుండగా, బిసిలే 52 శాతం నిష్పత్తి ప్రకారం 276 స్థానాలలో బీసీలు ఎంపిక కావాల్సి వుంటుంది. కాని ప్రస్తుత పార్లమెంటు(లోక్‌సభలో) బీసీ వర్గాలకు సంబంధించి కేవలం 93మంది (బిజెపి, కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలతోసహా అన్ని పార్టీల నుంచి) సభ్యులు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని అసెంబ్లీల పరిస్థితి ఇదే విధంగా వుంది. ఉదాహారణకి తెలుగు రాష్ట్రాలలో జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తేఉభయ తెలుగు రాష్ట్రాలలో అసెంబ్లీలో వున్న 296 స్థానాలకుగాను కనీసం 150 స్థానాలు బీసీలకు చెందాలి. కాని 60 నుంచి 90 స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయిస్తూ మెజారిటీ స్థానాలను గెలుపు గుర్రాల పేరుతో పాలకవర్గాలకు చెందిన వారికి కేటాయిస్తున్నారు.చట్టసభలలో ఒబిసి సభ్యులసంఖ్య ఏనాడు 35 శాతానికి మించలేదు. ఈస్థితిలో ప్రజల కోరిక ప్రకారం కేంద్రప్రభుత్వం ఒబిసిలకే పరిమితం కాకుండా మొత్తంగా కులాలవారీగా గణన చేస్తామని ప్రకటించింది. కానీ ఆచరణలో అనుమానాలు కలుగుతున్నాయి. భారత దేశం ప్రజాస్వామ్య దేశం. మనకు ఇష్టం వున్నాలేకపోయినా పార్లమెంటరీ వ్యవస్థ ద్వారానే మార్పు తీసుకురావాలి. ఈ స్థితిలో సమాజంలోని అన్ని కులాలకువారికి మేలు జరగాలంటే కులాల వారీగా జనాభా గణన చేయడం ఒక్కటే పరిష్కారం. కేంద్రప్రభుత్వం తన ప్రకటనకు కట్టుబడి కులాల వారీగా జనగణను చేయడం అనివార్యం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఒబిసి, ఇడబ్ల్యూసి లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే అంశాలు తెలియాలంటే కులాల వివరాలు ప్రకటించడం అవసరం. ఒబిసి కులాల వివరాల సేకరణలో కేంద్రప్రభుత్వం మడమ తిప్పే ప్రయత్నం చేస్తే ఒబిసి కులాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందనడటంలో ఎటువంటి సందేహం లేదు. ●

# జనాభా సంక్షోభంతో కోలుకోలేని చైనా

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రస్తుతం చైనా జనాభా 1.413 బిలియన్లతో భారత్ (1.48 బిలియన్లు) తర్వాత 2వ అత్యధిక జనాభా కలిగిన దేశంగా నిలుస్తున్నది. నేటి జనాభా మార్పుల గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే రానున్న రోజుల్లో చైనా పతనం తథ్యం అనిపిస్తోంది. ప్రస్తుతం చైనాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ, ఉత్పాదకతకు మూలాధారమైన యువత సంఖ్య తగ్గడం వేగంగా జరుగుతోంది. దీనికి తోడుగా అత్యంత ప్రమాదకరమైన మరో జనాభాకు సంబంధించిన అంశం చైనాను నిద్ర పోనివ్వడంలేదు. నేటి డిజిటల్ ఏఐ యుగంలో చైనాలో మహిళల జనాభాతగ్గడం గమనిస్తున్నారు. మళ్లీ జనాభా కోలుకునే స్థాయికి రావడానికి కావలసినంత మహిళల జనాభా కనిపించడం లేదు. ఐరోపా, జపాన్‌లో జనాభా ఒకేసారి కాకుండా క్రమంగా, నెమ్మదిగా తగ్గడం జరిగింది. మహిళల సంఖ్య తగ్గడంతో చైనాలో జనాభా ప్రతికూల మార్పులు వేగంగా జరుగుతున్నాయి. రానున్న భవిష్యత్తులో చైనాలో జనాభా మళ్లీ పెరగడం అసాధ్యంగా తోస్తున్నది. ఈ ప్రతికూల జనాభా మార్పులతో చైనాలో వినియోగదారులు తగ్గడం, మార్కెట్ కుచించుకుపోవడంతో చైనా ప్రగతి కుంటుపడే ప్రమాదం ఏర్పడుతున్నది.1980-2016 మధ్యకాలంలో చైనా నిర్బంధంగా అమలు పరిచిన ఏక సంతాన విధానం (వన్ చైల్డ్ పాలసీ)" కారణంగా స్త్రీపురుష నిష్పత్తి భారీగా పడిపోయింది. ఒకే కొడుకులను మాత్రమే కనాలనే చైనా దంపతులు ఆడ బిడ్డల్ని కడుపులోనే అబార్షన్ రూపంలో హత్య చేయడం కొనసాగింది. 2016 తర్వాత చైనాలో 'ద్వి సంతాన విధానం' అమలులోకి వచ్చింది. 2021లో చైనా 'ముగ్గురు పిల్లల విధానం' ప్రవేశపెట్టబడింది. ఎక్కువ పని గంటలు, జీవనశైలి మార్పులు, పట్టణీకరణ ప్రభావం, అధిక జీవన వ్యయం, మారుతున్న సామాజిక నియమాలు,తక్కువ వేతనాలు ఉండడంతో చైనాలో దంపతులు పిల్లల్ని కనడానికి జంకుతున్నారు. 2022 నుంచి చైనా జనాభా క్షీణించడం మొదలైంది. నేటి చైనా జనాభా 141 కోట్ల నుంచి 2100 నాటికి63కోట్లకు పడిపోవచ్చని హెచ్చరిస్తున్నారు.1970లో మొత్తం సంతానోత్పత్తి రేటు 5.81 ఉండగా, 1979లో 2.75 వరకు పడిపోయింది. 2020 నాటికి ఇది 1.18, ప్రస్తుతం దాదాపు ఒకటి కన్న తక్కువగా నమోదు అవుతోంది. చైనా జనాభా సగటు వయస్సు 40.6 ఏండ్లు దాటింది. భారత జనాభా సగటు వయస్సు 29.2 ఏండ్లుగా నమోదు అవుతున్నది.2040నాటికి వృద్ధులు దాదాపు 28 మిలియన్లకు, 2050నాటికి జనాభాలో 30 శాతానికి చేరవచ్చు. నేడు చైనాలో జననాల రేటు తగ్గడం, వృద్ధుల జనాభా వేగంగా పెరగడం, శ్రామికశక్తి కుచించుకుపోవడం వల్ల ఆ దేశ ఆర్థిక సామాజిక ప్రగతి ప్రమాదంలో పడుతున్నది. నేడు చైనాలో సంతానోత్పత్తి రేటు ప్రమాదకరమైన ఒకటికి పడిపోయింది. యువశక్తి తగ్గడం వల్ల శ్రామిక శక్తి పలుచబడుతోంది. వృద్ధుల జనాభా పెరగడంతో వారి పోషణ మహా భారమైపోతూ, వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. చైనా జనాభా మార్పుల వివరణకు 4 21 నియమం" ప్రతిపాదించబడింది. ఒక బిడ్డకు అమ్మ నాన్న రూపంలో ఇద్దరు,నలుగురు పెద్దల(తాతలుఅమ్మమ్మ/నాన్నమ్మ) రూపంలో నలుగురు ఒక కుటుంబంగా ఉంటున్నారు.నేడు చైనాలో కేవలం 36శాతం జనాభా మాత్రమే 20నుంచి 59ఏండ్ల వయస్సు లోపుఉన్నారు.ఇదే జనాభా భారత్‌లో దాదాపు 60 శాతం వరకు ఉండడం విశేషం. ఈ జనాభా పడిపోవడంతో పారిశ్రామిక, తయారీ రంగ ప్రగతి రథం కదలడానికి మొరాయిస్తున్నది.సమీప భవిష్యత్తులో వినియోగదారులు తగ్గిపోయి ఆర్థికవృద్ధి మందగిస్తుందని హెచ్చరికలు వింటున్నాం. ఒకప్పుడు అత్యధిక ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తూ చైనా అగ్రభాగాన ఉండేది. నేడు జరుగుతున్న అవాంఛనీయ జనాభా మార్పులతో ఆర్థిక అభివృద్ధి ప్రమాదకరమైన పతన అంచున నిలబడింది. సంతానోత్పత్తి తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడం, శ్రామిక శక్తి పలుచబడడం, మహిళల జనాభా కుచించుకుపోవడంతో చైనా పలు సవాళ్లను ఎదుర్కొంటున్నది. ●

# పశువుల ఆకలిని తీర్చాల్సిన బాధ్యత ఎవరిది?



డాక్టర్ నీలం సంపత్

మానవ తప్పిదాలతో పర్యావరణ విధ్వంసం జరిగి దాని పరిణామంగా ఏర్పడిన అసంతులనంతో సముద్ర గర్భంలో ఏర్పడుతున్న ఎల్‌నినో లాంటి వాతావరణ ఉత్పాతాలతో ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడేప్రమాదం ముంచుకొస్తుందనే వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం ఖరీఫ్ సాగుకు సిద్ధమోతోంది. వర్షాభావపరిస్థితుల నేపథ్యంలో బంజరు భూములలో గడ్డి పెరుగుదల కలగా మారిపోయే ప్రమాదం ముంచుకొస్తోంది. ఆధునిక వ్యవసాయ రంగం ట్రాక్టర్లూ, కల్టివేటర్లూ, వరి కోత యంత్రాలు, క్రిమిసంహారక మందులను పిచికారీ చేసే సాధారణ యంత్రాలతోపాటు పాటు వాటిని స్ప్రే చేసే అత్యంత ఆధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నప్పటికీ సేద్యానికి ఉపయోగించే నాగలితో పాటు వ్యవసాయ ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో విక్రయించడానికి ఉపయోగిస్తున్న బండ్లను నడిపించే ఎడ్ల పాత్ర నేటికీ కొనసాగుతుండడం తెలిసినదే. దానికి తోడు గ్రామాలలో ప్రతి ఇంటా పాడిపశువుల పెంపకం గ్రామీణ ప్రాంతాలలో నేటికీ మెజారిటీ కుటుంబాల ఆర్థికవ్యవస్థకు వెన్నెముకగానే భావించక తప్పదు. పల్లెలే దేశానికి పట్టు గొమ్మలనే నానుడిలో ఆ పల్లెల భవితవ్యం పశుసంపదపైన ఆధారపడిన నేపథ్యంలో దేశానికి స్వాతంత్ర్యం రాక ముందేకాదు వచ్చిన తర్వాత సైతంపశువుల ఆకలిని తీర్చడానికి బంజరు భూముల్లో, గ్రామ కంఠం భూముల్లో, కొన్ని ప్రాంతాలలో రెవిన్యూ భూముల్లో పశువుల మేతకు అవసరమైన గడ్డి విస్తారంగా లభించేది. స్థానిక గ్రామ పంచాయతీల నేతృత్వంలో ఆయా గ్రామాలలో పశుసంపదకు అవసరమైన గడ్డిని అందించడం కోసం గోచార్, గైరాన్ భూములను కేటాయించి వాటిని సంరక్షించే బాధ్యతను ఆయా గ్రామ పంచాయతీలే చేపట్టేవనడంలో ఎలాంటి సందేహంలేదు. ఐతే మారుతున్న కాలమాన పరిస్థితులను బట్టి ఆయా గ్రామాల సామాజిక,ఆర్థిక అవసరాలను బట్టి సదరు ప్రభుత్వభూములలో నుండిరైతు వేదికల నిర్మాణాలు, వైకుంఠ ధామాలకు,పల్లె ప్రకృతి వనాలకు, క్రీడాప్రాంగణాలకు,కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాలకు కొన్ని భూములను కేటాయించడం కారణంగా గ్రామ కంఠం భూముల విస్తీర్ణత తగ్గిపోతోంది. దీనికితోడు పేదలకు ఉచిత గృహ నిర్మాణాల కోసం,రోడ్ల నిర్మాణం కోసం, వ్యవసాయం కోసం సైతం సదరు ప్రభుత్వ భూములను ఉపయోగించడం మూలాన వాటి విస్తీర్ణత తగ్గిపోతుంది. దీనికి భిన్నంగా పశుసంపద సంఖ్య పెరిగిపోతుండడంతో పశువుల మేత కొరత పెరుగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.కొన్ని గ్రామాలలో బడా బాబులు సదరు ప్రభుత్వ భూముల దురాక్రమణకు పాల్పడుతున్న కారణం



గా, మరికొన్ని ప్రాంతాలలో స్థానిక సంస్థలే తమ అవసరాల కోసం పశువుల మేతకు అవసరమైన సదరు భూములను ఇతర పనులకు ఉపయోగిస్తున్నందున ఆ భూములు మాయమైపోతున్నవి. ఫలితంగా మేత దొరకక పశుసంపద ఆకలితో అల్లాడుతుంది.సొంతభూముల్లోనే పశుగ్రాసంపెంచుకోవాల్సిన పరిస్థితులు?పశువుల మేతకు గ్రామ కంఠం భూములు అందుబాటులోలేని నేపథ్యంలో మెజారిటీ గ్రామాలలో రైతులు తమ తమ పట్టా భూముల్లోనే పశుగ్రాసాన్ని పెంచుకోవాల్సివస్తోంది. ఐతే భూమి లేని రైతులు మాత్రం పశువుల గడ్డిని పెంచుతున్న రైతుల నుండి గడ్డిని కొనక్కుంటూ ఎవరి పశువుల పాకలో వారే తమ పశువులకు అవసరమైన మేతను సమకూర్చుకోవాల్సి రావడం గమనార్హం. మరోపక్క నీటికొరత తదితర కారణాల సాకుతో పచ్చి గడ్డిని పండించే రైతులు అధిక ధరలకు విక్రయిస్తుండడం కొనుగోలు దారులకు ఇబ్బందిగా మారుతోంది. రిజర్వు ఫారెస్ట్ నెపంతో క్షేత్ర స్థాయి అటవీశాఖ అధికారులు అటవీ సమీప గ్రామాల రైతుల పశువులను మేత కోసం అడవిలోకి అనుమతించకపోవడం మూగ జీవాలు ఆకలికి అలమటించేలా చేస్తుండడం బాధాకరం. పలు సందర్భాల్లో మేతను సమకూర్చలేని రైతులు తమ కన్న బిడ్డల లాంటి పశువులు ఆకలితో అల్లాడుతున్న వైనాన్ని భరించలేక కబేలాలకు విక్రయిస్తుండడం చూస్తే గుండె చెరువౌతోంది. ప్యాకింగ్ సౌలభ్యం నేపథ్యంలో పట్టణాల ఎల్లలు దాటి పల్లె సీమల్లోకి ప్రవేశిస్తున్న పాలిథిన్ కవర్లను ఆహారంగా భావించి తింటున్నపశువులు అనారోగ్యంతో అకాల మృత్యువాత పడుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమిస్తున్న ప్రమాదకరమైన పాలిథిన్ కవర్లను నిషేధించాల్సిన ప్రభుత్వ పాలన విధానాలు కాగితాలకు, కార్యాలయాలకే పరిమితమోతున్నాయనేభావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. రాజ్యాంగ నిబంధనలననుసరించి మూగ జీవాల జీవించే హక్కులను గౌరవించాల్సిన స్థానిక సంస్థలు పశువుల మేతకు అవసరమైన భూములను కాపాడాల్సిన బాధ్యతను త్రికరణ శుద్ధిగా నిర్వర్తించకపోవడం మూలాననే మేత కొరతతో పశువుల మనుగడ ప్రశ్నార్థకమోతోందని బుద్ధిజీవుల నిశ్చితాభిప్రాయం. రాజ్యాంగ నిబంధనలను అనుసరించి మూగ జీవాల జీవించే హక్కుని కాపాడాల్సిన బాధ్యత నిస్సందేహంగా గ్రామ పంచాయతీలదే. అందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో పశువులను సామూహికంగా మేపడానికి అవసరమైన గోచర్, గైరానా, గ్రామకంఠం భూములను దురాక్రమణలకు లోనుగాకుండా కాపాడాలి. అదే విధంగా పంటకోత తర్వాత పంట భూముల్లో సైతం ఓ పదిహేను రోజులపాటు పశువులను మేపవచ్చును. గ్రామీణ ఉపాధి హామీపథకం తోడ్పాటుతో బంజరు భూములను పచ్చికను పెంచడానికి అవసరమైన సారవంతమైన భూములుగా మార్చాలి. అలా చేసినప్పుడే అందులో ఆయా గ్రామాల పశువుల అవసరాలను తీర్చే పశుగ్రాసం లభ్యమోతుంది.చట్టరీత్యా గ్రామసభ పశువుల మేతకు అవసరమైనగడ్డిని సమకూర్చడానికి అవసరమైన సకల చర్యలను తీసుకోవాలి. సామూహిక పచ్చిక మైదానాలను ఏర్పాటు చేస్తూ అందులో సరైనపోషక విలువలు కలిగిన సంకరజాతి గడ్డిని పెంచాలి. అందుకోసం ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు,సూచనలు తీసుకోవాలి. ఎండాకాలంలో మూగజీవాల ఆకలిని తీర్చడానికి అవసరమైన ఎండు గడ్డిని నిల్వఉంచడంతోపాటు తాగునీటి గుంటలను ఏర్పాటు చేయడం ద్వారా పశువుల తాగునీటి అవసరాలను సైతం తీర్చాల్సిన బాధ్యత నిస్సందేహంగా ప్రభుత్వాలదే. ●

# ఎల్‌నినో ప్రభావం మరింత అధికమే




## కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
## దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరం
## నిరంతర సంస్కరణలు అవసరమని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 15:** భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉందని, అయితే ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దీర్ఘకాలికంగా వృద్ధిని కొనసాగించాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం చాలా అవసరమని ఆమె స్పష్టం చేశారు. సోమవారం 'మైండ్‌మైన్ సమ్మిట్ 2026'లో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ "మన దేశం ఆర్థికంగా బాగానే రాణిస్తోందని నాకు తెలుసు. కానీ, మన పనితీరును మనం నిరంతరం జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి. ఇంకా ఎక్కడ మెరుగుపరుచుకోవాలో గుర్తించాలి" అని అన్నారు. కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే సరిపోదని, స్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు.

భారత్ వంటి పెద్ద, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని నిలబెట్టుకోవాలంటే సామర్థ్యాలను బలోపేతం చేయడం, సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చూడటం కోసం నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. "పురోగతి దానంతట అదే వస్తుందని భావించకూడదు. వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి నిరంతర కృషి, ఆవిష్కరణలు, సంస్కరణలు తప్పనిసరి" అని ఆమె పేర్కొన్నారు.

అనేక రంగాలు బలంగా రాణిస్తున్నప్పటికీ, ముఖ్యంగా సంక్లిష్టమైన, మధ్యంతర ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన కొన్ని రంగాలకు విధానపరమైన మద్దతు ఇంకా అవసరమని ఆమె అంగీకరించారు. దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లను నిర్మాణాత్మక సంస్కరణలు, మెరుగైన అమలు లేదా కొత్త విధానాల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో విధానకర్తలు నిరంతరం పరిశీలించాలని నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు.

**ఎల్ నినోపై హెచ్చరిక:**
ఈ యేడాది ఎల్ నినో ప్రభావంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కీలక హెచ్చరిక చేశారు. దీని కారణంగా రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని, ప్రభుత్వం అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. "కొన్ని ప్రాంతాలు పొడిగా ఉండొచ్చు, మరికొన్ని చోట్ల అధిక వర్షాలు కురవొచ్చు. ఇది యేడాది పొడవునా ఆందోళన కలిగించే అంశం. అయితే, ఈసారి ఎల్ నినో కారణంగా బలహీనమైన రుతుపవనాలకు మేం సిద్ధమవుతున్నాం" అని నిర్మల వివరించారు. కోవిడ్19 మహమ్మారి అనంతర ప్రభావాలు ఇంకా ప్రణాళికలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, పెద్ద అంతరాయాలు ఏవీ ఊహించడం లేదని ఆమె తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.



# ఉక్రెయిన్‌పై మళ్లీ విరుచుకుపడిన రష్యా

## దాడిలో 9 మంది మృతి, పురాతన చర్చి దగ్ధం

**కీవ్, జూన్ 15:** ఉక్రెయిన్‌పై రష్యా మళ్లీ విరుచుకుపడింది. తాజా దాడిలో 9 మంది మృతి చెందారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఉన్న 11 శతాబ్దం నాటి దార్మిషియన్ క్యాథడ్రల్‌పై కూడా దాడి జరిగింది. ఆ దాడి వల్ల చర్చిలో మంటలు చెలరేగాయి. కీవ్‌లో మొత్తం నలుగురు మృతి చెందారు. ఖార్కీవ్‌లో మంటల్ని ఆర్పబోయిన అయిదుగురు రెస్క్యూ కార్మికులుకూడా మృతి చెందినట్లు తెలిసింది. దేశ ప్రజలు, వారసత్వంపై రష్యా క్రూరమైన దాడి చేసిందని ఉక్రెయిన్ ప్రధాని యులియా సిరిడెంకో ఆరోపించారు. కీవ్‌లోని పురాతన చర్చిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. మరోవైపు రష్యాపై జరిగిన ఉక్రెయిన్ డ్రోన్ దాడి వల్ల మాస్కో సమీపంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఒకరు గాయపడ్డారు. రష్యా జరిపిన డ్రోన్, మిస్సైళ్ల దాడి వల్ల భవనాలు, కార్లకు నిప్పు అంటుకున్నది. సుమారు 14 వేల మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం మొత్తం ఎయిర్ రెయిడ్ వార్నింగ్ జోన్‌లోనే ఉక్రెయిన్ ఉన్నది. ఉక్రెయిన్‌కు చెందిన మూడు ప్రధాన నగరాల్లో ఉన్న మిలిటరీ పరిశ్రమ కేంద్రాలపై రష్యా లాంగ్ రేంజ్ దాడులకు పాల్పడింది. ఆ నగరాల్లో ఉన్న ఎయిర్‌ఫీల్డ్‌లను కూడా టార్గెట్ చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఆకాశం, నేల, సముద్రం నుంచి డ్రోన్లు, మిస్సైళ్లను ప్రయోగించినట్లు రష్యాచెప్పింది. అన్ని లక్ష్యాలను అనుకున్నట్లే పేల్చి వేశామని రష్యా పేర్కొన్నది. మొత్తం 16 పారిశ్రామిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు రష్యా సైన్యంతెలిపింది. డ్రోన్ వార్‌హెడ్స్‌ను ఉత్పత్తి చేస్తున్న ప్రాజెక్టునుకూడా పేల్చేశారు. అక్కడ ఫ్లమింగో క్రూయిజ్ క్షిపణులు తయారు అవుతున్నాయి. కీవ్‌లో ఉన్న ఓ పోస్టల్ టర్మినల్‌పై కూడా దాడి చేశారు. మిలిటరీ లాజిస్టిక్స్, డ్రోన్ల సరఫరా, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్‌ను తరలిస్తున్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారు. కీవ్‌లోని సినిమా స్టూడియోను కూడా పేల్చేశారు. అక్కడ కమికేజ్ డ్రోన్లను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. రష్యాకు చెందిన 70 క్షిపణులు, 600కుపైగా డ్రోన్లను డిటెక్ట్ చేసినట్లు ఉక్రెయిన్ మిలిటరీ పేర్కొన్నది. చర్చిపై తాము దాడి చేయలేదని రష్యా చెప్పింది. బహుశా పేట్రియాల్ మిస్సైల్ పేలి ఉంటుందని చెప్పింది.

# పాక్‌లో కూలిన శిక్షణ విమానం ఇద్దరు పైలట్లు మృతి

**ఇస్లామాబాద్, జూన్ 15 :** పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన శిక్షణ విమానం కూలింది. ఖైబర్ ఫక్తున్‌క్వా ప్రావిన్స్‌లోని మర్దాన్‌లో జరిగిన ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మృతి చెందారు. రోటీన్ ట్రైనింగ్ మిషన్‌లో భాగంగా జరిగిన ఫ్లయింగ్ సెషన్ విషాదానికి దారితీసింది. మృతులను పాక్ వైమానిక దళానికి చెందిన ఫ్లయిట్ లెఫ్టినెంట్ మొమమ్మద్ ఖాసిమ్ అబ్దుల్లా, పాక్ నేవీకి చెందిన లెఫ్టినెంట్ తాహా అబ్బాస్‌గా గుర్తించారు. ఈ ప్రమాదం పట్ల దర్యాప్తునకు ఆదేశించినట్లు వైమానిక దళం పేర్కొన్నది. పైలట్‌ల మృతి పట్ల ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్‌మునీర్‌తోపాటు వివిధ దళాలకు చెందిన చీఫ్‌లు సంతాపం ప్రకటించారు. పైలట్ల మృతి పట్ల దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా నివాళి అర్పించారు.

# కర్ణాటకలో మళ్లీ రిసార్ట్ రాజకీయాలు

**బెంగళూరు, జూన్ 15:** కర్ణాటకలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ రిసార్ట్ రాజకీయాలకు తెరలేపాయి. క్రాస్ ఓటింగ్ నుంచి ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ తమ ఎమ్మెల్యేలను రిసార్ట్‌కు తరలిస్తోంది. జూన్ 18న కర్ణాటకలోని యేడు శాసన మండలి (ఎమ్మెల్సీ) స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్ తరఫున ఐదుగురు అభ్యర్థులు బికె హరిప్రసాద్, తిప్పనప్ప కామక్నూర్, పివి మోహన్, శివన్న బిఎస్, వినయ్‌కార్తీక్ ప్రకాష్‌ను బరిలోకి దించింది. జెడిఎస్ తరఫున గోవిందరాజు పోటీ చేస్తుండగా, బిజెపి నుంచి లింగరాజ్ పాటిల్, రఘు ఆర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలోకి దింపింది. దీంతో ఏడు స్థానాలకుగాను ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాగా, కర్ణాటక అసెంబ్లీలో ప్రస్తుతం 222 మంది సభ్యులు ఉన్నారు. రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఎమ్మెల్సీగా విజయం సాధించడానికి ప్రతి అభ్యర్థికి 28 ఓట్లు అవసరం. ప్రస్తుత సభ్యుల సంఖ్యా బలం ప్రకారం, కాంగ్రెస్ పార్టీ నాలుగు, బిజెపి రెండు స్థానాలు కైవసం చేసుకునే అవకాశమున్నది. అయితే ఏడవ స్థానం కోసం కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ కార్తిక్ ప్రకాష్, జెడి(ఎస్) అభ్యర్థి గోవిందరాజు మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. దీంతో క్రాస్ ఓటింగ్ కీలక అంశంగా మారనున్నది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేలను రిసార్ట్‌కుతరలించింది. జూన్18న పోలింగ్ జరిగే వరకు బెంగళూరుకు 28 కిలోమీటర్ల దూరంలో ఉన్న వండర్లా అమ్యూజ్‌మెంట్ పార్క్ ప్రాంగణంలోని టెర్రియా రిసార్ట్‌లో ఎమ్మెల్యేలను ఉంచనున్నారు. జూన్ 18న వారిని నేరుగా అసెంబ్లీకి తరలించి ఓటు వేయించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# మోడీ పర్యటనపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఆసక్తికర పోస్ట్



**పారిస్, జూన్ 15:** భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఫ్రాన్స్ పర్యటనకు సంబంధించి ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆసక్తికర పోస్టు చేశారు. భారత్-ఫ్రాన్స్ సంబంధాలకు బాలీవుడ్ టచ్ ఇస్తూ, ప్రధాని మోడీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ఆయన షేర్ చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ చిత్రం 'ధురంధర్'లోని ప్రముఖ 'ఆరీ ఆరీ' పాటను బ్యాక్‌గ్రౌండ్‌లో ప్లే చేస్తూ మోడీ పర్యటనలోని ముఖ్య ఘట్టాలను ఆ వీడియోలో పొందుపరిచారు.

సుమారు 30 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోను 'ఎక్స్', ఇన్‌స్టాగ్రామ్‌లో మెక్రాన్ పోస్టు చేశారు. మోడీ, మెక్రాన్ పరస్పరం కరచాలనం చేసుకోవడం, ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవడం నుంచి వీడియో ప్రారంభమవుతుంది. అనంతరం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో మోడీ పాల్గొన్న కార్యక్రమాలు, ఇరు దేశాల మధ్య సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన దృశ్యాలు కనిపిస్తాయి. భారతీయ పాప్ కల్చర్‌ను మెక్రాన్ తన సోషల్ మీడియా పోస్టుల్లో ఉపయోగించడం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా భారత్ పర్యటన ముగిసిన తర్వాత 'ధురంధర్'కు సంబంధించిన సంగీతంతో కూడిన వీడియోను ఆయన షేర్ చేశారు. దీంతో భారతీయ నెటిజన్ల నుంచి మంచి స్పందన లభించింది.

# కెనడాలో కొత్త ఇమ్మిగ్రేషన్ రూల్స్

**లండన్, జూన్ 15:** కెనడాలో చదువుకుని అక్కడే శాశ్వత నివాసం పొందాలని భావించే వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థులకు మానిటోబా ప్రావిన్స్ ఊహించని షాకిచ్చింది. చదువు పూర్తయ్యాక నేరుగా పర్మినెంట్ రెసిడెన్సీ పొందేందుకు ఉపయోగపడుతున్న కీలక ఇమ్మిగ్రేషన్ మార్గాన్ని రద్దు చేసింది. ఈ నిర్ణయం భారతీయ విద్యార్థులపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కెనడా ప్రభుత్వం విదేశీ విద్యార్థులు, తాత్కాలిక వలసదారుల విషయంలో నిబంధనలు కఠినతరం చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

మానిటోబా ప్రావిన్షియల్ నామినీ ప్రోగ్రామ్ కింద అమల్లో ఉన్న 'కెరీర్ ఎంప్లాయ్‌మెంట్ పాత్‌వే' ను వెంటనే అమల్లోకి వచ్చేలా రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు మానిటోబాలో కనీసం యేడాదిపాటు చదివి, అర్హత కలిగిన ఉద్యోగం సంపాదిస్తే పీఆర్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ముఖ్యంగా డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగించుకునేవారు. ఇప్పుడు ఆ అవకాశం లేకపోవడంతో విద్యార్థులు ఇతర ఇమ్మిగ్రేషన్ మార్గాలను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఇకపై చదువు మాత్రమే సరిపోదని, స్థానిక ఉద్యోగ అనుభవానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని మానిటోబా స్పష్టంచేసింది.

ప్రస్తుతం అమల్లో ఉన్న 'స్కిల్డ్ వర్కర్ ఇన్ మానిటోబా' ప్రోగ్రామ్ కింద కనీసం ఆరు నెలలు ఒకే యజమాని వద్ద పూర్తి స్థాయి ఉద్యోగం చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనుంది. అంటే విద్యార్హతలకంటే ఉద్యోగ అనుభవం, స్థానిక కార్మిక మార్కెట్‌తో అనుసంధానం కీలకంగా మారనున్నాయి. భారతీయ విద్యార్థులపై ఈ నిర్ణయం ప్రత్యేకంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. మానిటోబాలో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది. తక్కువ జీవన వ్యయం, మంచి విద్యాసంస్థలు, సులభమైన పీఆర్ అవకాశాల కారణంగా చాలా మంది ఈ ప్రావిన్స్‌ను ఎంచుకుంటున్నారు. అయితే తాజా నిర్ణయంతో కెనడాలో స్థిరపడాలనుకునే విద్యార్థులు ఇకపై చదువుతోపాటు ఉద్యోగ అనుభవం సంపాదించడంపైనా దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.






# విడాకుల కేసు విచారణకు సిఎం విజయ్ హాజరు

**చెన్నై, జూన్ 15:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆయన భార్య సంగీత స్వర్ణలింగం విడాకులు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం చెంగల్పట్టు మహిళా కోర్టులో విచారణ జరిగింది. కేసు విచారణ నిమిత్తం సిఎం విజయ్ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. భార్య సంగీత కూడా న్యాయస్థానానికి హాజరైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉదయం 10:30 గంటలకు ఇరుపక్షాల వాదనలువిన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేసింది. వాస్తవానికి ఈ కేసు విచారణ ఏప్రిల్ 20నే జరగాల్సి ఉండగా.. వారిద్దరూ హాజరుకాకపోవడంతో జూన్ 15న తప్పనిసరిగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీచేసింది. విజయ్‌కి మరోనటితో వివాహేతర సంబంధం ఉందని ఆరోపిస్తూ సంగీత ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ విడాకుల పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## బీహార్ మంత్రికి సుప్రీం నోటీసులు

**పాట్నా, జూన్ 15:** బీహార్ యువమంత్రిగా గుర్తింపు పొందిన దీపక్ ప్రకాష్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎమ్) పార్టీ అధినేత ఉపేంద్ర కుష్వాహ తనయుడు దీపక్ ప్రకాష్ బీహార్ ఎన్‌డియే ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయనకు శాసన సభ, మండలిలో ఎలాంటి సభ్యత్వం లేకుండానే ఆరు నెలలకుపైగా మంత్రి పదవిలో కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో ఆయన పదవిలో కొనసాగడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. దీపక్ ప్రకాష్ అసెంబ్లీ లేదా శాసన మండలిలో ఎలాంటి సభ్యత్వం లేదు. అటు ఎమ్మెల్యే, ఇటు ఎమ్మెల్సీ.. రెండూ కాదు. రాజ్యాంగం ప్రకారం చట్టసభల్లో ఏ సభ్యత్వం లేకుండా రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టడం కుదరదు.

# భార్యను గొలుసులతో బంధించిన భర్త

## తప్పించుకుని 6 కిలోమీటర్లు పరుగు
## పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు, భర్త అరెస్టు
## బాధితురాలు ఆస్పత్రికి తరలింపు



**భోపాల్, జూన్ 15:** సభ్య సమాజం తలదించుకునే ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరగడం పరిపాటి. అయితే, రాజ్‌గఢ్ జిల్లాలోని ఓదుండగుడు ఏపని చేయకుండా నిత్యం మద్యం సేవించి భార్యను హింసిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే జూన్ 10న తన్వర్ మద్యంసేవించి ఇంటికొచ్చి భార్య మంగిబాయిపై చిందులేశాడు. కర్ర తీసుకుని చితకబాదాడు. అంతటితో ఆగకుండా భార్య మెడకు గొలుసులు వేసి ఇంట్లో బంధించాడు. ఆపై ఓ ఇనుపచువ్వను తీసుకుని పొయ్యిలో కాల్చి ఆమెకు వాతలు పెట్టాడు. ఆ హింసను భరిస్తూనే ఉంది. ఇంతలో భర్త బయటకు వెళ్లాడు. ఇదే అదనుగా మంగిబాయి భావించి సమీపంలో పడి ఉన్న రాయితో స్తంభానికి కట్టేసిన గొలుసును అతి కష్టం మీద పగులకొట్టింది. మెడలో ఉన్న సంకెళ్లతో ఇంటి నుంచి బయటపడింది. రాత్రి వేళ సుమారు ఆరు కిలోమీటర్ల దూరం నడిచి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నది. మెడలో గొలుసులతో బంధించిన ఆమెను చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఆ మహిళ ఏడుస్తూ జరిగిన విషయం చెప్పింది. దీంతో పోలీసులు ఆమె గొలుసులను తొలగించి చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ గ్రామానికి పోలీసులను పంపి మంగిబాయి భర్తను అరెస్ట్ చేశారు.

# ఇజ్రాయెల్‌తో ఒప్పందంపై నిరసన

## స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ విద్యార్థుల వాకౌట్



**వాషింగ్టన్, జూన్ 15:** స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆల్ఫబెట్ సిఇఒ సుందర్ పిచాయ్ తాజాగా విద్యార్థుల నిరసనను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నెల 14న స్నాతకోత్సవానికి హాజరైన సుందర్ పిచాయ్ ప్రసంగిస్తుండగా స్టూడెంట్స్ అక్కడి నుంచి లేచి వెళ్లిపోయారు. ఇజ్రాయెల్‌తో గూగుల్ కుదుర్చుకున్న ఒప్పందానికి నిరసనగా విద్యార్థులు వాకౌట్ చేసినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ ప్రభుత్వం, మిలిటరీతో గూగుల్, అమెజాన్ సంస్థ ప్రాజెక్టు నింబస్ పేరిట ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం, ఇజ్రాయెల్ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, మిలిటరీ డిజిటల్ వసతులను గూగుల్, అమెజాన్‌లు నిర్వహించే స్థానిక క్లౌడ్ నెట్‌వర్క్‌కు బదలీ చేయనున్నారు. అయితే, గాజాలో మిలిటరీ ఆపరేషన్స్‌కోసం ఇజ్రాయెల్ ఎఐ టూల్స్‌ను వాడుతోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలో సుమారు 100 మంది విద్యార్థులు సిఇఒ సుందర్ పిచాయ్ ప్రసంగం సందర్భంగా వాకౌట్ చేశారు. పాలస్తీనాకు స్వేచ్ఛ కల్పించాలని నినాదాలు చేస్తూ వెళ్లిపోయారు. సుందర్ పిచాయ్ తన ప్రసంగంలో ఎఐ ప్రస్తావన తేకపోయినా విద్యార్థుల నిరసనలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎఐతో ఉపాధి అవకాశాలు తగ్గుతాయని అమెరికన్ వర్సిటీల్లో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా అనేక యూనివర్సిటీల్లో టెక్ సంస్థల అధిపతులు, సిఇఒలు విద్యార్థుల నిరసనను ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే, విద్యార్థులు ఆశావహ దృక్పథంతో ఉండాలని సుందర్ పిచాయ్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ కార్యక్రమంలో సూచించారు. 'రోజూ వార్తలను చూస్తే పరిస్థితులు అనుకూలంగా లేవని, మునుపెన్నడూ లేని సవాళ్లు ఎదురవుతున్నాయని మనకు అనిపించవచ్చు. నాకు ఇలా అనిపించినప్పుడల్లా ప్రతి తరం ఏదో ఒక కొత్త సమస్యను ఎదుర్కొందన్న విషయాన్ని గుర్తు చేసుకుంటాను. మన చుట్టూ ప్రపంచం ఎలా ఉందనే అంశం మన చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ పరిస్థితులను మనం ఎలా చూస్తున్నామనే దాన్ని బట్టి ప్రయోజనాలు కలుగుతాయి' అని సుందర్ పిచాయ్ విద్యార్థులకు సూచించారు.

# సంక్షిప్త వార్తలు

## 21న కోల్‌కతాలో ప్రధాని మోడీ యోగా



**న్యూఢిల్లీ, జూన్ 15:** అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల సందర్భంగా ఈ నెల 21న కోల్‌కతాలోని చారిత్రాత్మక రెడ్ రోడ్‌లో జరుగనున్న వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరు కానున్నారు. కోల్‌కతాలో నిర్వహించే వేడుకలకు ప్రధాని మోడీ నాయకత్వం వహిస్తారని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ యేడాది యోగా దినోత్సవం కోసం 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే థీమ్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా విదేశాల్లోని 210 భారతీయ మిషన్ల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా సుమారు 2500 ప్రాంతాలలో యోగా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

## కాక్రోచ్ పార్టీ ఫౌండర్‌పై దాడి

**జైపూర్, జూన్ 15:** రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజీత్ దీప్కేపై కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. నీట్, సిబిఎస్ఇ పేపర్ లీకేజీలు, పరీక్షల అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెంటనే రాజీనామా చేయాలని అమరవీరుల స్మారకం వద్ద ఆయన శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా ఈ ఘటన జరిగింది. అభిజీత్‌ను ఒకరు చెంపదెబ్బ కొట్టడంతో ఆగ్రహించిన స్థానికులు ఆ దుండగులను పట్టుకుని అక్కడికక్కడే చితకబాదారు. ఈ ఘటనతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, దీనిపై వీడియోలు వైరల్‌గా మారాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వీర జవాన్‌కు రూ.48 లక్షలు ఆర్థిక సాయం



**చెన్నై, జూన్ 15:** ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో అసాధారణ శౌర్యం ప్రదర్శించిన లాన్స్ నాయక్ ఎ.మీనాక్షి సుందరం కీర్తి చక్ర పురస్కారం అందుకున్నారు. వీర జవాన్ విశిష్ట సేవలకు గుర్తింపుగా తమిళనాడు ప్రభుత్వం ఆయనను ఘనంగా సత్కరించింది. ఇందులో భాగంగా సిఎం విజయ్ ఆయనకు రూ.48 లక్షల నగదు అందజేశారు. స్వయంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా మీనాక్షి సుందరం ఈ చెక్కును అందుకున్నారు. దేశం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వీర జవాన్ ధైర్యసాహసాలను సిఎం విజయ్ ప్రత్యేకంగా కొనియాడారు.

## నీట్ పోర్టల్‌ను హ్యాక్ చేసిన కిలాడీ అరెస్ట్

**పాట్నా, జూన్ 15:** బీహార్‌కు చెందిన 19యేళ్ల యువకుడు అడ్డదారిలో డబ్బు సంపాదించాలని నీట్ పోర్టల్‌లోకి చొరబడ్డాడు. పరీక్ష రాసిన అభ్యర్థుల పాస్‌వర్డ్‌లు, పిన్‌లను చాకచక్యంగా దొంగిలించి, వారి బ్యాంకు ఖాతా వివరాలను మార్చేశాడు. ఇలా సుమారు 150 మంది అభ్యర్థులకు రావాల్సిన రీఫండ్ సొమ్మును తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నాడు. అభ్యర్థుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన అహ్మదాబాద్ పోలీసులు నిందితుడి అక్రమాలను బయటపెట్టారు. ఐపి అడ్రస్ ఆధారంగా నిందితుడు ఎక్కడ ఉన్నాడో పసిగట్టి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## ఇందిరా గాంధీ ఉంటే బిజెపిని నిషేధించేవారు: అశోక్ గెహ్లాట్

**జైపూర్, జూన్ 15:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఈరోజు బతికి ఉంటే బిజెపి వంటి పార్టీని నిషేధించేవారని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చాలా ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన 50యేళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వాతావరణాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. మతపరమైన విద్వేషాలను అధికారంలో ఉన్నవారే ఉద్దేశపూర్వకంగా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల్లో ఒక్క ముస్లిం అభ్యర్థికీ టికెట్ ఇచ్చినా దేశానికి వేరే సందేశం వెళ్లేదన్నారు. అశోక్ గెహ్లాట్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపాయి.

# సంగారెడ్డిలో అరుదైన కీలక ఖనిజ నిక్షేపాలు

## కేంద్ర జియోలాజికల్ సర్వేలో వెల్లడి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అరుదైన కీలక ఖనిజ నిక్షేపాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా అరుదైన ఖనిజనిక్షేపాలు ఉన్నట్టు కేంద్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. జిల్లాలోని మొగుడంపల్లి మండలం రాయిపల్లి తాండ గ్రామ పంచాయతీ పరిధి పర్వతాపూర్ శివారులోని భూముల్లో వెనేడియం, టైటానియం, అల్యూమినస్ లేటరైట్ నిక్షేపాలు ఉన్నట్టు జియోలజికల్ సర్వే విభాగం అధికారులు, నిపుణులు గుర్తించారు. ఈ ఖనిఖ నిక్షేపాలు ఎలక్ట్రిక్ బ్యాటరీలు, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలతో పాటు, ఇంధన నిల్వలకు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. కేంద్రప్రభుత్వ ఆదేశాలమేరకు ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సంబంధిత శాఖాధికారులు, నిపుణులు పలుమార్లు గ్రామాన్ని సందర్శించారు. సర్వే నంబర్ 5 నుంచి 48 వరకు 800 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ, పట్టా భూముల్లో ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఈ భూముల్లో 335.50 హెక్టార్ల విస్తీర్ణంలో 15.25 మిలియన్ టన్నుల వెనేడియం, 87 మిలియన్ టన్నుల అల్యూమినస్ లేటరైట్, టైటానియం నిక్షేపాలు ఉన్నట్టు నిపుణులు గుర్తించారు. జహీరాబాద్ పట్టణానికి అతి సమీపంలో పర్వతాపూర్ బ్లాక్ ఉండటం, రవాణా, రోడ్డు, రైలు మర్గాలు దగ్గరగా ఉండడంతో పెట్టుబడిదారులకు కలిసివచ్చే అవకాశం ఉంటుందని కేంద్రం భావిస్తోంది. ఇటీవల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఖనిజ నిక్షేపాలను వెలికితీయడంతో పాటు ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రోడ్‌షో నిర్వహించారు. ఈ నెల 11న గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన గనుల వేలం పాటలో కేంద్రం ఆధీనంలోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రాధాన్య బిడ్డర్‌గా పాల్గొని గనులను దక్కించుకుంది. కాగా ఖనిజ నిక్షేపాల వెలికితీత, పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రియల్ ఎస్టేట్ పరంగానూ అభివృద్ధి చెందనుంది. ఖనిజ నిక్షేపాలు, నిమ్జ్ ప్రాజెక్టు, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పూర్తయితే జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారుతుందని రాష్ట్ర మైనింగ్ అధికారులు చెబుతున్నారు.



# విదేశీ భాషతో విశ్వసేవకు కొత్తదారులు

## మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** విదేశీ భాషలు, ముఖ్యంగా జర్మన్ భాషను నేర్చుకునే విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతర సాధనతో ముందుకు సాగాలని విదేశీ భాషలపై పట్టు ఉంటేఅంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని విశ్వసేవకోసం మన మానవవనరులకు కొత్తదారులు ఉపయోగపడుతాయనీ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం టామ్‌కామ్ కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జర్మనీలో ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో ఉన్న యువత కోసం టామ్‌కామ్ జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. భారత దేశం లో నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ, జర్మనీలో పనిచేసే వారికి లభించే వేతనాలు మన కరెన్సీ విలువలో ఎంతో అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. "కొత్త భాషను నేర్చుకుని జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగాలు సాధించడం మన యువతకు ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుంది" అని మంత్రి అన్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా మందమర్రిలో ప్రారంభించిన జర్మన్ భాషా తరగతులకు విశేష స్పందన లభించిందని తెలిపారు. "దాదాపు 200 మంది యువత ఈ కోర్సులో చేరడం నాకు ఆనందాన్ని కలిగించింది. అక్కడి అధ్యాపకుడు కూడా ఎంతో ప్రతిభావంతుడిగా కనిపించారనీ చెప్పా రు. విద్యార్థులు సమర్థవంతంగా భాషను నేర్చుకునేలా వారి హాజరును నిరం తరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. విదేశీ ఉపాధి అవకాశాలను పొందడంలో భాషా ప్రావీణ్యమే ప్రధానఅడ్డంకి అని, దానిని అధిగమిం చాల్సిన అవసరం ఉందన్నారు.

# 'ప్రజలతో ముఖాముఖి' రేపటి నుంచి మళ్లీ ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** ప్రజలతో ముఖాముఖి కార్యాక్రమం ఈనెల 17 బుధవారం నుంచి మళ్ళీప్రారంభం అవుతున్నాయి. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చేపట్టిన ఈ వినూత్నమైన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. అలాగే అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉంది. గతంలో ప్రతి బుధవారం గాంధీభవన్‌లో ఒక మంత్రితో ప్రజలకు ముఖాముఖి కార్యక్రమాలు కొనసాగిన విషయం తెలిసిందే. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డ కార్యక్రమం బుధవారం నుంచి తిరిగి ప్రారంభం చేస్తున్నారు.

# నేడు పాలిసెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** పాలీసెట్-2026కి సంబంధించిన ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా నేడు(మంగళవారం) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం, బుధవారం వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపును ఈ నెల 20న చేపట్టనున్నట్టు తెలిపారు. అర్హులైన విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఎక్కువ సంఖ్యలో ఇవ్వాలని సూచించారు.




సదస్సులో ప్రసంగిస్తున్న పరకాల ప్రభాకర్. చిత్రంలో కూనంనేని సాంబశివరావు,ప్రొ. నాగేశ్వర్, మాడభూషి శ్రీధర్

# ప్రజాస్వామ్య స్ఫూర్తికి 'సర్' విరుద్ధం

## బలహీనవర్గాల ఓటు హక్కుకు ముప్పు: పరకాల ప్రభాకర్

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 15, ప్రభాతవార్త:** కేంద్ర ఎన్నికల సం ఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ప్రజా స్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ చెప్పారు. సర్ ద్వారా ప్రభుత్వమే ఓటర్లను ఎంచుకునే పరి స్థితి ఏర్పడబోతున్నదని ఇది ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విరు ద్ధమని స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఐఆర్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. సర్ ప్రక్రియ రాజ్యాంగ విలువలు, నైతికతపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దీని వల్ల బలహీన వర్గాల ఓటు హక్కుకు ముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సర్ పేరిట దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యపై దాడి జరుగుతున్నదని ఆరోపించారు. కేంద్ర సమాచార కమిషన్ మాజీ సభ్యుడు మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాల తయారీ, సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛను వినియోగించి ప్రశ్నించినందుకే తనపైన అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు.

# దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్ల గడువు పొడిగింపు

## 21 వరకు రిజిస్ట్రేషన్లకు 22 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026 మూడవ విడత షెడ్యూల్‌లో రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్లకు గడువును పెంచుతూ దోస్త్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో సీట్ల కేటాయింపు చేపట్టిన దోస్త్ అధికారులు.. మూడవ విడతకు సంబంధించి రిజిస్ట్రేషన్లకు మే 31 ఈ నెల 16 వరకు రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించగా.. వాటి గడువును పొడిగిస్తున్నట్టు దోస్త్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు గడువును పొడిగించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. మూడవ విడత దరఖాస్తు గడువు రూ. 400తో ఈ నెల 21 వరకు పొడిగించినట్టు తెలిపారు. అలాగే వెబ్ ఆప్షన్లను ఈ నెల 22 వరకు పొడిగించినట్టు తెలిపారు. ఈ నెల 25న సీట్ల కేటాయింపు చేయనున్నట్టు ప్రకటనలో తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 26 నుంచి జులై 2 వరకు అవకాశం కల్పించారు. మూడు ఫేజ్‌ల్లో సీట్లు పొందిన విద్యార్థులందరూ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన వారు ఈ నెల 27 నుంచి జులై 4 వరకు కాలేజీల్లో నేరుగా చేరాలని సూచించారు.

# వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

## తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాలని తెలంగాణ యున్నైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్ణయించింది. యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం సోమవారం హైదరాబాదులోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. స్టేట్ జనరల్ బాడీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్ అధ్యక్షతన జరిగింది. జనరల్ బాడీ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు హాజరయ్యారైనట్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద నాయక్ తెలిపారు. జనరల్ బాడీలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ... రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడానికి వైద్య ఆరోగ్య రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసి ఉద్యోగుల మీద పని ఒత్తిడి తగ్గించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ యధావిధిగా రెగ్యులర్ చేయాలని, 104 ఉద్యోగులకు రావలసిన 15 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు.

# ఎన్ఐపిఇఆర్‌లకు ఐదేళ్ల కాలపరిమితితో రిజిస్ట్రార్లను నియమించండి

## ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** దేశంలోని ఔషధ విద్య, పరిశోధన రంగాల్లో ఎన్ఐపిఇఆర్‌లు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఆ సంస్థకు ఐదు సంవత్సరాల పదవీకాలంతో రెగ్యులర్ రిజిస్ట్రార్లను నియమించాలని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఎన్ఐపిఇఆర్ కౌన్సిల్ 3వ సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొని పలు కీలక అంశాలను ప్రస్తావించారు. హైదరాబాద్ ఎన్ఐపిఇఆర్‌లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ కొనసాగడం సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని అన్నారు. పరిపాలనా ఖాళీలను వెంటనే భర్తీ చేసి, విద్యార్థుల ప్లేస్‌మెంట్ అవకాశాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గవర్నింగ్ బోర్డుల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అవి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం చట్టబద్ధమేనా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని, కొత్త బోర్డుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కౌన్సిల్‌ను కోరారు. బయో శక్తి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన జాతీయ బయోఅవైలబిలిటీ కేంద్రాల పనితీరు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వాటి ఫలితాలపై వివరాలు వెల్లడించాలని కోరారు.

# మొదటిరోజు ఇ-సెట్ కౌన్సెలింగ్‌లో 3,233 మంది దరఖాస్తు

## 18 వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఈ సెట్-2026 కౌన్సెలింగ్‌కి మొదటి రోజు 3233 మంది దరఖాస్తు చేసుకున్నారు. రిజిస్టర్ చేసుకొని స్లాట్‌బుక్ చేసుకోవడానికి ఈ నెల 18 వరకు అవకాశం కల్పించినట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, ఈ సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను రేపటి(బుధవారం) నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 24న మొదటి విడత సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్టు కమిషనర్ ప్రకటనలో తెలిపారు.



# తెలంగాణకు సమ్మిళిత, పర్యావరణ అభివృద్ధి పురస్కారం

## కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణకు ప్రతిష్టాత్మక సమ్మిళిత సంస్థ, పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి పురస్కారం లభించింది. 'పవన శక్తి ఆశయం నుండి వేగవంతం వరకు' అనే అంశంపై గోవాలోని సోమవారం నిర్వహించిన గ్లోబల్ విండ్ డే-2026 జాతీయ సదస్సులో తెలంగాణ పాల్గొంది. ప్రాముఖ్యత గల జాతీయ కార్యక్రమంలో, కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చేతుల మీదుగా రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీ రెడ్కో వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వి. అనిల ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానాన్ని గుర్తించిన కేంద్రం తెలంగాణ ప్రభుత్వానికి ఈ సమ్మిళిత సంస్థ, పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి పురస్కారం ప్రదానం చేయబడిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ (ఎన్ఐడబ్ల్యూఎ) అంచనాల ప్రకారం, తెలంగాణలో 100 మీటర్ల హబ్ ఎత్తులో 4,240 మెగావాట్లు, 120 మీటర్ల ఎత్తులో 24,835 మెగావాట్లు, మరియు 150 మీటర్ల హబ్ ఎత్తులో 54,717 మెగావాట్ల గణనీయమైన, ఇంకా వినియోగించని పవన విద్యుత్ సామర్థ్యం ఉందన్నారు. పూర్వపు నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యాప్తంగా అధిక పవన సాంద్రత గల ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు.

# రాష్ట్రంలో బాల్య వివాహాలకు చెక్

## స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం

## మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణలకు చెక్ పెట్టి వాటిని అరికట్టేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ దిశగా బాలికల సాధికారత, బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా నిరోధం వంటి అంశాల్లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో సోమవారం మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి అనసూయ మాట్లాడుతూ బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది బాలికల భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం, ఆర్థిక స్వావలంబన దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. బాల్య వివాహం బతుకు ఆగం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల నివారణకు ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఇప్పుడు స్వ సంస్థ సహకారంతో చ్ఛంద సంస్థతో ఒప్పందం ద్వారా ఈ ప్రయత్నాలను మరింత విస్తృత స్థాయిలో తీసుకెళ్తామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలికలకు వారి హక్కులు, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచార కార్యక్రమాల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలు, మైనర్ గర్భధారణల ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునే వాతావరణం కల్పించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఒఝా, స్వచ్ఛంద సంస్థకు చెందిన మమతా రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నార్థకంగా చేపపిల్లల పంపిణీ

## బకాయిలు చెల్లిస్తేనే టెండర్లు

## ముందుకురాని కాంట్రాక్టర్లు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చే ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ప్రశ్నార్థకంగా మారింది. చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఫిష్ సీడ్ ఫార్మర్ల (కాంట్రాక్టర్లు)కు ప్రభుత్వం రెండేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో, వారు ఈసారి టెండర్లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలియవచ్చింది. చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జిల్లాల వారీగా టెండర్లను నిర్వహిస్తోంది. టెండరు దక్కించుకున్న ఫిష్ సీడ్ ఫార్మర్లు ఆయా జిల్లాల్లో చేప పిల్లలను ఉచితంగా చెరువుల్లో వదలాల్సి ఉంటుంది. తర్వాత ప్రభుత్వం వారికి అందుకయ్యే నిధులను విడుదల చేస్తుంది. రాష్ట్రంలో 6 సంవత్సరాలుగా చేప పిల్లల పంపిణీ పథకం నడిచింది. ప్రభుత్వం 90 కోట్ల మేర చేప పిల్లలను కొనుగోలు చేసి నీటి వనరుల్లో వేయిస్తోంది. గతంలో ఏటా ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి, మే లో ఆప్రక్రియను పూర్తి చేసి జూలై నెలలో పంపిణీ చేసేవారు. కానీ, ఈసారి జూలై నెల దగ్గర పడుతున్నప్పటికీ టెండర్లకు సంబంధించిన, పెండింగ్ బిల్లులకు సంబంధించిన అంశంపై మత్స్య శాఖ అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఫిష్ సీడ్ ఫార్మర్లకు రూ.128 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పెండింగ్ బకాయిలు చెల్లిస్తేనే టెండర్లలో పాల్గొంటామని కాంట్రాక్టర్లు పట్టుదలతో ఉన్నట్లు సమాచారం. 2023 ఏడాదికి సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు 2024 ఏడాదిలో టెండర్లకు దూరంగా ఉంటామని ప్రకటించారు. అప్పులు మత్స్య శాఖ అధికారులు వారితో చర్చలు జరిపి మూడు నెలల్లో పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో బిల్లులను చెల్లించలేదు. దీంతో 2024-25 సంవత్సరంలో రూ.34.32 కోట్లతో 29.25 కోట్ల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేశారు. అయితే కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో ఈసారి మాత్రం టెండర్లలో పాల్గొనేది లేదని కాంట్రాక్టర్లు అంటున్నారు. దీంతో, ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం అసలు అమలు జరుగుతుందా లేదా అనేదానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# సామాజిక న్యాయంతోనే సమగ్ర అభివృద్ధి

## ఇందిరమ్మ కృషిని గుర్తుచేస్తూ

## త్వరలో ఆదివాసీ కాంగ్రెస్ బస్‌యాత్ర

## గాంధీభవన్‌లో పిసిసి ఆదివాసీ కాంగ్రెస్ సమావేశం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** అణగారిన వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించడంతోపాటు అన్ని రంగాల్లో సమాన అవకాశాల కల్పి స్తూ సామాజిక న్యాయంతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతోందని ఇందిరాగాంధీ ఆశయాలే కాంగ్రెస్ సిద్ధాంతమనీ ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలనీ గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా చేపట్టనున్న బస్ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకుటిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీభవన్ లోని ఇందిరాభవన్‌లో ఆదివాసి కాంగ్రెస్ సమావేశం ఆదివాసి కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో ఎంత మంది అణగారిన వర్గాలు ఉన్నారో అంతమందికి సమాన అవకాశాలు కల్పించాలని కేవలం ఒక వర్గం ప్రాంతం చేతిలో వనరులు అధికారాలు ఉండి ఇతరులకు అన్యాయం జరగకూడదనేది కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అని అన్నారు. బిసి, ఎస్‌సి గిరిజనులు, మైనార్టీలు, చివరకు అగ్రవర్ణ పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా కట్టుబడి ఉందని ఆయన వివరించారు. తాను పెరిగిన గ్రామంలో 85 శాతం మంది లంబాడీలు ఉండేవారని, వారి జీవన పరిస్థితులను చిన్నప్పటి నుంచే దగ్గరగా గమనించే అవకాశం తనకు లభించిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 1976లో లంబాడీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసిన ఇందిరాగాంధీ, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంలో ఇందిరాగాంధీ ఎప్పుడూ ముందుండేవారని, గిరిజనుల వెనుకబాటుతనాన్ని గుర్తించి వారికి ఎస్‌టి రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి అభ్యున్నతికి బాటలు వేసిందని అన్నారు. నేడు గిరిజన సమాజం సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో ఎదగడానికి ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణమనీ అభిప్రాయ పడ్డారు. సకల జనుల సంక్షేమమమే కాంగ్రెస్ పార్టీ విధానం అని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ కుల గణన చేసి ఆయా వర్గాలకు అన్నివనరులపై అవకాశాలు కల్పించాలని ఆశిస్తున్నారనీ దానికి అనుగుణంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన నిర్వహించారని తెలిపారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలే కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలని, పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడమే విమర్శలు చేసే వారికి సరైన సమాధా నమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ఈ యాత్ర నిర్వహించి కాంగ్రెస్ పార్టీ గిరిజన సంక్షేమానికి చేసిన సేవలను ప్రజలకు వివరించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు.

# వయోవృద్ధులను కాపాడుకుందాం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న కెవి రమణాచారి, రామచంద్రయ్య, శోభా పేరిందేవి, హైమావతిభీమన్న తదితరులు

**మానవత్వం లేని జీవితం వృధా : డా. కె.వి.రమణాచారి**

**సందేశాత్మకంగా ప్రపంచ వృద్ధుల వేధింపుల వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సు**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూన్ 15, ప్రభాతవార్త** : మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అన్న వేదవాక్యాలని పిల్లలకు చిన్నప్పటి నుండి బోధించినా, ఎన్ని విద్యాలయాలు వెలిసినా అత్యాధునిక ప్రపంచమంటూ విద్య విజ్ఞానం ఎంత పెరిగినా మనుషుల్లో మానవత విలువలు కుంచించుకుపోయాయనీ, తల్లిదండ్రులు, వయోవృద్ధుల పట్ల ఎంతో నీచంగా వ్యవహారిస్తూ వేధించడం విషమ సంస్కృతి, దీనినుండి బయటపడని మానవత్వం లేని మనిషి జీవితం వృధా. మనిషే కాదని, నేటి యువతను మేల్కొల్పడానికి సదస్సును ఏర్పాటు చేయడం ముదావహమని విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశయాలు, ఆశలతో పిల్లల్ని కష్టనష్టాలకోర్చి పెంచిపెద్దచేసి ప్రయోజకులను చేస్తే వారిని రకరకాల వేధింపులకు గురిచేయడం దుర్మార్గమని తీవ్ర ఆవేదన వ్యక్తిపరిచారు. నిరాదరణకు గురయ్యే వృద్ధులను ఆదుకోవడానికి తనవంతు బాధ్యతగా ఆనంద నిలయం వృద్ధాశ్రమం ప్రారంభిం చినట్లు, వృద్ధుల వెతలకు సాక్ష్యంగా వారి తలగడలు తడిసిపోవడం నిదర్శనమని, వారిలో మానసిక వికాసాన్ని, ఆనందాన్ని రేకెత్తించ దానికి అనేక విధాలు కృషిచేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సీనియర్ సిటిజెన్స్ కాన్ఫెడరేసన్ టెస్కాన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్ర భారతిలో జరిగిన ప్రపంచ వృద్ధుల వేధింపుల వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసి డా. కె.వి.రమణాచారి ప్రసంగించారు. పిల్లలు తమ తల్లిదండ్రులను తమ వద్దకు పిలిపించుకుంటున్నారంటే వారు ఉత్సాహం సంతోషకరంగా వెళ్లే పరిస్థితి నుండి వారిని ఇంటికి, పిల్లలకి కాపలాదారులుగానే, ఆయాగానో, సకల సేవకులుగానో ఉపయోగించుకుంటున్న స్థితి గర్హనీయమన్నారు. ఇలాంటి అవాంఛనీయ స్థితి నుండి వృద్ధులను కాపాడుకోవాలని, ఈమంది ఆశయంతో సదస్సును నిర్వహించిన టెస్కాన్ నిర్వా హకులకు రమణాచారి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో మనోహర్‌లాల్ బహరానీ, న్యాయవాది రాజేష్, సంస్థ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, హైమవతి భీమన్న, సత్య నారాయణ, విశ్వనాథం, దయానందుదు, డా. గురజాడ శోభా పేరిందేవి, దేశ్‌పాండే తదితర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

## 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

### విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 15:** వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తూ రాబోయే 3 నుంచి 4 రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరించే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం మంత్రి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అప్రమత్తం చేస్తూ అధికారులతో సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించిన, ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర దిశవైపు కొనసాగుతోందన్నారు.

## భారత్ సైన్యం చేతికి హైదరాబాద్ టెక్నాలజీ

### రంగంలోకి 41 జెఆ-250ఈ డ్రోన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్15:** భారత రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తూ, మేక్ ఇన్ ఇండియాలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ ఏరోస్పేస్ సంస్థ సరికొత్త రికార్డు సృష్టించింది. భారతీయ రక్షణ రంగానికి స్వదేశీ సాంకేతిక అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్న ఈ సంస్థ తాజాగా భారత సైన్యానికి 41 జెఆ 250ఈ డ్రోన్లను అందజేసింది. మొత్తం రూ.72 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో మొదటి బ్యాచ్ డ్రోన్లను నాసిక్‌లో ఉన్న సదరన్ కమాండ్ అధికారులు అందజేసిన ఈ సంస్థ.. మిగిలిన డ్రోన్లను ఆగస్టు నాటికి పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకుంది. ఈ సంస్థ తొలి విడతలో విజయవంతంగా డ్రోన్లను అందించడం.. సంస్థ అభివృద్ధికే కాకుండా దేశీయ రక్షణ తయారీ రంగంలో కూడా ఒక కీలక మైలురాయిగా నిలిచింది. మాదాపూర్ కేంద్రంగా విజయవంతంగా పనిచేస్తున్న డ్రోన్ డ్రోస్ సంస్థ, ఐఐటీ తన పేరును డ్రోన్ ఏరోస్పేస్‌గా మార్చుకుంది. కేవలం డ్రోన్ల తయారీకే పరిమితం కాకుండా.. విమానాలు, ఉపగ్రహాలు, డ్రోన్లు, అంతరిక్ష నౌకల రూపకల్పన, తయారీ నిర్వహణకు తోడ్పడే సాంకేతిక, పారిశ్రామిక, పరిశోధనా కేంద్రంగా ఈ సంస్థ అభివృద్ధి చెందింది. రక్షణ, నిఘా, తదుపరి తరం మానవరహిత వైమానిక వ్యవస్థల అభివృద్ధిపై సంస్థ ప్రస్తుతం ప్రత్యేక దృష్టి సారించింది. డ్రోన్ ఏరోస్పేస్ తయారు చేసిన ఈ ఆధునిక డ్రోన్లు ఒకసారి ఛార్జింగ్ చేస్తే మూడు గంటల పాటు నిరంతరాయంగా ఆకాశంలో ఎగురుతాయి. ఇవి సరిహద్దుల్లో నిఘాకు, ఇతర వ్యూహాత్మక సైనిక అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి జిల్లాలో జరిగిన రక్షణ ఉత్పత్తుల కేంద్రం, డ్రోన్ సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో డ్రోన్ ఏరోస్పేస్ తన ఉత్పత్తులను ప్రదర్శించింది. వీటిని పరిశీలించిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ సీఎం చంద్రబాబు సంస్థ ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జెఏసి చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ గోపినాథన్ తదితరులు

## ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

### కార్పొరేట్ విద్యా నియంత్రణ జెఏసి

**హైదరాబాద్, జూన్ 15,ప్రభాతవార్త:** ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం ఏర్పాటు చేసి కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఫీజులను అరికట్టాలని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిన ఫీజుల దోపిడీని అరికట్టి, అధికారికంగా గుర్తించబడిన పేద కుటుంబాల పిల్లల ఫీజులను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేస్తున్న టీచింగ్ ,నాన్ టీచింగ్ ఉద్యోగుల వేతనాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి క్రమబద్ధీకరణ చేయాలన్నారు. అక్రమ డొనేషన్లపై ప్రభుత్వం ఎందుకు కట్టడి చేయడం లేదు? లక్షలాది తల్లిదండ్రులు అప్పుల ఊబిలో... కార్పొరేట్ విద్యాసంస్థలు కోట్ల లాభాల్లో... ప్రభుత్వం ఎవరికి అండగా నిలుస్తోంది? లక్షలాది తల్లిదండ్రులు అప్పుల ఊబిలో... కార్పొరేట్ విద్యాసంస్థలు కోట్ల లాభాల్లో... ప్రభుత్వం ఎవరికి అండగా నిలుస్తోంది? ప్రజల పక్షమా? కార్పొరేట్ విద్యా వ్యాపారుల పక్షమా? తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయం వద్ద నిరుద్యోగుల ఆందోళన

### ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా పోలీసు శాఖలో 20 వేల కానిస్టేబుల్, ఎస్సై పోస్టుల భర్తీ చేపట్టాలని కోరుతూ సోమవారం రాత్రి చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు మెరుపు ధర్నా నిర్వహించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అభ్యర్థులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఐదు వేల పోస్టులు కాదు.. 20 వేల పోస్టులు కావాలి , వి వాంట్ జస్టిస్ అంటూ నినాదాలతో లైబ్రరీ ప్రాంగణం మార్మోగింది.రాష్ట్రవ్యాప్తంగా 20 వేల కానిస్టేబుల్, ఎస్సై పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి, జీవో 46ను వెంటనే రద్దు చేయాలి, పోలీసు ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల వయోపరిమితిని పెంపు (కానిస్టేబుల్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఎస్సై అభ్యర్థులకు 33 ఏళ్లు) చేయాలంటూ డిమాండ్ చేశారు.

# తెరుచుకున్న హార్ముజ్

### అమెరికా, ఇరాన్ మధ్య ప్రాథమిక ఒప్పందంతో జలసంధిని దాటిన తొలి భారత్ నౌక 'దిశ'

### 19న గుజరాత్‌లోని దహేజ్ పోర్టుకు చేరుకుంటుందని అంచనా





**న్యూఢిల్లీ, జూన్ 15:** అమెరికా, ఇరాన్‌ల మధ్య ప్రాథమిక ఒప్పందం కుదిరినట్లు ప్రకటించిన నేపథ్యంలో, భారతదేశానికి చెందిన పెట్రోనెట్ ఎల్ఎన్‌జి సంస్థ అద్దెకు తీసుకున్న ఒక ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జి) ట్యాంకర్, హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించిన తొలి వాణిజ్య నౌకలలో ఒకటిగా నిలిచింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ ఎగుమతి టెర్మినల్ వద్ద లోడ్ చేసుకున్న ఎల్ఎన్‌జిని తీసుకువెళ్తున్న మాల్టా జెండా గల 'దిశా' అనే ట్యాంకర్, సోమవారం ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని దాటి గుజరాత్‌లోని దహేజ్ పోర్టుకు బయలుదేరింది. షిప్‌ట్రాకింగ్ డేటా ప్రకారం, ఈ నౌక జూన్ 19, శుక్రవారం నాడు చేరుకుంటుందని అంచనా. మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంఘర్షణల కారణంగా నెలల తరబడి అంతరాయం ఏర్పడిన తర్వాత, సముద్ర రవాణా క్రమంగా సాధారణ స్థితికి రాగలదనడానికి ఈ ప్రయాణం ఒక తొలి సూచనగా నిలుస్తోంది. సముద్ర ట్రాకింగ్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి అందిన డేటా ప్రకారం, అమెరికా-ఇరాన్ ఘర్షణల కారణంగా మార్చి 2 నుంచి ఈ నౌక రాస్ లఫాన్‌లోనే నిలిచిపోయింది. అయితే శాంతి ఒప్పందం అనంతరం మళ్లీ ప్రయాణం ప్రారంభించినట్లు మెరైన్ ట్రాఫిక్ డేటా వెల్లడించింది. 277 మీటర్ల పొడవు, 44 మీటర్ల వెడల్పు ఉన్న ఆ నౌక మూడు నెలలకు పైగా పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయింది. బ్లూమ్‌బెర్గ్ సేకరించిన షిప్‌ట్రాకింగ్ సమాచారం ప్రకారం, మార్చి 1న ఈ ట్యాంకర్ ఎల్ఎన్‌జి సరుకును లోడ్ చేసుకుని బయలుదేరేందుకు సిద్ధమైంది. కానీ యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రయాణం నిలిచిపోయింది. ఇప్పుడు ఒప్పందం కుదరడంతో హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే తొలి ట్యాంకర్‌గా 'దిశా' గుర్తింపు పొందుతోంది. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటన తర్వాత హోర్ముజ్ జలసంధిని దాటనున్న తొలి పెద్ద ట్యాంకర్‌గా 'దిశా' నిలిచింది. ఈ నౌక జలసంధిలో ప్రయాణిస్తున్నప్పుడు తన ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఎఐఎస్)ను యాక్టివ్‌గా ఉంచినట్లు సమాచారం. ఈ మార్గం ద్వారా వాణిజ్య కార్యకలాపాలను సురక్షితంగా పునఃప్రారంభించవచ్చా లేదా అని అంచనా వేస్తున్నందున, షిప్పింగ్ కంపెనీలు, బీమా సంస్థలు, వస్తు వ్యాపారులు దీని ప్రయాణాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

# బిజెపి పలికించేవారు.. పలికెడు వారు పవన్

### బిజెపి నేతలు ఆడించే తోలుబొమ్మ పవన్‌కల్యాణ్

### తెలంగాణను తూలనాడినా కెసిఆర్, కెటిఆర్ మౌనం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 15,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును నిందిస్తూ పలికించేది బిజెపి నేతలైతే పలికెడివారు పవన్ అని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో మహేశ్ కుమార్ గౌడ్ సోమవారం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పదే పదే తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరిచే మాటలు మాట్లాడుతున్నారనీ ఆవేదన చెందారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నంను కాంగ్రెస్ సాకారం చేసిందనీ గుర్తుచేశారు.తెలంగాణ ఆవిర్భావాన్ని పవన్ కించపరచడం కొత్తేమీ కాదనీ మోదీ,బిజెపి నేతలు కించపరుస్తున్నారు అదే బాటలో ఆయన వారి మెప్పుకోసం తక్కువ చేసి మాట్లాడుతున్నారనీ అన్నారు. బిజెపి ఆడించే తోలుబొమ్మ పవన్ కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. వాస్తవ ప్రపంచంలో ఉన్నావ్ ఇదేమీ సినిమా కాదు విచ్చలవిడిగా మాట్లాడటానికి ఎంతో మంది అమరులైతే, సోనియమ్మ తెలంగాణ ఇచ్చిందనీ ఆయన అన్నారు.తెలంగాణ ప్రజలు చూడనిదే నీ సినిమాలు ఇక్కడ నడిచాయా? ఇంత పెద్ద హీరోవు అయ్యావా.? అని ప్రశ్నించారు.విభజనకు వ్యతిరేకంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నాడనీ,తెలంగాణ ఉద్యమంలో పవన్ కళ్యాణ్ ఏ సినిమాల్లో ఉన్నాడని ప్రశ్నించారు.రాజకీయాల్లో పవన్ చాలా నేర్చుకోవాలనీ కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత పవన్ కి లేదనీ చాలా చిన్నవాడనీ అన్నారు.బిజెపి,పవన్ లోపాయికారి ఒప్పందంతో విభజన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారనీ అన్నారు.రెండు రాష్ట్రాలు వేరైన అన్నదమ్ములుగా కలిసి ఉందామనీ కోరుకున్నారని తెలిపారు. తెలంగాణ లో రాజకీయాల కోసం మమ్మల్ని అంటే ఊరుకోను అని హెచ్చరించారుఅభివృద్ధి,సంక్షేమంలో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తుందనీ అన్నారు.పవన్ తెలంగాణను తులనాడినా కెసిఆర్,కెటిఆర్,బిఆర్ఎస్ నాయకులు ఎవ్వరు మాట్లాడటం లేదనీ వారి వెనుక ఒప్పందం అర్థం అవుతుందనీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎంగా ఆరాష్ట్రంలో మీరు అణగారినవర్గాల అభివృద్ధికి చెయ్యాల్సింది ఉంది..రాజకీయాల్లో ఇంకా నువ్వు నేర్చుకోవాల్సింది చాలా ఉందనీ హితవు చెప్పారు.అధికారం ఉందనీ,తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే సరికాదు ఇలానే మాట్లాడితే ఊరుకోం అని హెచ్చరించారు.రెచ్చగొట్టే వ్యాఖ్యాలు సరికాదని హితవు చెప్పారు. కాంగ్రెస్ గురించి శ్రద్ధగా చరిత్రలు చదువుకుంటే మంచిదని తెలిపారు నెహ్రూ,గాంధీ కుటుంబం త్యాగం గురించి తెలుసుకో,కాంగ్రెస్ ను అనాలంటే సినిమాల్లో డైలాగ్ చెప్పినట్టు కాదుఅని సలహా ఇచ్చారు. మీ నాయకుడు మోదీ రాకెట్ ముందు ఫొటోలు దిగుతున్నార కదా అదీ కాంగ్రెస్ ఘనతనే అని వివరించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### మందులకు ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలి

### అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశం



**హైదరాబాద్, జూన్ 15,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ, ప్రభుత్వ హాస్పిటల్ల సంసిద్ధత, ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి దామోదర్ రాజనర్సింహా సోమవారం హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, డయేరియా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధుల ప్రస్తుత పరిస్థితి, జిల్లాల వారీ కేసులు, ప్రభుత్వ హాస్పిటల్ల సంసిద్ధత, మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, దోమల నివారణ చర్యలు, ఫీవర్ సర్వేలు, ప్రజల్లో అవగాహన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవింద్ర నాయక్ మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతన్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స అందించడం కంటే అవి వ్యాపించకుండా ముందుగానే అరికట్టడం ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రతి జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ హాస్పిటల్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని, మెడిసిన్, రోగ నిర్ధారక కిట్లు, ఓఆర్ఎస్, ప్లేట్‌లెట్లు, వైద్య సిబ్బంది, అత్యవసర సేవల్లో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణ జ్వరం, డెంగ్యూ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలతో వచ్చే ప్రతి వ్యక్తికి ఆలస్యం లేకుండా పరీక్షలు నిర్వహించి తక్షణ చికిత్స అందించాలని మంత్రి ఆదేశించారు.

మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని, ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, ప్రత్యేక ఫీవర్ సర్వేలు నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లు, నిర్మాణ ప్రాంతాలు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు పూర్తిస్థాయిలో పనిచేస్తూ, ఎక్కడైనా వ్యాధుల క్లస్టర్లు ఏర్పడితే, వాటిని గుర్తించి వెంటనే స్పందించి వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సంబంధించిన వివరాలతో వీక్లీ రిపోర్ట్‌లు తయారు చేసి, ప్రభుత్వానికి సమర్పించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్‌ను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అత్యంత అప్రమత్తంగా పర్యవేక్షిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం, జ్వరం ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ హాస్పిటల్‌ను సంప్రదించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా విజ్ఞప్తి చేశారు.

# ఎక్కడాలేని విధంగా పంటల కొనుగోలు

### కొనుగోలులో కేంద్రం తీరు ఆక్షేపణీయం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** దేశంలోనే ఎక్కడా లేని విధంగా అన్ని పంటలు కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.కానీ తెలంగాణ రైతాంగం పట్ల కేంద్రం తీరు సమంజసంగా లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం తన బాధ్యత వదిలివేసి రాష్ట్రాలపై భారం మోపడం సమంజసం కాదన్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతుకి పంటలు కొనుగోలు చేస్తే రాష్ట్రంపై భారం మోపడం ఏమనాలని ప్రశ్నించారు. రాష్ట్రం కొనుగోలు చేసిన 15 లక్షల టన్నుల మొక్కజొన్నలు, 2 లక్షల టన్నుల జొన్నలు కేంద్రం తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. పొద్దు తిరుగుడు కొనుగోలు పరిమితులు లేకుండా కేంద్రం కొనుగోలు చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఎగుమతులు, దిగుమలపై అధికారం ఉన్న కేంద్రం వివక్ష లేకుండా తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన పంటలను పరిమితులు లేకుండా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం బాధ్యతాయుతంగా వేర్ హౌస్ గోడౌన్స్ కొత్తవి నిర్మాణం చేయాలన్నారు. పంటల మార్పిడి ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుందనీ తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులు ఆలోచన చేయాలనీ, ప్రభుత్వ సూచనల ప్రకారం రైతులు పంటల సాగు చేయాలని తెలిపారు.

# పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్‌డ్రైవ్

### వర్షాకాలంలో నిరంతర, నాణ్యమైన విద్యుత్

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్

**హైదరాబాద్, జూన్ 15,ప్రభాతవార్త:** వర్షాకాలంలో నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. "పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్-వాక్ ఎలాంగ్ ద లైన్" కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి. పాటిల్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తిరుమలగిరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ వేణుగోపాల్ నగర్ ఫీడర్‌పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫీడర్ వెంబడి పాదయాత్ర చేస్తూ విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో 33 కేవీ సబ్‌స్టేషన్లు, 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్.టి. నెట్‌వర్క్‌లను సమగ్రంగా తనిఖీ చేసి వర్షాకాలానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నాణ్యత, లైన్ క్లియరెన్స్, నిర్వహణ పనులు, పరికరాల స్థితిగతులు మరియు నెట్‌వర్క్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యుత్ అంతరాయాలకు దారితీసే సమస్యలను ముందుగానే గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం రంగారెడ్డి, మేడ్చల్ తదితర సర్కిల్ కార్యాలయంలో రుతుపవనాల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, లైన్ క్లియరెన్స్‌లు, ట్రీ ట్రిమ్మింగ్ పనులు, ఫీడర్ల నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రత, అత్యవసర స్పందన వ్యవస్థలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. తదుపరి వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హైదరాబాద్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) పనులను జూన్ 16, 2026 నుండి విస్తృత స్థాయిలో చేపట్టలన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం నెలాఖరు వరకు కొనసాగనుందని తెలిపారు. విద్యుత్ లైన్లను తాకే చెట్ల కొమ్మలను తొలగించడం ద్వారా షార్ట్ సర్క్యూట్లు, ఫీడర్ ట్రిప్పింగ్‌లు మరియు విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ వ్యవస్థను మరింత భద్రంగా ఉంచడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సిఎండి జితేష్ తెలిపారు.

## ఓట్ల చోరీ, సీట్ల చోరీ కాంగ్రెస్ నైజం

### ఓటుకు నోటుతో ఓటు చోరీ చేసింది రేవంత్‌రెడ్డే

### కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగిన రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రక్షాళన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇన్‌సెంటీవ్ రివిజన్ ప్రక్రియపై కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాజకీయ స్వార్థంతో బురదజల్లుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ అనేది ప్రధాని నరేంద్ర మోడీ లేదంటే కేంద్ర ప్రభుత్వమో సొంతంగా తెచ్చిన కార్యక్రమం కాదని, ఇది రాజ్యాంగబద్ధంగా ఎన్నికల సంఘం నిర్వహించే నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటివరకు 12 సార్లు ఈ ప్రక్రియ విజయవంతంగా జరిగిందని గుర్తుచేశారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, చిరునామాలు మారిన వారి వివరాల సవరణ కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తారన్నారు. 1951 నుండి 2002 వరకు కాంగ్రెస్ హయాంలోనే అనేకసార్లు ఎస్ఐఆర్ జరిగితే అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా తాము ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించామని, కానీ నేడు కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకే స్వరంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కుట్రపూరిత ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో బిజెపి గెలిచిందని మేధావులమని చెప్పుకునే కొందరు కాంగ్రెస్ నేతలు విమర్శించడం హాస్యాస్పదమన్నారు. మరి అదే ఎస్ఐఆర్ జరిగిన కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ గెలిచినప్పుడు ఎస్ఐఆర్ గుర్తుకురాలేదా అని నిలదీశారు. రాజకీయాల్లో గెలుపోటములు ప్రజా తీర్పుపై ఆధారపడి ఉంటాయన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదని, రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ నిబంధనల ప్రకారమే జరుగుతోందని సుప్రీంకోర్టు సైతం రిట్ పిటిషన్ నెం. 640/2025 లో 124 పేజీల స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తుచేశారు.

## గనులు, సినీ, బీడీకార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

### దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కేంద్రం

**హైదరాబాద్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని గనులు, చిత్ర పరిశ్రమ, బీడీ కార్మికుల పిల్లల విద్యా స్కాలర్‌షిప్‌ల కోసం కార్మిక సంక్షేమ సంస్థ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఒకటో తరగతి నుండి ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సుల వరకు అర్హులైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ స్కాలర్‌షిప్ పథకాల కింద విద్యా ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బీడీ కార్మికులు, సున్నపురాయి, డోలమైట్, ఇనుప ఖనిజం, మాంగనీస్ ఖనిజం, క్రోమ్ ఖనిజం, మైకా గనుల కార్మికులు, చలన చిత్ర పరిశ్రమకు చెందిన కార్మికుల పిల్లలకు ఈ స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది.

## ఉపసర్పంచ్‌లకు 'చెక్ పవర్' రద్దు ఆలోచన విరమించుకోవాలి

### 25న చలో హైదరాబాద్, ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా

### ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్

**హైదరాబాద్,జూన్ 15,ప్రభాతవార్త:** ఉపసర్పంచ్‌లకు చెక్‌పరవన రద్దు ఆలోచనను విరమించుకోవాలని ఉపసర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించినా ప్రజలకు ఏదైనా సేవా చేయాలన్న ఉద్దేశ్యంతో రాజకీయాల్లోకి వచ్చామని, సొంతూరును అభివృద్ధి చేసుకోవాలన్న లక్ష్యంతో ఉప సర్పంచ్లుగా పోటీ చేసి గెలిచామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచ్, ఉప సర్పంచ్లకు జాయింట్ చెక్పవర్ ఉండేదని, కాని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంప్రదాయాన్ని తొలగించాలనుకోవడం అవివేకమన్నారు. చెక్‌పవర్ రద్దు చేస్తే తమ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని, గ్రామంలో గుర్తింపు ఉండదన్నారు. ఈప్రభావం రాష్ట్రంలోని 12,780 మంది సర్పంచ్లపై ప్రభావం పడి గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఉప సర్పంచ్లకు చెకపవర్‌ను కొనసాగించడంతో పాటు గౌరవ వేతనం అందించాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో శిలాఫలకంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచ్లతో పాటు తమ పేర్లు కూడా పొందుపర్చాలని కోరారు. ఈ నెల 24 లోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన జారీ చేయాలని, లేని పక్షంలో ఉద్యమకార్యాచరణ ప్రకటిస్తామన్నారు. చెక్ పవర్ రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ ఈ నెల 25న చలో హైదరాబాదు పిలుపు మేరకు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచ్లు వేలాది హాజరు కావాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం
చెన్నూర్ మునిసిపాలిటీ వారి కార్యాలయం
మంచిర్యాల జిల్లా
కొటేషన్ నం. E1/Q01/MCC/2026-27, కొటేషన్ ప్రకటన తేది: 15.06.2026
విషయం:- చెన్నూరు మున్సిపాలిటీ-ఇంజనీరింగ్ విభాగం, చెన్నూరు మున్సిపాలిటీకి క్రింది యంత్రాలు, ఆటోమొబైల్స్, ట్రై మరియు ట్విన్ బిన్‌ల సేకరణ కొరకు కొటేషన్ల ఆహ్వానం. కొటేషన్ల సమర్పణ ఆవశ్యకత.
చెన్నూరు పురపాలక సంఘానికి ఈ క్రింది యంత్రాలు, ఆటోమొబైల్స్ మరియు ట్రై, ట్విన్ బిన్‌ల కొనుగోలు కొరకు తయారీదారులు/అధీకృత డీలర్లు/ఏజెన్సీలు తమ అత్యల్ప ధరలను అందించవలసిందిగా ఇందుమూలముగా అభ్యర్థించడమైనది.
క్ర.సం., యంత్రాలు/ఆటోమొబైల్, స్పెసిఫికేషన్లు: 1) స్వచ్ ఆటో: డీజిల్ స్వచ్ ఆటో, 22-25HP సామర్థ్యం, 694cc సిలిండర్, 2000 RPM, 145R/12 టైర్, స్వచ్ ఆటో ట్రిప్ ఫుల్ బాడీ ఫ్యాబ్రికేషన్‌తో. 2) బ్యాక్‌హో లోడర్: శక్తి: 74 HP (55 kW) @ 2200 RPM టార్క్: 400 -440 Nm, స్థానభ్రంశం: 4.4 లీటర్లు, బ్యాక్‌హో పనితీరు గరిష్ట తవ్వకం లోతు: 5,360 మిమీ, గరిష్ట పరిధి: 6,250 మిమీ బకెట్ సామర్థ్యం: 0.32 m³ (ప్రామాణిక/లాంగ్ డిప్పర్) నుండి 0.40 m³ వరకు బకెట్ బ్రేక్అవుట్ ఫోర్స్: 6,716 kgf వరకు లోడర్ పనితీరు షవల్ సామర్థ్యం: 1.2 m³ గరిష్ట డంప్ ఎత్తు: 2,930 మిమీ లోడ్ ఓవర్ ఎత్తు: 3,370 మిమీ లోడర్ ఆర్మ్ బ్రేక్అవుట్ ఫోర్స్: 5,000 నుండి 5,635 kgf వరకు హైడ్రాలిక్స్ & కొలతలు హైడ్రాలిక్ పంప్ ప్రవాహం: నిమిషానికి 154 లీటర్లు ఆపరేటింగ్ బరువు: ~8,470 కిలోలు రవాణా పొడవు: 6,350 మిమీ వీల్‌బేస్: 2,340 మిమీ గ్రౌండ్ క్లియరెన్స్: 280 మిమీ సామర్థ్యాలు ఇంధనం ట్యాంక్: 128 లీటర్లు హైడ్రాలిక్ సిస్టమ్: 115 లీటర్లు ఇంజిన్ ఆయిల్: 15 లీటర్లు. 3) హైడ్రాలిక్ లాడర్ లిఫ్ట్: 13 మీటర్ల పని చేసే ఎత్తు, 6 మీటర్ల అవుట్ రీచ్ +/-10% పని చేసే లోడ్ 350-400 కిలోలు, ఫైబర్ గ్లాస్ బకెట్, 10 టన్నుల GCM BS-IV ట్రక్ ఛాసిస్‌పై అమర్చబడినది, రెండు దిశలలో 360 డిగ్రీల నిరంతరాయంగా తిరుగుతుంది. 4) ట్రై బిన్: మున్సిపల్ అవసరాల ప్రకారం స్టాండ్‌పై అమర్చిన చెత్త డబ్బాలు. 5) ట్విన్ బిన్: గృహ చెత్త సేకరణ డబ్బాలలో ఒక్కొక్కటి 10-15 లీటర్లు. 6) తేలికపాటి వాణిజ్య వాహనాలు (స్వచ్ఛ ఆటోలు), ట్రాక్టర్లు, వైకుంఠరథం: 16 సం. స్వచ్ఛ ఆటోలు, 2 సం. ట్రాక్టర్లు మరియు 1 సం. వైకుంఠరథం కోసం 1 సంవత్సరం థర్డ్ ఇన్సూరెన్స్‌కు అత్యల్ప కొటేషన్లు కోరడమైనది. సీల్ చేసిన కొటేషన్లను 22.06.2026 తేదీన సా.5.00 గం.లలోపు క్రింద సంతకం చేసిన వారికి సమర్పించాలి. ఏదైనా సమాచారం కోసం దయచేసి ఫోన్ నెం. 9553494042 ని సంప్రదించండి.
సం/- కమిషనర్, చెన్నూరు మునిసిపాలిటీ
DIPR.No.4281-PP/CL/Advt/1/2026-27, తేది: 15.06.2026

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి: కేంద్రమంత్రి మురుగన్



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, దేశంలో ప్రధాని మోదీ మరింత సంక్షేమపాలన అందించేలా శక్తిని ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నట్లు కేంద్ర సమాచారశాఖ సహాయమంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. సోమవారం ఉదయం తిరుమలకు వచ్చిన ఆయన ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. ఆలయంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్ర సాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రితో బాటు బిజెపి నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి, తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నయనారు నాగేంద్రన్, తమిళనాడు ఇన్‌చార్జ్ అరవింద్ మేనన్, చెన్నై దక్షి ణ బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ ఉన్నారు. ఈ సందర్భంగా తిరుమ లలో కేంద్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్‌కు బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆలయం వెలుపల మంత్రిని గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటం అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో మంత్రి ఎల్. మురుగన్ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షి ంచారు.

## 26 నుంచి దేవదేవునికి జ్యేష్టాభిషేకం



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ఈనెల నుండి 28వ తేదీ వరకు సాలకట్ల జ్యేష్టాభిషేకం జరుగనుంది. ప్రతి సంవత్సరం జ్యేష్టమాసంలో జ్యేష్టా నక్షత్రానికి ముగిసేట్లుగా మూడు రోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్టాభిషేకం నిర్వహిస్తారు. సంపంగి ప్రదక్షి ణంలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్రతువును అభిద్యేయక అభిషేకం అని కూడా అంటారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనములైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగి పోకుం డా పరిరకి ంచేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదటిరోజు మయప్పస్వామికి ఉన్న బంగారు కవచాన్ని తీసివేసి, హోమాలు, అభిషేకాలు పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహి స్తారు. ఆ తర్వాత స్వామికి వజ్రకవచం అలంకరిస్తారు. రెండవరోజు ముత్యాల కవచం సమర్పిస్తారు. మూడవ రోజు తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని పునః సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకం సమయంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.

**ఆర్జిత సేవలు రద్దు:** జ్యేష్టాభిషేకాన్ని పురస్కరించుకుని జూన్ 28వ తేదిన కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టిటిడి రద్దు చేసింది.

## బర్డ్ ట్రస్ట్‌కు రూ.10లక్షల విరాళం



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో సేవలందిస్తున్న బర్డ్ ట్రస్ట్ ఆసుపత్రిలో గతంలో స్వాంతన పొందిన దివ్యాంగుడు 10 లక్షల రూపాయలను విరాళంగా అందించారు. బర్డ్ ట్రస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిరుపేదలు, దివ్యాంగులకు ఆపన్నహస్తం అందిస్తూ సమాజంలో వారికి మహోన్నత స్థానం కల్పిస్తోంది. బర్డ్ ట్రస్ట్ ఆసుపత్రి డైరెక్టర్‌గా డాక్టర్ గుడారు జగదీష్ పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత పూర్వవైభవానికి కృషి చేస్తున్నారు. డాక్టర్ గా డైరెక్టర్ గా ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ పలువురు దాతలు బర్డ్ ట్రస్ట్ కు విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. సెరిబ్రల్ పాలసీతో బాధపడుతున్న సందీప్ కు 1995 బర్డ్ ఆసుపత్రిలో డాక్టర్ గుడారు జగదీష్ వద్ద శస్త్ర చికిత్స పాటు వైద్యం పొందడం జరిగింది. అటు తర్వాత ఉన్నత విద్యను అభ్యసించి సాఫ్ట్ వేర్ సంస్థలో కొలువు సాధించారు. తాజాగా బెంగళూరులో ఎన్‌విడి సంస్థలో పని చేస్తున్న పులి సందీప్ కుమార్తె పేరిట తన కుటుంబ సభ్యులతో కలసి 10 లక్షల వెయ్యిన్ని పదహారు రూపాయల విరాళాన్ని బర్డ్ ట్రస్టు కు అందించాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు సోమవారం డైరెక్టర్ సూచనల మేరకు బర్డ్ ఆసుపత్రి మెడికల్ సూపర్నెండెంట్ డాక్టర్ వెంకారెడ్డికి అందజేశారు. నిరుపేదలకు, అర్థులకు వైద్యంఅందించేందుకు వినియోగించాలని దాత కోరారు. భవిష్యత్తులో డాక్టర్ గుడారు జగదీష్ స్పూర్తితో బర్డ్ ట్రస్ట్ కు భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు.

## భక్తజనసంద్రంగానే తిరుమల: సర్వదర్శనానికి 30గంటలుపైగానే




**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగిసి విద్యాసంస్థలు తెరచుకున్నా, వారాంతం వరుససెలవులు పూర్తయినా ఏడుకొండలు భక్తజనసంద్రంగానే తలపిస్తోంది. సోమవారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలై న్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకె న్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 30గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఈ రద్దీ ఇలాగే జూన్ నెలాఖరువరకు కొనసాగుతుందని టిటిడి వర్గాల అంచనా. సోమవారం సాయంత్రానికి 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా మరో 25వేలమంది భక్తులు అర్థ రాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. ఆదివారం రాత్రివరకు 95,904 మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. 4.66లక్షల లడ్డూలు విక్రయాలు జరిగాయి. కానుకల రూపంలో 3.93కోట్లు రూపాయలు ఆదాయం హుండీకి చేరింది. సాధారణంగా శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. అయితే వేసవిసెలువులు ముగిసినా భక్తుల రద్దీ మాత్రం కొనసాగుతూనే ఉంది.

## ప్రసాదాల తయారీ నాణ్యత పరీక్షల్లో శాస్త్రీయ విధానాలు
## సిఎస్ఐఆర్ సిఎఫ్‌టిఆర్ఐ మైసూర్‌తో టిటిడి ఒప్పందం




**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల ప్రసాదాల తయారీ, నిల్వ, నాణ్యత పరీక్షల్లో శాస్త్రీయ విధానాల అమలుకు టిటిడి సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ), మైసూర్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. శ్రీవారి ప్రసాదాల భద్రత, పోషక విలువలు, నాణ్యత మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ఒప్పం దం దోహదపడుతుంది. శ్రీవారి ప్రసాదాలు టిటిడి ఆధ్వర్యంలో తయారై, పంపిణీ అయ్యే ఆహార పదార్థాలు అత్యున్నత భద్రతా ప్రమాణాలు, పోషక విలువలు, నాణ్యతతో భక్తులకు అందేలా చేయ డంతో పాటు వాటి సంప్రదాయ స్వరూపాన్ని పరిరక్షి ంచేందుకు ఇది ఎంతగానో ఉపయుక్తం కానుంది. ఈ ఒప్పందం ద్వారా టిటిడి ఆహార నిర్వహణ వ్యవస్థల్లో శాస్త్రీయ పద్ధతులను ప్రవేశపెట్ట నున్నారు. సుగంధ లక్షణాల విశ్లేషణ వంటి అంశాలపై సిఎఫ్‌టిఆర్ఐ శాస్త్రవేత్తలు శిక్షణ అందిస్తారు.



## శివునికి అభిషేకం చేసిన మంత్రి లోకేష్ దంపతులు

**విజయవాడ,జూన్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర,దేశ అభ్యున్నతి కోసం ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. "ఎక్స్' వేదిక లోకేష్ ఈ విషయాన్ని ప్రజలకు తెలిపారు. విశిష్ట సోమవారాన్ని పురస్కరించుకుని మహాశివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుత్వికుల వేదమంత్రోచ్ఛారణల నడుమ లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పూజల్లో పాల్గొన్నారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

# వెంకన్న ఆస్తుల పరిరక్షణకు అడుగులు

## దేశవ్యాప్తంగా ఉన్న విలువైన భూములకు పూర్తి రక్షణ



**తిరుమల,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి ప్రియ భక్తులు పలు రకాలుగా విరాళాల రూపంలో, సర్వస్వం దేవునికే అంటూ భక్తులు విరాళంగా ఇచ్చిన ఆస్తులతో బాటు టిటిడి పరిధిలో ఉన్న ఆస్తుల రక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా దేవునికి చెందిన ఆస్తులు దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఏ మేరకు ఉన్నాయి, అవి ఎంతవరకు ఖాళీగా ఉన్నాయి, ఎవరెవరైనా ఆక్రమించుకుని ఉన్నారా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. అన్యాక్రాంతమైన స్థలాల్లో భవనాలు నిర్మించుకున్న వాటిని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాటిపై ప్రత్యేక నివేదిక తయారు చేస్తున్నారు. దేశంలోనేగాక తిరుమలకొండ క్రింద తిరుపతి నగరం పరిసరాల్లోనూ వేంకటేశ్వరస్వామికి చెందిన ఆస్తులు ఉన్నాయి. ఈ ఆస్తుల్లో కరకంబాడి మార్గంలోని ఉపాధ్యాయనగర్, గ్రాండ్ వరల్డ్ పరిసరాల్లో, రేణిగుంట మార్గంలో కొరమేనుగుంట, ఆటో నగర్ పరిసరాల్లో 322 ఎకరాల వరకు స్థలాలు, టిటిడి పేరు చెబితేనే గుర్తుకు వచ్చే తిరుపతిలోని కేశవాయనగుంట, బైరాగిపట్టెడ, ఠైల్వేకాలనీ, అలిపిరి మార్గం , ఎంఆర్‌పల్లి, ఉల్లిపట్టెడ వంటి చోట్ల ఇలా ఉన్న స్థలాలు టిటిడివన్నట్లు సర్వే నంబర్లతో సహా టిటిడి ఎస్టేట్ విభాగం జిల్లాలోని సబ్ రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల అధికారులకు గతంలోనే నివేదికలు ఇచ్చారు. ఈ స్థలాలు అధికశాతం టిటిడివి కావడంతో వాటిని నిషేధిత జాబితాలో పొందుపర్చాలని రిజిస్ట్రేషన్ శాఖకు మూడేళ్ల క్రిందటే జాబితా అందించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో చాలావరకు పలువురు ఇళ్ళు, అపార్టుమెంట్లు నిర్మించుకుని కాపురాలు ఉంటున్నారు. ఈ స్థలాలపై గత కొంతకాలంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. నిబంధనల మేరకు దేవాదాయశాఖకు చెందిన భూములను నిషేధిత జాబితాలో పొందుపర్చాలి. ఈ నిబంధన అనుసరించి ఆయా సర్వేనంబర్లను జాబితాలో పొందుపరిచారు. త్వరలోనే సబ్‌డివిజన్ల వారీగా సర్వేనంబర్లతో టిటిడి తుది జాబితా అందజేస్తే స్థలాలు కొనుగోలుచేసిన వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారనుందనే చర్చ వినిపిస్తోంది. దేశవ్యాప్తంగా లక్షకోట్ల రూపాయలు విలువ చేసే 963 ఆస్తులు ఉన్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం గుర్తించి, ఈ ఆస్తులకు సంబంధించి పూర్తిగా పరిరక్షించే విషయంలో జియోఫెన్సింగ్ కూడా చేస్తున్నారు. 1974వ సంవత్సరం నుంచి 2014 సంవత్సరం మధ్య కాలంలో పలు రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో టిటిడి దేశవ్యాప్తంగా 113 ఆస్తులను వదులుకున్నట్లు ఇప్పటికే గుర్తించారు. ఇంకా ప్రతి ఏడాది కూడా భక్తులు వారివారి ఆస్తులను దేవునిపేరున రాసి ఇస్తున్నారు. గతంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు భక్తులు కూడా వారి యావదాస్తిని టిటిడికి రాసిచ్చిన సందర్భం ఉంది.

# ప్రాచీన కళలకు ప్రాణం పోయాలి

## బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి



**తిరుపతి,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో రాయలసీమ రంగస్థలి తిరుపతి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదే వరాయ కళాదర్బార్ 36వ వార్షిక శాస్త్రీయ జానపద జాతీయస్థాయి నృత్య పోటీల పోస్టర్ ఆవిష్కరణను సోమవారం బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లా డుతూ రాయలసీమ రంగస్థలి గత 50 సంవత్సరాలుగా అనేక ఒడి దుడుకులను ఎదుర్కొంటూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వ హిస్తూ ప్రజల మన్ననలను పొందడం అభినందనీయమనీ ఇలాంటి కార్యక్రమాలకు మహతి ఆడిటోరియం వేదికవ్వడం నగర ప్రజలకు గొప్ప వరం లాంటిదన్నారు. తిరుమల శ్రీవారికి శ్రీకృష్ణదేవరాయలకి ఉన్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని నృత్య ప్రదర్శన ద్వారా నేటితరం యువతకు తెలియజేయడమే లక్ష ్యంగా రాయలసీమ రంగస్థలి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. భారతదేశం ప్రాచీన కళ లకు, సాంప్రదాయాలకు "పుట్టినిల్లు" లాంటిది వాటిని సంరక్షి ంచుకొని భవిష్యత్ తరాల వారికి హిందూ సనాతన ధర్మం యొక్క గొప్పదనాన్ని, సాంప్రదాయ ఆచారాలను అందించేలా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే ఎన్ రాజా గార్లతో పాటు ఇతర కమిటీ సభ్యులు కృషి చేయడం శుభ పరిణామం అన్నారు. మహతి ఆడిటోరియంలో ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు జరిగే శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ నృత్య పోటీలకు ఆంధ్ర తెలంగాణ బీహార్ కర్ణాటక ల నుంచి అనేకమంది కళాకారులు తరలివస్తున్నారని, నగర ప్రజలంతా విచ్చేసి ఈ నృత్య ప్రదర్శనను విజయవంతం చేయాలని నవీన్ కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి కేఎన్ రాజా, సభ్యులు జీవీకే ప్రసాద్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ మస్తాన్, లోకప్రభాకర్ నాయుడు, కిషోర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రూఫ్ టాప్ సోలార్

## డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండిలో శివశంకర్ లోతేటి వెల్లడి



**తిరుపతి,జూన్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి తెలిపారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 63 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సీఎండీకి వివరించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు రూఫ్ టాప్ సోలార్ అంశంపై మాట్లాడారు. ఈ అంశంపై సిఎండి సమాధానమిస్తూ సంస్థ పరిధిలో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై దశలవారీగా సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరుపై ఆయన మాట్లాడుతూ సీనియారిటీ ప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. రైతుల దరఖాస్తు సీనియారిటీ లిస్టును ఆయా సెక్షన్ కార్యాలయాల వద్ద ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్‌శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 ,1800 425 155333కు కాల్ చేయడం,వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం,ఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, లత, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిస కాకూడదు

## జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత

## నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జూన్ 15 ప్రభాతవార్త :** క్షణికావేశానికి లోనై యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, మత్తుకు బానిసైతే జీవితమే బలౌతుందని గ్రహించాలని జిల్లా ఇన్‌చార్జ్ మరియు రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. తల్లి దండ్రుల త్యాగాలను గుర్తు చేసుకొని, క్రమశిక్షణతో చదువుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. సోమవారం పోలీస్ పెరేడ్ మైదానంలో రెండేళ్ళ నమ్మకం -సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనిత మాట్లాడుతూ చిన్న చిన్న తప్పులకే అనేక మంది జైలులో మగ్గుతున్నారని, వారిని కలిసినప్పుడు మనసు చలించిపోయిందని, ప్రస్తుతం గంజాయి కేసులో దొరికిన వారికీ నాన్ బెయిల్‌బుల్ కేసులు పెడుతున్నారని, యువత జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు ఒకప్పుడు వెనకబడినవిగా ఉండేవని, నేడు వెనక ఉండి నడిపించే జిల్లాలుగా మారాయన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి అన్ని రంగాల్లో జరిగిందని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్త ఒరవడి చేపట్టారని తెలిపారు. రాష్ట్రానికి 20 లక్షల కోట్ల పెట్టుబడులు రావడానికి మంత్రి లోకేష్ కృషి చేసారని పేర్కొన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెండేళ్లలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి విశేష ప్రగతిని సాధించిందన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు హానికరమని, వినియోగించను, విక్రయించను, ప్రోత్సహించను, డ్రగ్స్ లేని, సురక్షితమైన సమాజానికి పాటు పడతానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ తణుకు ఎం.ఎల్.ఏ ఆరిమిల్లి రాధాకృష్ణ, శాసన సభ్యులు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీ, కోళ్ళ లలిత కుమారి, పూసపాటి అదితి గజపతి రాజు, ఆర్.వి.ఎస్.కె రంగారావు, డిసిసిబి అధ్యక్షులు కిమిడి నాగార్జున, మార్క్ఫెడ్ అధ్యక్షులు బంగారు రాజు, బి.జె.పి జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, జే.సి సేదు మాధవన్, అదనపు ఎస్.పి సౌమ్యలత, డి.ఆర్.ఓ సత్తిబాబు, ఆర్.డి.ఓ సుధా సాగర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నియంత్రణపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింపజేసాయి. అనంతరం రెండేళ్లలో సాధించిన ప్రగతితో వివిధ శాఖలు ప్రదర్శించిన 20 స్టాల్స్ ను మంత్రులు సందర్శించారు.



## తగ్గని జనం.. రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 15 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్త జనం తగ్గటం లేదు.రాహుకేతుదోష నివారణ పూజలు తగ్గటం లేదు.అయితే వచ్చిన భక్తులకు అన్‌లైన్ కష్టాలు ఓ వైపు ఉంటే మరో వైపుపట్టించుకోని అధికారులతో తిప్పలుపడుతున్నారు. సోమవారం సాధారణంగా ఉదయంమాత్రమే పూజలు జరిగేవి. సోమవారం కూడా సాయంత్రం వరకు భక్తులు తగ్గలేదు. సోమవారం ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు 25వేల మంది దర్శనం చేసుకున్నట్లు సమాచారం.అలాగే రాహుకేతు దోష నివారణ పూజలు ఏడువేలుజరిగాయి.ఇక సాయంత్రం జరిగే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలకు కూడా 16 జరిగాయి.

## ముగ్గురాయి మిల్లుల యజమానులతో చర్చించిన ఎపి ఎండిసి ఈడి

**ఓబులవారిపల్లి(తిరుపతి జిల్లా), 15 జూన్ ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట ఏపీ ఎం డి సి సంస్థ నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఓఎన్జిసి కంపెనీకి సరఫరా చేసిన ముగ్గురాయి యజమానులతో ఏపీఎండిసి ఈడి.కేదార్నాథ్ రెడ్డి సోమవారం మంగంపేట ఏపీఎండిసి కార్యాలయంలో సమావేశమయ్యారు. ముగ్గురాయి సరఫరా విధివిధానాలపై చర్చించారు. ఇటీవల పత్రికల లో ఓఎన్జిసికి ఎగుమతి చేసిన ముగ్గురాయి నాసిరకం తదితర ఆరోపణలపై ఏపీఎండిసి అధికారులు స్పందించి ఇల్లులు యజమానుల వద్ద ఉన్న డేటా ముగ్గురాయి రికార్డులు ఎన్ని టన్నులు సరఫరా చేశారు, ఏ గ్రేట్. బి గ్రేడ్. మరియు సీఎండి నేడులకు సంబంధించిన ముగ్గురాయి పూర్తి వివరాలను మంగళవారం పేపర్ వర్క్ ద్వారా అధికారులకు సమర్పించాలని సూచించారు. అంతేకాకుండా గనులలో పర్యటించి ఏ గ్రేడ్ బి గ్రేడ్ చేయండి కనీసం ఉత్పత్తులు మరియు స్టాక్ మా ఇంట్లో ఎంత ముగ్గురాయి ఖనిజం ఉందని పరిశీలించారని అధికారులు తెలిపారు. ఈ విషయమై పలువురు మంగంపేట కార్మిక నాయకులు, బిజెపి నాయకులు కూటమి నాయకులు, ఆర్థిక విశ్లేషకులు నిష్పక్షపాతంగా విచారణచేయాలని, నాసిరకం ముగ్గురాయి వాడకంపై చర్యల తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు డాక్టర్ కంచర్లశ్రీకాంత్, చిరంజీవి,రాంభూపాల్‌రెడ్డి

## పాఠశాల విద్య కమిషనర్‌ను కలసిన ఎమ్మెల్సీలు
## ఉపాధ్యాయుల సమస్యలపై చర్చ

**కుప్పం, జూన్ 15 ప్రభాతవార్త:** రాష్ట్ర పాఠశాల విద్య కమీషనర్ డాక్టర్ తమీమ్ అన్సారియాను ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, వేపాడ చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వివిధ సమస్యలపై కమీషనర్‌తో చర్చించారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల బదిలీలు, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహణపై చర్చించారు. అలాగే బదిలీ చేసినా రిలీవ్ కాని ఉపాధ్యాయులు, ఎంఇఓ పోస్టుల పేరు మార్పు, ఉపాధ్యాయుల పదోన్నతులు, ఒహెచ్‌లు పాఠశాలకు ఇవ్వాలని కమీషనర్‌ను కోరారు. దీనిపై కమీషనర్ స్పందిస్తూ ఎంటిఎస్ ఉపాధ్యాయులను త్వరలో బదిలీ చేస్తామన్నారు. అలాగే ప్రత్యేక టెట్ అంశంను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను సర్దుబాటుకు ముందే రిలీవ్ చేసే అంశం పరిశీలిస్తామన్నారు. ఎంఇఓల పేర్ల మార్పు అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధ్యాయుల బదిలీల విషయం జిల్లాల పునర్విభజన తర్వాత ఉంటాయన్నారు. ఒహెచ్‌ల విషయంలో పాత విధానాన్ని అమలు చేస్తామని కమీషనర్ ఎమ్మెల్సీలకు వివరించారు.



# సంక్షేమ పథకాల సృష్టికర్త చంద్రబాబు: మంత్రి గొట్టిపాటి

**బల్లికురవ(అద్దంకి), జూన్ 15, ప్రభాతవార్త:** భారతదేశంలో మరి ఏ రాష్ట్రంలోని లేనివిధంగా సంక్షేమ పథకాల సృష్టికర్తగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , అమరావతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొప్పెరపాలెం, మల్లాయపాలెం గ్రామాలలో సోమవారం సాయంత్రం 154 మంది విద్యార్థులకు, సైకిళ్లను పంపిణీ చేశారు. మల్లాయపాలెం కాలనీలో పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్య బోధనలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ముందుకెళ్లాలి. పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రి నారా లోకేశ్, విశేష కృషి చేస్తున్నారన్నారు. మెరుగైన విద్య వ్యవస్థ కోసం మెగా డీఎస్సీతో 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేశాం. అద్దంకి పరిధిలో 11,500లకు పైగా విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేశామన్నారు.

ఒక్క అద్దంకి నియోజ కవర్గంలోనే రహదారుల కోసం 100 కోట్లను ఖర్చు చేయటం జరిగిందన్నారు. గడిచిన రెండేళ్లలోనే ఇంతటి ప్రగతిని సాధించిన మహాకూటమి ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు వి జినరీతో రానున్న మూడేళ్లలో అమరావతిని భారతదేశ పటంలో అగ్రస్థా నంలో నిలుపుతుందని గొట్టిపాటి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతోంది, అని కూటమి ప్రభుత్వ విజయాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు దుష్ప్ర చారం చేస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించి, కూటమి మంచిని ప్రజలకు వివరం చాలన్నారు.

ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి మల్లి నిడి గోవిం దరావు, తాసిల్దార్ రవి నాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, సీఐ శేషగిరిరావు, ఎస్సై నాగరాజు, ఈ.ఈ మస్తానావు ఏ.ఈ మాధవ్, డిసి ఉపాధ్యక్షులు కోయి పేరయ్య, మండల పార్టీ అధ్యక్షులు ధూళిపాళ్ల హనుమంతరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, ఎర్ర ఈశ్వరరావు, జూపల్లి రాఘవరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



గుడ్డు సంపూర్ణ పోషకాహారమనే విషయం తెలిసిందే. ఇందులో ప్రొటీన్లతో పాటు ఇతర పోషకాలూ సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ సంపూర్ణ ఆరోగ్యానికే కాదు.. అందానికీ ఎంతో మేలు చేస్తాయి.



## తెల్లసొన పూతతో మిలమిల !

గుడ్డులోని తెల్లసొనను ముఖంపై పూతలా వేయడం వల్ల వయసు పెరిగే కొద్దీ ముఖంపై వచ్చే ముడతలు, సన్నటి గీతలు రాకుండా ఉంటాయి. ఇలా చేయడం వల్ల చర్మం బిగుతుగా మారుతుంది. వారంలో రెండుసార్లు ఈ పూత వేసుకోవడం వల్ల యవ్వనంగా కనిపిస్తారు. కళ్ల కింద వాపును తగ్గించాలంటే గుడ్డులోని తెల్లసొనతో కంటి కింది భాగాన్ని నెమ్మదిగా మర్దన చేయాలి. అలా కాసేపు ఉంచి చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఆ తర్వాత అక్కడ కొబ్బరినూనె రాయాలి. ఇలా తరచూ చేయడం వల్ల కంటి కింది వాపు క్రమంగా తగ్గుతుంది. గుడ్డులోని తెల్లసొనలో రెండుమూడు చుక్కల టీట్రీ ఆయిల్ వేసి మొటిమలు ఉన్న ప్రాంతంలో నెమ్మదిగా రాయాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు, వాటివల్ల వచ్చే మచ్చలు తగ్గిపోతాయి. అంతే కాదు జిడ్డు చర్మం ఉన్న వారు ఇలా చేయడం వల్ల చర్మంపై ఉండే జిడ్డు అదుపులో ఉంటుంది. ముందుగా గోరువెచ్చటి నీటితో ముఖం కడుక్కొని తెల్లసొన రాయాలి. అది పూర్తిగా ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగే సుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల చర్మరంధ్రాలు శుభ్రపడతాయి. □

## జలకాలాటకూ ఓ పద్ధతుంది!

అడపా దడపా వర్షాలు పడినా.. ఆ చల్లదనం కొద్దిసేపే కదూ! పగలు వేడి, దానికితోడు ఉక్కబోత, ఈ చిరాకుకి ఎన్నిసార్లు



స్నానం చేసినా తక్కువే అనిపిస్తుంది. అయితే ఈ ఇబ్బంది మనకే కాదు పసివాళ్లకీ ఉంటుంది. అందుకే వాళ్లనీ నీటిలో కాసేపు అడుకోనివ్వడం. దీనివల్ల బోలెడు అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. చక్కకగా నిద్రపడుతుంది. చర్మం మృదువుగా అవుతుందని రోజూ వేడినీటి స్నానాలు, నలుగు పెట్టడం వంటివి చేయొద్దు. అసలే సున్నితమైన చర్మం. ఎరుపెక్కడం, అలర్జీలకు దారితీస్తాయి. నూనె మర్దనా, గోరువెచ్చని నీటితో స్నానం చాలు. అలాగని సబ్బునీ అతిగా వాడొద్దు. ఒకపూట దాంతో చేయించినా.. మరోపూట కేవలం నీటిని పోస్తూ చేత్తో రుద్ది కడిగితే సరిపోతుంది. ఒక టబ్బుని గోరువెచ్చని నీటితో నింపి, అరకప్పు పాలు పోయండి. ఆ నీటిలో చిన్నారులను కూర్చోబెట్టి, ఆడుకొనిస్తే సరి. వాళ్లకీ హాయిగా ఉంటుంది. చర్మానికీ కావాల్సిన తేమ అందుతుంది. తేనె, కస్తూ వెనెగర్ కలిపినా మంచిదే. వీటిల్లోని యాటీ బ్యాక్టీరియల్ గుణాలు దద్దుర్ల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చివర్లో గోరువెచ్చని నీటితో మరోసారి ఒళ్లంతా కడిగితే చాలు. టబ్బులో గోరువెచ్చని నీటిని పోసి, కొన్ని బొమ్మలు వేసి కూర్చో బెట్టండి. నీటిని కొడుతూ, బొమ్మలతో ఆడుతూ ఉంటారు. కదా! దీని వల్ల వారిలో మోటార్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయట. కంటికీ, చేతికీ, మధ్య సమన్వయం కూడా ఏర్పడుతుంది. అంతే కాదు, నీటితో ఆట వాళ్లల్లో విశ్రాంతి భావననీ కలిగిస్తుంది. దీన్ని కేవలం ఆటగానే భావించొద్దు. ఇది వారికి ఏకాగ్రతను పెంచే సాధనం కూడా. అందుకే జలకాలాటను చిన్నారి రోజువారీ ప్రక్రియలో తప్పక భాగం చేయాలి. అయితే.. నెలల నుంచి ఆరేళ్ల వయసు వరకు పిల్లల నీటితో ఆడుతోంటే ఎవరో ఒకరు పెద్దవాళ్లు పక్కనే ఉండటం తప్పనిసరి. అలా చేస్తే ప్రమాదాలు మనదరికి రావు. □

## చిట్కా

✦ ఫ్రిజ్‌లో ఆహారపదార్థాలను కూరగాయలను ఏమాత్రం ఖాళీ లేకుండా ఇరికించి పెట్టరాదు. ఫ్రిజ్ లోపలికి గా ప్రవేశించేలా కొంతఖాళీ వుండేలా చూడాలి. ✦ సువాసన వస్తువులను, పూలను ఫ్రిజ్ పెట్టేప్పుడు వాటివాసన బయటకు రాకుండా జాగ్రత్తగా వేసి కవర్‌లో పెట్టాలి. ✦ కూరగాయాలను కడిగిన తర్వాత పూర్తిగా తడి ఆరిపోయిన తర్వాతనే వాటిని ఫ్రిజ్‌లో పెట్టాలి ✦ తొడిమలు తీసిన మిరప కాయలను ఎక్కువరోజులు ఫ్రిజ్‌లో వుంచితే అవి కుళ్ళి పోతాయి. కనుక పచ్చిమిరపకాయలను తొడిమలు తీయకుండా ఫ్రిజ్ పెట్టాలి. □

## 'కో అంటే' కోడింగ్‌లో..కోట్లే!

## అద్భుతం.. అత్యద్భుతం ..!

సాఫ్ట్‌వేర్‌లో కోడింగ్ అంటే ఎంతో మంది విద్యార్థులు వామ్మో! కోడింగ్' అంటుంటారు. కానీ 'కోడింగ్' అంతు చూడాలని ఓ చిన్నారి చిరుప్రాయం నుండే కోడింగ్‌లో తానే దిట్టని నిరూపించుకుంది. అదే ఆమె 'ఏఐ'లో విజేతను చేసింది.



అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ యువతి కోడింగ్ నమ్ముకుని అద్భుతాలు సృష్టిస్తోంది. కేవలం 16 ఏళ్ల వయసులో 'డెల్వ్.ఏఐ' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌ను ప్రారంభించిన ప్రాంజలి అవస్థి నలుగురించేత బేష్ అనిపించుకుంటోంది. ఆమె కంపెనీ దాదాపు రూ. 100 కోట్లకు (12 మిలియన్ డాలర్లు) పై మాటే. ఈ వివరాలతో ఆమె ఘనత పదుగురి నోళ్లనో నానుతోంది. ఒక స్ఫూర్తి దాయక విజయ పరంపర లో ఆమెకు ఆమెయే సాటి. భారత్‌లో జన్మించిన ప్రాంజలి, చిన్న నాడే తన కుటుంబంతో కలిసి ఫ్లోరిడాకు వలస వెళ్లింది. ఆమె తండ్రి ఇంజినీర్ ఆయన స్ఫూర్తితోనే 7 ఏళ్లకే కోడింగ్ పాఠలకు ఒకర్పాణ చేసింది. 13 ఏళ్ల వయసులో మెషిన్ లెర్నింగ్‌పై ఓ రిసెర్చ్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంది. అక్కడే ఆన్‌లైన్‌లో భారీ సమాచారాన్ని విశ్లేషించడంలో పరిశోధకులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను గమనిం చింది. ఈ సమస్యకు పరిష్కారంగా, 2022 జనవరి లో, తన 16వ ఏట డెల్వ్.ఏఐని ప్రారంభించింది. ఆన్‌లైన్ సమాచారం, అకడమిక్ పేపర్లు, పిడిఎఫ్‌ల నుంచి కీలక విషయాలను వేగంగా వెలికితీసి, క్రమపద్ధతి లో అందించడమే ఈ ఏఐ టూల్ ప్రత్యేకత. మయామికి చెందిన ఓ స్టార్టప్ యాక్సిలరేటర్‌లో చేరడంతో ఆమెకు పెట్టుబడిదారులతో సంబంధాలు ఏర్పడ్డాయి. దీని ద్వారా ఆన్ డెక్, విలేజ్ గ్లోబల్ వంటి సంస్థల నుంచి సుమారు 45 లక్షల డాలర్లు(దాదాపు రూ. 3.7 కోట్లు) నిధులను సమీకరించింది. జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ చదివిన ప్రాంజలి, ప్రస్తుతం ఇతర టెక్ ప్రాజెక్టులతో చురుకుగా అధ్యయనంలో పాల్గొంటుంది. □

## సుగుణాభిరాముడు !

హనుమ మాతృభక్తి పరాయణుడు, మనం ఆ సుగుణాన్ని అలవరచుకుంటే వృద్ధాశ్రమాలే ఉండవు. పావని ప్రభుభక్తిపరుడు. ప్రభువంటే రాజు, యజమాని, హనుమకి ప్రభువు సుగ్రీవుడు, సుగ్రీవాజ్ఞకు తిరుగులేదు. సీతజాడ కనిపెట్టమని ఆదేశించగా.. ఆంజనేయుడు సముద్రాన్ని దాటి, సీతమ్మ జాడ కనిపెట్టాడు. అటు రామకార్యాన్ని, ఇటు రాజాజ్ఞను నెరవేర్చాడు. ఆ కార్య దీక్షను, ధైర్యసాహ సాలను అలవరచు కోవాలి. ఆంజనేయ స్వామి- స్వామి భక్తి ప్రపూర్ణుడు. స్వామి అంటే ఎవరు? సాక్షాత్తు శ్రీరాముడు. తన వినయం, విధేయత, భక్తి, సేవలతో స్వామిని అలరించాడు. ఆంజనే యుడిపట్ల అంత నమ్మకం ఉన్నందునే తన అంగుళీకాన్ని ఇచ్చి పంపాడు రాముడు. అతడే కార్యసాధకుడన్న మహావిశ్వాసం రాముడిది. అడుగడుగునా ఎదురైన ఆటంకాలన్నిటినీ అధిగమించాడు. సీతా మహాసాధ్విని కలిసి, ఆనవాలును చూపాడు. ఆ తల్లిని ఓదార్చాడు. తిరిగి రాముని చేరుకుని, ధైర్యం చెప్పి, రావణ సంహారంలో ఎన్నో విధాల సహకరించాడు. సీతారాములను కలిపాడు. అంతేనా వారిని తన హృదయంలో స్థిరపరచుకున్న భక్తాగ్రేసరుడు అంజనీ పుత్రుడు. పరోపకారానికి, లోకశ్రేయస్సుకి మరో రూపం ఆంజనే యుడు. లక్ష్మణుని బతికించడానికి ఏకంగా సంజీవని పర్వతాన్నే పెకలించు కుని వచ్చాడు. దుష్టసంహారం చేసి, జగత్తుకు ఎనలేని మేలు చేకూర్చాడు. నిత్యం రామనామ స్మరణతో భూలోకాన్నే పునీతం చేశాడు. రామభక్త హనుమంతుని ఆరాధనతో ఇన్నీ సద్గుణాలు అలవడతాయి. □

## ఆలివ్ నూనెతో..



కొన్ని పదార్థాల్లో ఆలివ్ నూనెనే ఉపయోగించాలి. కానీ ఇతర నూనెల కంటే ధర ఎక్కువ కనుక కొందరు సంకోచిస్తారు. ఇంతకీ ఈ నూనె ఎందుకు మంచిదో, దీని ప్రత్యేకత ఏమిటో తెలుసుకుందాం.. విటమిన్లు, ఖనిజాలు ఉన్న పోషకాహారమిది. ఇందులో గుండెకు మేలు చేసే కొవ్వు ఉంది. అత్యంత ఆరోగ్య కొవ్వుగా దీన్ని వర్ణిస్తారు. ఈ నూనె ఉపయోగించేవారిలో రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తనాళాల పనితీరు మెరుగవుతుంది. సాధారణ నూనెకు బదులు ఆలివ్ నూనె ఉపయోగించే వారిలో గుండె జబ్బులు చాలా తక్కువని అధ్యయనాల్లో తేలింది. మధుమేహాన్ని నివారిస్తుంది. కీళ్లనొప్పులను తగ్గిస్తుంది. దీనికి చేపనూనె జతచేస్తే సత్వర ప్రయోజనం ఉంటుంది. చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. మచ్చలను, మొటిమలను పోగొడుతుంది. ముడతలు పడకుండా కాపాడుతుంది. కాళ్ల పగుళ్లు తగ్గుతాయి. ఇందులోని ఇ-విటమిన్ రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతుంది. కళ్ల కింద వలయాలు ఏర్పడనివ్వదు. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్నందున రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఊబకాయం రాదు. ఇది యాంగ్జయిటీ, డిప్రెషన్లను కూడా తగ్గిస్తుంది. ఆలివ్ నూనెఅల్జీమర్స్, కాన్సర్లకు వ్యతిరేకంగా పోరాడుతుందని చెబుతున్న శాస్త్రవేత్తలు ఈ అంశమై మరిన్ని పరిశోధనలు చేస్తున్నారు. □

## అరటిపువ్వు వడ



**కావలసిన పదార్థాలు**

అరటి పువ్వు: ఒక కప్పు, శనగ పప్పు: ఒక కప్పు, పచ్చిమిర్చి: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి(పెద్దది), వెల్లుల్లి రెబ్బలు: నాలుగు, అల్లం: అంగుళం ముక్క, జీలకర్ర, సోంపు: ఒక టీస్పూన్ చొప్పున, కరివేపాకు: రెండు రెబ్బలు, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం :** శనగపప్పును కడిగి నాలుగు గంటలపాటు నానబెట్టాలి. అరటిపువ్వును ఒలిచి అరగంట పాటు ఉప్పునీళ్లలో నానబెట్టి చిన్నగా తరిగి పెట్టుకోవాలి. మిక్సీ జార్‌లో శనగపప్పు, పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బలు, అల్లం, జీలకర్ర, సోంపు, ఉప్పు వేసి కాస్త బరకగా గ్రైండ్ చేయాలి. పప్పు మిశ్రమాన్ని గిన్నెలో వేసి చిన్నగా తరిగిన ఉల్లిగడ్డ, అరటిపువ్వు, కరివేపాకు వేసి బాగా కలపాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడయ్యాక పప్పు మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని అరచేతిలో వడల్లా ఒత్తుకుని దోరగా కాల్చుకుంటే అరటిపువ్వు వడలు సిద్ధం. □

# తెర

## 2026 మెగా ద్వయం సంచలనం.. సరికొత్త చరిత్ర సృష్టించిన మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్






భారతీయ సినీ పరిశ్రమలో ఎన్నో లెజెం డరీ ఫ్యామిలీస్, సక్సెస్ ఫుల్ జనరేషన్స్, ఒకే ఫ్యామిలీ నుంచి స్టార్ హీరోలు వచ్చారు. అయితే 2026లో మాత్రం భారతీయ సినిమా చరిత్రలోనే అరుదైన ఘట్టం నమోదైంది. తండ్రి, కుమారుడు కలిసి ఈ సంవత్సరంలో అత్యధిక వసూళ్లు సాధించిన రెండు చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద అదరగొట్టారు. మొదట మెగాస్టార్ చిరంజీవి నటించిన ' మన శంకర వర ప్రసాద్‌గారు' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2026లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సౌత్ ఇండియన్ చిత్రంగా నిలిచింది. ఆ తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'తో ఆ రికార్డును అధిగమించారు. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది', ప్రపంచ వ్యాప్తంగా 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్ర ఫైనల్ కలెక్షన్లను దాటి, 2026లో సౌత్ ఇండియా బాక్సాఫీస్ చాంపియన్‌గా అవతరించింది. ప్రస్తుతం ఈ చిత్రం 400 కోట్ల మార్క్ వైపు దూసుకుపోతోంది. ఈ ఘనత కేవలం కలెక్షన్ల పరంగా మాత్రమే కాదు, భారతీయ సినిమా చరిత్రలో ఒకే ఏడాదిలో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్2 చిత్రాల స్థానాలను తండ్రి, కుమారుడు నమోదు చేయడం ఇదే తొలిసారి. ఒకే కుటుంబా నికి చెందిన రెండు జనరేషన్స్ ఒకేసారి బాక్సా ఫీస్‌ను ఏలడం అరుదైన రికార్డు. ఇంకా ప్రత్యేకత ఏమిటంటే, ఈ రెండు చిత్రాలు కూడా థియేట్రికల్ బిజినెస్ కి అత్యవసరమైన సమయంలో వచ్చాయి. ముఖ్యంగా 'పెద్ది' డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు భారీ ఊరటను ఇచ్చింది. చిరంజీవి, రామ్ చరణ్ కలిసి 2026ను మెగా కుటుంబానికి చారిత్రాత్మక సంవ త్సరంగా మార్చారు. బాక్సాఫీస్ చరిత్రలో ఎన్నో సంవత్సరాలు గుర్తుండిపోయే అరుదైన అధ్యాయాన్ని సృష్టించారు.

## 'పెద్ది' అద్భుతమైన చిత్రం



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. 2026 సౌత్ ఇండియా నంబర్ వన్ గ్రాసర్‌గా నిలిచింది అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమో తోంది. బుచ్చిబాబు చరణ్‌కి 'పెద్ది' వంటి అద్భుతమైన సినిమా ఇచ్చారు. మీ తదుపరి సినిమా కూడా చరణ్‌తోనే ఉంటుందని వింటున్నాం. సమయం వచ్చినప్పుడు అది బయటకు వస్తుంది. నేను కూడా అది జరగాలని కోరుకుంటున్నాను. అనంత శ్రీరామ్.. పెద్దిలో అన్ని రకాల పాటలు రాశారు. అయితే ఐటెమ్ సాంగ్ పై కొన్ని విమర్శలు వస్తున్నాయి. దానిపై మీ స్పంద? ఐటెమ్ సాంగ్‌ను ఐటెమ్ సాంగ్‌లాగే ఆస్వాదిం చాలి. విమర్శ గానీ, ఆరోపణగానీ నిర్దిష్టంగా ఉండాలి. ప్రత్యేకంగా ఎజెండా పెట్టుకుని మాట్లాడితే దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఆల్రెడీ ఎడిట్ చేశాం. ఈ బుధ వారం నుంచి యాడ్ అవుతాయి. మొత్తం మూడు సన్నివేశాలు జోడించాం. హీరో యిన్‌కు సంబంధించిన మూడు సీన్లు, అలాగే జగపతిబాబుకి ఒక సీన్ ఉంటుంది. మిస్ అయిన అంశాలన్నీ అందులో ఉంటా యి. 95 శాతం మంది ప్రేక్షకులు సిని మాలోని కంటెంట్, కథ గొప్పతనం, రామ్ చరణ్ నటనను ప్రశంసించారు. జాన్వీ పాత్రకు సంబంధించి మరో రెండు సన్నివేశాలు ఉన్నాయి. అవి చూసిన తర్వాత ప్రేక్షకులు ఆ పాత్రకు ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారు. బుధవారం నుంచి ఆ సన్నివేశాలు జోడిస్తాం.

## ఒక కొత్త పాయింట్‌తో 'దీవాన' మూవీ: హార్షిత్ రెడ్డి



శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హార్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిసు_న్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. "దీవాన" సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. .మా నాన్న స్వస్థలం మిర్యాలగూడ. నేను పుట్టి పెరిగింది, చదువు కున్నది అంతా హైదరాబాద్ లోనే. సిటీ కల్చర్, ఇక్కడి లైఫ్ స్టైల్ తెలుసు. ఫస్ట్ యూట్యూబ్, ఇన్‌స్టాలో వీడియోస్ చేస్తుండే వాడిని. ఆ వీడియోస్ చూసి వైజయంతీ సంస్థ నిర్మించిన మెయిల్ సినిమాకు సెలెక్ట్ చేశారు. అది కోవిడ్ టైమ్, ఆన్ లైన్‌లోనే ఆడిషన్ తీసుకున్నారు. ఆ సినిమాలో బీకామ్ కంప్యూటర్స్ అంటూ నేను చెప్పే డైలాగ్ ఒకటి ఉంది. ఆ డైలాగ్ నచ్చి రాజ్ అండ్ డీకే శుభం సినిమాకు నన్ను ఎంపిక చేశారు. ఇదంతా ఒక డెస్టినీలా జరిగిపోయింది. కల్కి సినిమాలో ఆడిషన్ లేకుండానే నన్ను డైరెక్టర్ నాగ్ అశ్విన్ సెలెక్ట్ చేశారు. శుభం సినిమా కంటే ముందే "దీవాన" ఆఫర్ వచ్చింది. ఆహాలో నేను మెయిల్, తరగతి గది..ఇలాంటి మూవీస్ చేశాను. అలా నాకు వాసు, శ్రీదేవి పరిచయం. ఈ మూవీ స్క్రిప్ట్ విన్నప్పుడు వాళ్ల దగ్గరకు తీసుకెళ్లి డైరెక్టర్‌ను పరిచయం చేశాను. స్క్రిప్ట్ నచ్చి వాళ్లు ప్రొడ్యూస్ చేయడానికి ముందుకొచ్చారు. వీలైనంత బెటర్‌మెంట్స్ చేయాలనే కొంచెం టీమ్ తీసుకుని చేశాం. మేము సినిమా కంప్లీట్ చేస్తున్న దశలో అరవింద్ మా టీమ్ కు సపోర్ట్ చేయడానికి ముందు కొచ్చారు. సినిమా మొత్తం కంప్లీట్ అయ్యాక చూసి గీతా డిస్ట్రిబ్యూషన్ ద్వారా రిలీజ్ చేస్తామని చెప్పారు. "దీవాన" సినిమాకు ప్రతి షెడ్యూల్‌కు అన్నీ రిచెక్ చేసుకుంటూ డైలాగ్స్ బాగుండేలా చూసుకుంటూ షూటింగ్ చేస్తూ వచ్చాం. పక్కాగా వర్క్ షాప్స్ చేశాం. . అందుకే సెట్‌లో ఇంప్రువైజేషన్స్ చేశాం. సినిమా అంతా రియల్ లొకేషన్స్‌లో చేశాం. సీన్స్‌లో కనిపించే క్రౌడ్ అంతా షూటింగ్ చూడటానికి వచ్చిన రియల్ జనమే. 'దీవాన' సినిమాలో నా క్యారెక్టర్ పేరు మున్నా. ఆ క్యారెక్టర్‌లో ఓల్డ్ సిటీ అబ్బాయి అనే వైబ్ కనిపించాలి. మా ఆడిషన్ కు చాలా మంది పక్కా హైదరాబాదీ కుర్రాళ్లు వస్తుండేవాళ్లు. వాళ్లను అబ్జర్వ్ చేశా. నేను మలక్ పేట, కొత్త పేటలో తిరిగిన కుర్రాడినే. మా డైరెక్టర్ సికింద్రాబాద్ వాసి కావడం కూడా కలిసొచ్చింది.

## 'ఐ యామ్ గేమ్' ఆగస్టు 20న రిలీజ్



దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ఐ యామ్ గేమ్' నుంచి తాజాగా విడుదలైన పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొత్త పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్ అత్యంత స్టైలిష్ అవతార్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచారు. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించిన మేకర్స్, ఈ చిత్రాన్ని ఆగస్టు 20, 2026న ఓనం కానుక గా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయ నున్నారు. దుల్కర్ సల్మాన్ సొంత నిర్మాణ సంస్థ వేఫరర్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్, ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. నహాస్ హిదా యత్ దర్శ కత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ కలిసి నిర్మిస్తు న్నారు. దక్షిణ భారతదేశంలోని వందకు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన 'ఐ యామ్ గేమ్', ప్రస్తుతం మలయాళ సినీ పరిశ్రమ లో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు లలో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, సెకండ్ లుక్ పోస్టర్లకు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభించింది. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ హైఆక్టేన్ యాక్షన్ థ్రిల్లర్‌లో ఆంటోని వర్గీస్, మిస్కిన్, కాయదు లోహర్, కతిర్, పార్థ్ తివారి, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, యాక్షన్ సన్నివేశాలను ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్స్ అన్‌బరివ్ రూపొంది స్తున్నారు. బ్లాక్‌బస్టర్ 'ఆర్డీఎక్స్' తర్వాత నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న తదుపరి చిత్రం కూడా ఇదే. మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో పాన్ఇండియా స్థాయిలో విడుదల కానున్న 'ఐ యామ్ గేమ్', ప్రేక్షకులకు భారీ స్థాయి యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించడానికి సిద్ధమవుతోంది.

## 'ఇసకపట్నం' ట్రైలర్ విడుదల



భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియో తన తాజా తెలుగు ఒరిజినల్ సిరీస్ 'ఇసకపట్నం' ట్రైలర్ను హైదరాబాద్‌లో ఘనంగా విడుదల చేసింది. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన ఈ ఏడు ఎపిసోడ్ల క్రైమ్ థ్రిల్లర్ను ప్రశాంత్ రఘుతి రచించగా, తాజుద్దీన్ సయ్యద్ మాటలు అందించారు. తమడా మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్పై రాహుల్ తమడా, సైదీప్ రెడ్డి బొర్రా నిర్మించిన ఈ సిరీస్లో ఐశ్వర్య రాజేష్, సముద్రఖని ప్రధాన పాత్రలు పోషించారు. వీరితో పాటు సునీల్, నరేష్ అగస్త్య, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమకుల, రాజీవ్ కనకాల, మైమ్ గోపీ, రోహిణి, బెనర్జీ, జ్వాల కోటి, రవి వర్మ, రాజా చెంబోలు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. జూలై 2 నుంచి ప్రైమ్ వీడియో లో తెలుగు భాషతో పాటు తమిళం, హిందీ డబ్బింగ్ వెర్షన్లు, 15 భాషల సబ్టైటిల్స్తో ప్రపంచ వ్యాప్తంగా 240కి పైగా ప్రాంతాలలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. నేడు విడుదలైన ట్రైలర్ ఒక కల్పిత పోర్ట్ టౌన్ నేపథ్యంలో సాగే ఉత్కంఠభరిత కథను ఆవిష్కరించింది. నేరాలు, రాజకీయాలు, అధికార పోరాటాలు, వ్యక్తిగత విధేయతలు ఒకదానితో ఒకటి ఢీకొనే ఈ కథలో ఆశ, దురాశ, ప్రతీకారం ప్రధాన అంశాలు నిలుస్తాయి. ఈ సందర్భంగా దర్శకుడు గ్యారీ బీహెచ్ మాట్లాడుతూ ... ఇసాకపట్నం ఒక కల్పిత ప్రపంచంలో సాగే కథ అయినప్పటికీ, ఇందులో పాత్రలు, వారి భావోద్వేగాలు చాలా నిజాయితీగా ఉంటాయి. ఆశ, ప్రేమ, కోల్పోవడం, ప్రతీకారం వంటి అంశాలు ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతాయి. సముద్ర ఖని మాట్లాడుతూ.. ఈ కథలోని బలమైన భావోద్వేగాలు, నా పాత్రలో ఉన్న వైవిధ్యాలు నన్ను ఆకట్టుకున్నాయి. ఆశ, ప్రతీకారం, అధికారం కోసం మనుషులు ఎంత దూరమైనా వెళ్తారనే విషయాన్ని ఈ కథ బలంగా చెబుతుంది. ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ... పవర్, సంఘర్షణ తో నిండిన ప్రపంచంలో తనదైన నిర్ణయాలతో ముందుకు సాగే మహిళా భారతి కనిపిస్తుంది. సునీల్ మాట్లాడుతూ... ఇసకపట్నం ప్రపంచం చాలా వాస్తవంగా ఉంటుంది. ప్రతి పాత్రకు వారి సొంత లక్ష్యాలు, సంఘర్షణలు ఉంటాయి. నరేష్ అగస్త్య మాట్లాడుతూ ... ప్రతి ఎపిసోడ్తో కథ కొత్త మలుపులు తిరుగుతుంది. పాత్రల భావోద్వేగాలు, వారి నిర్ణయాలు కథను మరింత ఆసక్తికరంగా మారుస్తాయి. నరేష్ అగస్త్య మాట్లాడుతూ.. ప్రతి ఎపిసోడ్తో కథ కొత్త మలుపులు తిరుగుతుంది.

## 'రిస్క్'లో 'దేవుడు వరమందిస్తే' సాంగ్ రిలీజ్



జీకే మిరాకిల్స్ బ్యానర్‌పై ఘంటాడి కృష్ణ దర్శకత్వం లో, సందీప్ అశ్వ హీరోగా తెరకెక్కిన యూత్‌ఫుల్ సస్పెన్స్ థ్రిల్లర్ రిస్క్' ప్రపంచ వ్యాప్తంగా జూన్ 26న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్, పోస్టర్స్ ప్రేక్షకు ల్లో మంచి అంచనాలు క్రియేట్ చేయడంతో పాటు ఇండస్ట్రీ వర్గాల్లో హిట్ టాక్‌ను సొంతం చేసుకుంటు న్నాయి. ఈ చిత్రంలోని మెలోడీయస్ సాంగ్ దేవుడు వరమందిస్తే" ను బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ త్రినాథ్ రావు నక్కిన లాంచ్ చేశారు. ఇప్పటికే ఈ పాటతో పాటు సినిమాకు సోషల్ మీడియా లో మంచి స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు గంతాడి కృష్ణ, హీరో సందీప్ అశ్వ, నిర్మాతలు రవి సురేష్‌రెడ్డి, గుర్రం నర్సి ములు, కోప్రొడ్యూసర్ గడ్డంరవి కుమార్, కోడైరెక్టర్ బన్సీ కోయల్ కార్ పాల్గొన్నారు. అలాగే 'దేవుడు వరమందిస్తే' పాటకు సంబంధించిన హుక్ స్టెప్‌తో రీల్స్ లేదా డాన్స్ వీడియోలు చేసి సోషల్ మీడియాలో DevuduVaramandisthe RISKMovie SandeepAsh\ు ట్యాగ్ చేస్తే బెస్ట్ వీడియోలకు చిత్ర యూనిట్ ప్రత్యేక నగదు బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించింది. ప్రేమ, స్నేహం, యూత్ ఎమోషన్స్, సస్పెన్స్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేసింది.

# సూపర్ ఓవర్లో భారత్-ఏ బోల్తా

## ముక్కోణపు టి20 సిరీస్‌లో మరో ఓటమి * ఆఫ్గాన్‌పై గెలిస్తేనే ఫైనల్



**దంబుల్లా, జూన్ 15:** ముక్కోణపు సిరీస్‌లో భాగంగా దంబుల్లాలో భారత్, శ్రీలంక ఏ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరు టైగా ముగిసింది. సూపర్ ఓవర్‌లో శ్రీలంక ఆరు పరుగులతో విజయం సాధించింది. సూపర్ ఓవర్‌లో మొదట శ్రీలంక-ఏ 16 రన్స్ చేయగా.. భారత్-ఏ పది పరుగులకు పరిమితమైంది. మొదటి మూడు బంతుల్లో సూర్యాంష్ షెడ్గే మూడు పరుగులే చేయగలిగాడు. నాలుగు బంతికి వైభవ్ రెండు రన్స్, అయిదో బంతికి బౌండరీ సాధించాడు. చివరి బంతికి సింగిల్ తీయడంతో భారత్‌కు ఓటమి ఎదురైంది. మూడు మ్యాచ్‌ల్లో భారత్-ఏ ఏకైక విజయంతో రెండో స్థానంలో ఉంది. అఫ్ఘనిస్థాన్-ఏతో చివరి మ్యాచ్‌లో నెగ్గితేనే ఫైనల్ చేరుతుంది.

**చివరి ఓవర్ ఉత్కంఠ:** శ్రీలంక విజయం సాధించాలంటే 5 పరుగులు కావాలి. చేతిలో మూడు వికెట్లు ఉన్నాయి. చివరి ఓవర్ వేసిన అర్షద్ ఖాన్ తొలి బంతిని డాట్‌గా వేశాడు. రెండోబంతికి సమరవిక్రమ(113 బంతుల్లో 93)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. తర్వాతి మూడు బంతుల్లో మూడు సింగిల్స్ వచ్చాయి. చివరి బంతికి రెండు పరుగులు చేస్తే శ్రీలంకకు విజయం గ్యారంటీ. ఈ బంతికి లెగ్‌బై రూపంలో ఒక పరుగు వచ్చింది. రెండో పరుగు చేసే ప్రయత్నంలో గుణశేఖర్ రనౌటయ్యాడు. దీంతో స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

**సూర్యాంష్ షెడ్గే మెరుపులు :** మొదట బ్యాటింగ్ చేసిన భారత్ ఆరంభంలో తడబడింది. ఓపెనర్లు వైభవ్(21), ప్రభ్‌సిమ్రాన్(11)మరోసారి నిరాశపరిచారు. వైభవ్ 3 ఫోర్లు,ఓ సిక్స్‌తో టచ్‌లోకి వచ్చినట్లు కనపించినా.. కంటిన్యూ చేయలేకపోయాడు. రుతురాజ్ గైక్వాడ్(37), కెప్టెన్ తిలక్‌వర్మ(23), ఆయుష్ బదోనీ(15) ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలవకపోవడంతో భారత్-ఏ 125 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సూర్యాంష్ షెడ్గే(66 బంతుల్లో 72; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ విప్రజ్ నిగమ్(49 బంతుల్లో 51; 6 ఫోర్లు)తో కలిసి మెరుపులు మెరిపించాడు. టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట లోయర్ ఆర్డర్‌లో సూర్యాన్ష్, విప్రజ్ నిగమ్‌లు బాధ్యతాయుతంగా ఆడారు. 8వ వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని అందించి భారత్-ఏ స్కోరు 250దాటించాడు. చివరి బ్యాట్స్‌మెన్‌గా షెడ్గే అవుటవడంతో భారత్ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది.

**స్కోర్లు సమం:** 266 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన శ్రీలంక-ఏకు అదిరే ఆరంభం లభించింది. తొలి వికెట్‌కు డిక్‌వెల్లా(37), అవిష్కా(22) 56 పరుగులు అందించారు. ఈ దశలో భారత్ బౌలర్లు సింధూ, నిగమ్, బదోనీ వికెట్లు తీయగా.. మరోఎండ్‌లో సదీర సమరవిక్రమ(113 బంతుల్లో 93) ధాటిగా ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా వనుజా సహన్‌తో ఆరో వికెట్‌కు 51 రన్స్ వియస్కాంత్‌తో కలిసి ఏడో వికెట్‌కు 35 రన్స్, చమిక గుణశేఖరతో కలిసి ఎనిమిదో వికెట్‌కు 33 రన్స్ జోడించి శ్రీలంకను విజయానికి చేరువ చేశాడు. చివర్లో సమరవిక్రమ అవుటవడంతో మ్యాచ్ టర్న్ తీసుకుంది. నిర్ణీత50 ఓవర్లలో 9 వికెట్లకు 265 రన్స్ చేయడంతో స్కోర్లు సమం అయ్యాయి.

### భారత్-ఏకు పది రన్స్ పెనాల్టీ

ఈ మ్యాచ్‌లో శ్రీలంక-ఏ ఒక్క బంతి ఆడకుండానే స్కోరు బోర్డుపై పది పరుగులు చూసి అంతా ఆశ్చర్యపోయారు. కారణం తెలిసి షాక్ అయ్యారు. పిచ్ మధ్యలో బ్యాట్స్‌మెన్ పరిగెత్తినందుకు గాను భారత్-ఏకు పది పెనాల్టీ పరుగులు పడ్డాయి. దీంతో శ్రీలంక ఇన్నింగ్స్ స్కోరుబోర్డు 10/0తో ప్రారంభమైంది. భారత్-ఏ జట్టు బ్యాటింగ్ చేస్తున్నపుడు ఈ ఘటన చోటుచేసుకుంది. 35వ ఓవర్లో విప్రజ్ సింగిల్ తీసే క్రమంలో పొరపాటున పిచ్ మధ్యలో నుంచి పరిగెత్తాడు. దీంతో అంపైర్ అతనికి తొలి వార్నింగ్ ఇచ్చాడు. 37వ ఓవర్లోనూ విప్రజ్ మరోసారి పొరపాటున పిచ్ మధ్యలో నుంచే పరుగు తీశాడు. దీంతో రెండుసార్లు నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను అంపైర్... 5 పరుగుల చొప్పున మొత్తం పది రన్స్ పెనాల్టీ విధించాడు.






# ప్రపంచకప్‌లో గోల్స్ వర్షం : గ్రాండ్‌గా జర్మనీ, స్వీడన్ ఎంట్రీ

## నెదర్లాండ్స్‌ను నిలువరించిన జపాన్ * ఈక్వెడార్‌పై చివరి నిమిషం గోల్‌తో ఐవరీకోస్ట్ గెలుపు

**హూస్టన్:** అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచకప్ సాకర్ టోర్నీలో మాజీ ఛాంపియర్ జర్మనీ, హాట్ ఫేవరెట్ స్వీడన్ బోణీ కొట్టగా... ఐవరీ కోస్ట్ ఏకైక గోల్‌తో ఈక్వెడార్‌ను ఓడించింది. ఇక మరో అగ్రశ్రేణి టీమ్ నెదర్లాండ్స్‌ను జపాన్ నిలువరించింది. డ్రాతో ముగించింది.

హూస్టన్‌లో జరిగిన గ్రూప్-ఈ తొలి మ్యాచ్‌లో మాజీ ఛాంపియన్ జర్మనీ గోల్స్ వర్షం కురిపించింది. తొలిసారి ప్రపంచకప్ ఆడుతున్న కురసావ్ జట్టును 7-1తేడాతో చిత్తు చేసింది. జర్మనీ స్టార్ ఫార్వర్డ్ కై హావర్జ్ రెండు గోల్స్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. చిన్న దేశం కురసావ్ సైతం ఫుట్‌బాల్ అభిమానుల హృదయాలను గెలుచుకుంది.

### 21వ నిమిషంలో మ్యాజిక్

మ్యాచ్ ప్రారంభమైన నిమిషం నుంచే జర్మనీ దూకుడుగా ఆడింది. ఫార్వర్డ్లు కురసావ్ గోల్ పోస్ట్‌పై పదేపదే దాడులు చేశారు. 6వ నిమిషంలో జర్మనీ మిడ్‌ఫీల్డర్ ఫెలిక్స్ పెనాల్టీ బాక్స్ వెలుపల నుంచి కొట్టిన లోషాట్... నేరుగా నెట్‌లోకి దూసుకెళ్లింది. దీంతో జర్మనీ మొదటి గోల్ సాధించింది. జర్మనీ ఆధిక్యానికి 21వ నిమిషంలో కురసావ్ తెరదించింది. ఆ జట్టు తరపున లివానో కొమెనెంసియా అద్భుతమైన గోల్ సాధించాడు. జర్మనీ డిఫెండర్లను తప్పిస్తూ ఎడమకాలితో కొట్టిన క్లాసిక్ షాట్ గోల్‌గా మారింది. ఈగోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. ప్రపంచకప్‌లో కురసావ్‌కు మొట్టమొదటి గోల్.

### ఆ తర్వాతంతా జర్మనీలదే

కురసావ్ కొట్టిన గోల్ జర్మనీకి హెచ్చరికలా పనిచేసింది. జర్మనీ మరింత దూకుడు పెంచుతూ వరుసగా ఆరు గోల్స్ సాధించింది. నథానియల్ అందించిన కార్నర్ కిక్‌ను జర్మనీ డిఫెండర్ నికో ష్లోటర్‌బెక్ బుల్లెట్‌లాంటి హెడర్ ద్వారా గోల్‌గా మలిచాడు. దీంతో జర్మనీ2-1 ఆధిక్యాన్ని సాధించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 3-1తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో మరో నాలుగు గోల్స్ నమోదుచేసింది. జమల్ ముసియాల 47వ, నాథానియెల్ 68వ, డెనిజ్ ఉండవ్ 78వ, కై హావర్జ్ 88వ నిమిషంలో గోల్స్ అందించారు.

### గ్రాండ్‌గా ఆరంభించిన స్వీడన్

గ్రూప్-ఎఫ్‌లో ట్యునీషియాపై 5-1 గోల్స్ తేడాతో స్వీడన్ ఘన విజయం సాధించింది. 22 ఏళ్ల యాసిన్ అయారీ రెండు గోల్స్‌తో స్వీడన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే యాసిన్ అయారీ స్వీడన్‌కు గోల్స్ ఖాతా తెరిచాడు. ఆ తర్వాత అలెక్సాండర్ ఐసాక్ (30వ) గోల్‌తో స్వీడన్ 2-0 లీడ్ సాధించింది. అయితే, ట్యునీషియా ఆటగాడు ఒమర్ రెకిక్ 43వ నిమిషంలో గోల్‌తో స్వీడన్ ఆధిక్యం 2-1కి తగ్గింది. కానీ, పదేపదే ట్యునీషియా గోల్ పోస్టుపై ఎటాక్ చేసిన స్వీడన్ ఫలితాన్ని సాధించింది. విక్టోర్ (59వ), మాట్టియస్ (84వ) గోల్స్‌తో స్వీడన్ విజయం ఖరారు అయింది. ఆట మరికాసేపట్లో ముగుస్తుందనగా యాసిన్ అయారీ మరో గోల్ సాధించి స్వీడన్‌కు తిరుగులేని 5-1 ఆధిక్యం అందించాడు. యాసిన్ పుట్టింది స్వీడన్‌లోనే అయినా మూలాలు ట్యునీషియావి. దీంతో గోల్స్ కొట్టిన రెండు సార్లు కూడా యాసిన్ సంబరాలకు దూరంగా ఉన్నాడు.

### చివరి నిమిషం గోల్‌తో ఐవరీ కోస్ట్

మరోవైపు గ్రూప్ ఈలో ఈక్వెడార్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐవరీ కోస్ట్ విజయం సాధించింది. 90వ నిమిషం వరకు ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. అయితే చివరి నిమిషంలో అమాద్ డియల్లో సాధించిన గోల్‌తో ఐవరీ కోస్ట్ ఈక్వెడార్‌పై 1-0 తేడాతో గట్టెక్కింది. గత 12 ఏళ్లలో ఫిఫా ప్రపంచ కప్‌లో ఐవరీ కోస్ట్‌కు ఇదే మొదటి విజయం.

### నెదర్లాండ్స్ ఆశలకు జపాన్ బ్రేక్

డాలస్ వేదికగా జరిగిన నెదర్లాండ్స్, జపాన్ గ్రూప్-ఎఫ్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠ రేపింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌చివరకు 2-2తో డ్రాగా ముగిసింది. ఈమ్యాచ్‌లో నెదర్లాండ్స్ కాస్త ఆధిపత్యం కనబరిచినా... చివర్లో కోకి ఒగావా గోల్‌తో జపాన్ ఊపిరిపీల్చుకుంది. నెదర్లాండ్స్ గెలుపు ఆశలపై నీళ్లు చల్లింది.

తొలి అర్ధభాగం గోల్ లెస్‌గా ముగిసింది. రెండో భాగంలోనే ఇరుజట్లు కలిసి ఏకంగా నాలుగు గోల్స్ నమోదుచేశాయి. తొలి 14 నిమిషాల్లోనే మూడు గోల్స్ వచ్చాయి. తొలుత నెదర్లాండ్స్ ఆటగాడు వాన్ వాన్ డైక్ 50వ నిమిషంలో తొలి గోల్ అందించాడు. 57వ నిమిషంలో జపాన్ ప్లేయర్ నకమురా కూడా గోల్ సాధించి స్కోర్లను 1-1తో సమం చేశాడు. మరో ఏడు నిమిషాల్లోనే సమ్మర్‌విల్లే గోల్ చేయడంతో నెదర్లాండ్స్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కోకి ఒగావా హెడర్‌తో అద్భుత గోల్ అందించాడు. దీంతో 2-2తో డ్రా అవడంతో జపాన్ సంబరాలతో హోరెత్తించింది.

# 21 నుంచి తెలంగాణ టి20 క్రికెట్ లీగ్




**హైదరాబాద్, జూన్ 14(వార్త క్రీడా ప్రతినిధి)** హెచ్‌సీఏ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి మొదలుకానున్న ఈటోర్నీ షెడ్యూల్‌ను విడుదల చేశారు. లీగ్‌లో 8 జట్లు పోటీపడుతుండగా.. ప్రతి జట్టు మిగతా అన్ని టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడతుంది. తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ తలపడనున్నాయి. ఆ తర్వాత ప్రతి రోజు రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తారు. జులై 7న లీగ్ దశ ముగుస్తుంది. పాయింట్ల పట్టికలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్‌కు చేరుకుంటాయి. జూలై9న ఎలిమినేటర్, క్వాలిఫయర్-1 మ్యాచ్‌లు.. జూలై10న క్వాలిఫయర్-2 మ్యాచ్‌లు జరుగుతాయి. 12న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. మ్యాచ్‌లన్నీ ఉప్పల్ స్టేడియంలో జరుగుతాయని నిర్వాహకులు ప్రకటించారు.

**టీజీ20 లీగ్ జట్లు:** పాలమూరు స్ట్రైకర్, అన్విత ఖమ్మం ఏసెస్, రంగారెడ్డి రైజర్స్, నల్గొండ నైట్స్, వరంగల్ వారియర్స్, మెదక్ ఫాల్కన్స్, హైదరాబాద్ ఈ ఛాంపియన్స్, కరీంనగర్ డైమండ్స్

# నితిన్, లికిత జోడీకి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్

**పుణే:** ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్లు సత్తా చాటారు. సుచిత్రా బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన నితిన్ కుమార్, లికితా శ్రీవాస్తవ జోడీ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ సాధించింది. టోర్నీలో పాల్గొన్న టాప్ జోడీ షట్లర్లను ఓడించి టైటిల్ కైవసం చేసుకుంది. కాగా నితిన్, లికితా జోడికి ఇది వరుసగా రెండో మిక్సడ్ డబుల్స్ టైటిల్. ఇటీవలే మరో జాతీయ టోర్నీలోనూ ఈ జోడీ టైటిల్ నెగ్గారు. మహిళల డబుల్స్ విభాగంలో శ్రేయ బాలా జీతో కలిసి లికితా శ్రీవాస్తవ రన్నరప్‌గా నిలిచింది. ఓవరాల్‌గా హైదరాబాద్‌లోని సుచిత్రా బ్యాడ్మింటన్ అకాడమీ ఆటగాళ్లను




ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొట్టేలా చేయడంలో విజయవంతమయ్యింది.




# అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం

## సెన్సెక్స్ 736, నిఫ్టీ 231 పాయింట్లు వృద్ధి

# దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్

**ముంబై, జూన్ 15:** అమెరికా, ఇరాన్‌లు శాంతి ఒప్పందాన్ని ప్రకటించడంతో, భౌగోళిక రాజకీయ ఆందోళనలు తగ్గి, ప్రపంచ మార్కెట్లలో రిస్క్ అపెటైట్ పెరగడంతో ఇన్వెస్టర్ సెంటిమెంట్ మెరుగుపడింది. దీంతో భారత ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు సోమవారం భారీగా లాభాలతో ముగిశాయి. బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 736.38 పాయింట్లు (0.97 శాతం) పెరిగి 76,264.33 వద్ద ముగియగా, నిఫ్టీ 231 పాయింట్లు (0.98 శాతం) లాభపడి 23,853.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ టెక్నికల్ అవుట్‌లుక్‌పై వ్యాఖ్యానిస్తూ, 24,000 మార్క్ ఒక ముఖ్యమైన తక్షణ నిరోధక ప్రాంతంగా మిగిలి ఉందని నిపుణులు తెలిపారు. "దిగువ వైపున, 23,800 జోన్ తక్షణ మద్దతు ప్రాంతంగా ఉంది. ప్రస్తుత సానుకూల నిర్మాణాన్ని కొనసాగించడానికి ఈ శ్రేణికి పైన నిలబడటం కీలకం," అని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు. నిఫ్టీలోని భాగమైన ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్, సెషన్ సమయంలో పెట్టుబడిదారుల నుండి బలమైన ఆసక్తిని పొంది, అగ్రగామిగా నిలిచాయి. ఈ ర్యాలీ విస్తృత మార్కెట్లలో కూడా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.29 శాతం పురోగమించగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.11 శాతం పెరిగింది. రంగాల వారీగా చూస్తే, రియల్ ఎస్టేట్ స్టాక్స్ లాభాలకు నాయకత్వం వహించాయి. నిఫ్టీ రియల్టీ సూచీ రోజులో 4 శాతానికి పైగా పెరిగింది. పెట్టుబడిదారులు దేశీయ వినియోగ ఆధారిత రంగాలలో తమ పెట్టుబడులను పెంచడంతో, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, నిఫ్టీ ఆటో సూచీలు కూడా విస్తృత మార్కెట్ కంటే మెరుగైన పనితీరును కనబరిచాయి. అయితే, ఫార్మాస్యూటికల్ స్టాక్స్ విస్తృత మార్కెట్ ర్యాలీలో వెనుకబడ్డాయి, సెషన్ సమయంలో నిఫ్టీ ఫార్మా సూచీ అత్యంత బలహీనమైన రంగాల సూచీగా నిలిచింది.

పశ్చిమ ఆసియాలో నాలుగు నెలలుగా కొనసాగుతున్న సంఘర్షణను ముగించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్‌లు శాంతి ఒప్పందానికి అంగీకరించాయన్న వార్తలను మార్కెట్ వర్గాలు స్వాగతించాయి. నివేదికల ప్రకారం, రెండు దేశాలు అన్నిరంగాలలో సైనిక కార్యకలాపాలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. దీనితో ఈ ప్రాంతంలో స్థిరత్వం మెరుగుపడుతుందనే ఆశలు చిగురించడంతో పాటు, ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం కలుగుతుందనే ఆందోళనలు తగ్గాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడంతో అన్ని రంగాలలోనూ విస్తృతంగా కొనుగోళ్లు జరిగాయి. ఫలితంగా, ప్రధాన, ఇతర మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య శాంతి ఒప్పందం ప్రకటన పశ్చిమ ఆసియాలోని సంఘర్షణకు సంబంధించిన ఆందోళనలను తగ్గించడంలో సహాయపడిందని, పెట్టుబడిదారులు రిస్క్ ఆస్తుల వైపు మళ్లడానికి ఇది ప్రోత్సహించిందని విశ్లేషకులు తెలిపారు.

గత నాలుగు నెలలుగా కొనసాగుతున్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు సద్దుమణిగే సూచనలు కనిపిస్తుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామం ముడి చమురు ధరలలో మరింత స్థిరత్వంపై అంచనాలను కూడా పెంచింది. దీనిని సాధారణంగా భారత ఆర్థిక వ్యవస్థకు, కార్పొరేట్ ఆదాయాలకు సానుకూలంగా పరిగణిస్తారు.

ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఈ పరిణామం పెద్ద ఊరటనిచ్చే అంశం. చమురు ధరలు తగ్గడల వల్ల ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చి, తద్వారా దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# డాలర్‌పై బలపడిన రూపాయి

**ముంబై, జూన్ 15:** అంతర్జాతీయంగా చోటు చేసుకున్న కీలక పరిణామాలతో నేడు ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ భారీగా బలపడింది. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్తల నేపథ్యంలో ముడి చమురు ధరలు పతనం కావడంతో రూపాయి ఏకంగా 58 పైసలు లాభపడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో 94.70 వద్ద ట్రేడింగ్ ప్రారంభించిన రూపాయి, ఆ తర్వాత మరింత పుంజుకుని 94.60వద్ద స్థిరపడింది. గత సెషన్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.18 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధానికి ముగింపు పలుకుతూ శాంతి ఒప్పందం కుదిరిందని, దీనిలో భాగంగా వ్యూహాత్మక హార్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తారని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం సానుకూల పరిణామాలకు ప్రధాన కారణమైంది.

### పతనమైన ముడిచమురు ధరలు

గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర దాదాపు 5శాతం పడిపోయి 83డాలర్లకు చేరగా, యుఎస్ డబ్ల్యుటిఐ కూడా 5శాతానికి పైగా తగ్గి 80 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ముడి చమురు ధరలు తగ్గడం భారత్‌కు పెద్ద ఊరటనిచ్చే అంశమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటైన భారతదేశానికి, ధరలు తగ్గడం వల్ల దిగుమతి బిల్లు గణనీయంగా తగ్గుతుంది. ఇది దేశ కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి)పై ఒత్తిడిని తగ్గించి, ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది.



# ద్రవ్యోల్బణం 5.6శాతం ఉండే ఛాన్స్

**న్యూఢిల్లీ, జూన్ 15:** 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు ప్రధాన ద్రవ్యోల్బణం సగటున 5.6 శాతంగా ఉండే అవకాశం ఉందని, 50 బేసిస్ పాయింట్ల కంటే ఎక్కువ వడ్డీ రేట్ల పెంపును ఆశించలేమని సోమవారం ఒక నివేదిక తెలిపింది. ఇంధన, ఎల్ నినో షాక్‌లు ఆహార, ఇంధన ధరలను పెంచుతున్నందున, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2026 మూడవ, నాల్గవ త్రైమాసికాలలో రెండుసార్లు వడ్డీ రేట్లను పెంచి, రెపో రేటును 5.75శాతానికి తీసుకువెళ్లే ఒక స్వల్ప వడ్డీ రేట్ల పెంపు ప్రక్రియను మాత్రమే చేపట్టవచ్చని హెచ్‌ఎస్‌బిసి గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. "ప్రస్తుతానికి మేము 50 బేసిస్ పాయింట్ల కంటే ఎక్కువ వడ్డీ రేట్ల పెంపును అంచనా వేయడం లేదు, ఎందుకంటే ద్రవ్యోల్బణంలో కొంత పెరుగుదలను ఆర్‌బిఐ తాత్కాలికమైనదిగా పరిగణిస్తుందని నమ్ముతున్నాము" అని ఆ నివేదిక తెలిపింది.



# భారత్ ఇన్నోవేట్స్‌లో 30కు పైగా ఒప్పందాలు


**న్యూఢిల్లీ, జూన్ 15:** ఫ్రాన్స్‌లోని నైస్‌లో నిర్వహిస్తున్న 'భారత్ ఇన్నోవేట్స్'లో ఉమ్మడి పరిశోధన, విద్యార్థుల మార్పిడి కోసం అంతర్జాతీయ మార్గాలను బలోపేతం చేయడానికి 30కి పైగా అవగాహన ఒప్పందాలు, ఉమ్మడి ప్రకటనలపై సంతకాలు జరిగాయి. దీంతో భారత్ ఇన్నోవేట్స్ 2026 ప్రారంభ రోజు ఆవిష్కరణ ఒప్పందాలు, డీప్‌టెక్ భాగస్వామ్యాలు, వ్యూహాత్మక చర్చలతో నిండిపోయిందని సోమవారం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారతీయ, ప్రపంచ ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆవిష్కరణ కేంద్రీకృత అవగాహన ఒప్పందాలు, ఉమ్మడి ప్రకటనలు కుదిరాయి. వీటిలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత, పరిశోధన సహకారం, స్టార్టప్ మద్దతును ప్రోత్సహించడానికి భారతీయ ఉన్నత విద్యా సంస్థలు లేదా ఇంక్యుబేటర్లు, ఫ్రెంచ్ లేదా గ్లోబల్ ఇంక్యుబేటర్ల మధ్య 12 ఒప్పందాలు జరిగాయి. భారతీయ ఆవిష్కర్తలకు సాంకేతిక అభివృద్ధి, వాణిజ్యీకరణ, మార్కెట్ ప్రాప్యతను సులభతరం చేయడానికి ప్రముఖ గ్లోబల్ కార్పొరేషన్లతో 16 ఒప్పందాలు ఉన్నాయి. ఇంకా, విద్యార్థుల మార్పిడి, ఉమ్మడి పరిశోధన, ఆవిష్కరణలకు మద్దతు, విద్యా సహకారం, ప్రతిభ అభివృద్ధిలో సహకారాన్ని పెంపొందించడానికి 13 ఫ్రెంచ్ విశ్వవిద్యాలయాలు, 11 ఐఐటీలు, ఐఐఎస్‌సిలతో భాగస్వామ్య ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్, ఇండియా-ఫ్రాన్స్ ఎటిఎల్ బ్రిడ్జ్, ఫ్రాన్స్‌లో మొట్టమొదటి స్కూల్ ఇన్నోవేషన్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రెండు దేశాల యువ ఆవిష్కర్తల మధ్య సహకారాన్ని సులభతరం చేయడం ద్వారా భారతదేశపు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఫ్రేమ్‌వర్క్‌ను ఫ్రాన్స్‌కు విస్తరిస్తుంది.

# బెస్ట్ బ్యూటిఫుల్ ఎయిర్‌పోర్టులుగా

## నవీ ముంబై, గువాహాతి విమానాశ్రయాలు

**ముంబై, జూన్ 15:** ప్రతిష్టాత్మకమైన ప్రిక్స్ వెర్సైల్స్ ఆర్కిటెక్చర్, డిజైన్ అవార్డుల ద్వారా తమకు చెందిన రెండు విమానాశ్రయ ప్రాజెక్టులు నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం, గువాహాటిలోని లోకప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త టెర్మినల్ 2 ప్రపంచంలోని 'అత్యంత అందమైన విమానాశ్రయాలు 2026' జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ గుర్తింపుతో, వాస్తుశిల్ప నైపుణ్యం, సుస్థిరత, ప్రయాణీకుల కేంద్రీకృత డిజైన్‌కు గాను ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన ఏడు విమానయాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఈ రెండు భారతీయ విమానాశ్రయాలు స్థానం సంపాదించాయి. పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ఏటా ప్రదానం చేసే ప్రిక్స్ వెర్సైల్స్ అవార్డులు, నూతనత్వం, సాంస్కృతిక గుర్తింపు, పర్యావరణ బాధ్యతలను మిళితం చేసే సమకాలీన వాస్తుశిల్ప విజయాలను ప్రశంసిస్తాయి. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 1, దాని విశిష్టమైన తామర పువ్వు ప్రేరేపిత వాస్తుశిల్పం, భవిష్యత్ డిజైన్‌కు గాను గుర్తింపు పొందింది. ఈ టెర్మినల్, సాంకేతికత, కళ, కార్యాచరణలను సమన్వయం చేసి, ప్రపంచ స్థాయి ప్రయాణ అనుభవాన్ని అందిస్తూనే, ఆధునిక ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలనే భారతదేశ ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది. ఇదిలా ఉండగా, గువాహాటిలోని లోకప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2, ఆ ప్రాంతపు పర్యావరణ, సాంస్కృతిక వారసత్వం నుండి ప్రేరణ పొందిన తన డిజైన్‌కు ప్రశంసలు అందుకుంది. ఈశాన్య భారతదేశానికి ఒక కీలక ప్రవేశ ద్వారంగా నిలిచిన ఈ టెర్మినల్, వెదురు ఆర్కిడ్ నుండి నిర్మాణ స్ఫూర్తిని పొందింది. ఇది ఆ ప్రాంతపు గొప్ప జీవవైవిధ్యాన్ని చాటిచెప్పే బయోఫిలిక్ డిజైన్ సూత్రాలను పాటిస్తూనే, సుస్థిరత, కార్యాచరణ సామర్థ్యాన్ని కూడా నిర్ధారిస్తుంది.







# ఏప్రిల్‌లో కరెంట్ ఖాతా మిగులు

## 4.7 బిలియన్ డాలర్లు

**ముంబై, జూన్ 15:** స్టాక్ మార్కెట్ల నుండి నికర విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల (ఎఫ్‌పిఐ) ప్రవాహం పెరిగినప్పటికీ, గత ఏడాది ఇదే నెలలో 4.8 బిలియన్ డాలర్ల లోటుతో పోలిస్తే, ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్ 4.7 బిలియన్ డాలర్ల కరెంట్ ఖాతా మిగులును నమోదు చేసిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సోమవారం విడుదల చేసిన ప్రాథమిక గణాంకాలు వెల్లడించాయి. ఈ నెలలో సేవల ఎగుమతులు పెరగడం, విదేశాలలో పనిచేస్తున్న భారతీయుల నుండి రెమిటెన్సులు అధికంగా రావడం వల్ల ఈ మిగులు సాధ్యమైంది. నికరసేవల ఎగుమతులు ఈ నెలలో 18.6 బిలియన్ డాలర్లకు బలపడ్డాయి, గత ఏడాది ఏప్రిల్‌లో ఇది 15.9 బిలియన్ డాలర్లుగా ఉంది. గణాంకాల ప్రకారం, సేవల ఎగుమతులు 37 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 18.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రధానంగా రెమిటెన్సులతో కూడిన నికర బదిలీలు, గత ఏడాది ఇదే నెలలో 9.4 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఏప్రిల్‌లో 16 బిలియన్ డాలర్లకు గణనీయంగా పెరిగాయి. నికర ఆదాయ లోటు 3 బిలియన్ డాలర్ల నుంచి 1.9 బిలియన్ డాలర్లకు తగ్గింది. మూలధన ఖాతా విషయానికొస్తే, నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గత ఏడాది ఇదే నెలలోని 1.6 బిలియన్ డాలర్ల నుంచి 2026 ఏప్రిల్ నాటికి 7.4బిలియన్ డాలర్లకు పెరిగాయి. అదే సమయంలో, దేశంలోకి స్థూల ఎఫ్‌డీఐ ప్రవాహాలు 5 బిలియన్ డాలర్ల నుంచి 11.4బిలియన్ డాలర్లకు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయి. అయితే, నికర విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పిఐ) ఈ నెలలో 8.7 బిలియన్ డాలర్ల మేర బయటకు వెళ్లాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.